# రాగం తీసే కోయిల

నవల

- అత్తలూరి విజయలక్ష్మి



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 167

కౌముది మాసపత్రికలో

జనవరి 2016 సంచిక నుంచి డిసెంబర్ 2016 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

**"వెళ్ళొస్తాం మేడమ్"** సోఫాలోంచి లేచి నలుగురు విలేకరులు నమస్కరించారు.

ఆమె చిరునవ్వుతో సెలవు అన్నట్టు నమస్కరించింది.

"మరోసారి ఆలోచించండి మేడమ్" ఒకమ్మాయి అంది వెళ్ళబోతూ.

"ఇందులో ఆలోచించడానికేం ఉంది తల్లీ పెద్దదాన్ని అయిపోయాను, పాతనీరు కొట్టుకుపోవడం, కొత్తనీరు ప్రవహించడం సహజమేకదా! ఎంతకాలం వింటారు నా పాటలు. అభిరుచులు మారాయి. జీవన విధానం మారింది. సంగీతంలో కూడా వేగం పెరిగింది. మారుతున్న కాలాన్ని ఆహ్వానించండి" చిరునవ్వుతో అంది ఆవిడ.

"ఓల్డ్ ఈజ్ గోల్డ్ మేడమ్"

"అభిరుచి ఉన్నవాళ్ళకి నా ఆల్బమ్స్ ఉన్నాయి. నా నేపథ్యగీతాలు ఉన్నాయి, నా సిడిలు ఉన్నాయి."

ఆవిడ తిరుగులేని నిర్ణయం కాదనే స్వాతంత్ర్యం ఎవరికుంది? అందరూ నిశ్శబ్దంగా వెళ్ళిపోయారు. పనిమనిషి వచ్చి ఖాళీ అయిన కాఫీ కప్పులు, బిస్కెట్ ప్లేట్లు తీసికెళ్ళింది.

ఆవిడ లోపలికి వెళ్ళి మంచం మీద వాలింది. శారీరకంగా, మానసికంగా అలసి, సొలసి వృద్ధురాలైన ఆమెకి మెత్తటి పరుపుమీద వాలగానే అమ్మ ఒడిలో వాలినట్లు అనిపించింది.

దాదాపు నాలుగురోజుల నుంచి వరసగా వస్తున్నారు కొన్ని సాంస్కృతిక సంస్థలవాళ్ళు ఆమె దగ్గరికి తిరిగి ఆమె పాటల ప్రవాహంలో ముంచెత్తమని, ఆమె గాన మాధుర్యాన్ని చవి చూపించమని కోరుతూ. కానీ, ఆమెకి అంగీకరించాలనిపించడంలేదు. ఇంతకాలం ఉషాకాంత అనబడే ఓ సుమధుర గాయని చచ్చిందా, బతికిందా అని కూడా ఆలోచించనివాళ్ళు, తన ప్రతిభ తెలిసి కూడా తనని అగౌరవపరచినవాళ్ళు, తన ఎదురుగానే కాలం మారిందండి ఇప్పుడావిడ ఇంకా పాతకాలంనాటి పాటలు పాడుతోంది కొత్తవాళ్ళకి అవకాశం ఇద్దాం అంటూ అవమానకరంగా మాట్లాడినవాళ్ళు.. వాళ్ళందరినీ తల్చుకుంటే మనసంతా వేదనతో నిండిపోతుంది.

ఉషాకాంత అలనాటి నేపథ్యగాయనేకాదు, గొప్ప కర్ణాటక సంగీత కళాకారిణి. తీయని స్వరం ఆమెకి దేవుడిచ్చిన వరం.. జీవితం ఆమెని శాపగ్రస్తురాలిని చేసి అడుగడుగునా పరీక్షించినా, దేవుడిచ్చిన వరాన్ని అపురూపంగా కాపాడుకుంటూ ఒక గొప్ప కళాకారిణిగా సమాజంలో తనకో స్థాయిని పొందిన ఉషాకాంత ఇప్పుడు అనామకురాలు.

ఎన్నో వందల కచేరీలు చేసిన ఆమె సంగీతాన్ని ఎంతగానో ప్రేమించింది, గౌరవించింది. భుక్తికోసం సినీ నేపథ్యగాయనిగా వచ్చిన అవకాశం ఉపయోగించుకున్నా, ఎక్కువగా భక్తిగీతాలు, లాలిపాటలు, జయదేవుని అష్టపదులు, అన్నమాచార్య కీర్తనలు వంటివే పాడింది. ఆ రోజుల్లో పౌరాణిక చిత్రాల పరంపర ఉండేది. ప్రతి చిత్రంలో ఆమె స్వరమే మధురంగా, శ్రావ్యంగా మోగుతూ వీనులవిందు చేసేది.

క్రమంగా ఆ ప్రభావం తగ్గడం, మరికొందరు గాయనీమణులు చిత్రసీమలోకి అడుగుపెట్టడం వంటి మార్పులేకాక, సినీ జగత్తులో మరెన్నో విచిత్రమైన మార్పులు రావడం, చిత్రమైన సాహిత్యం, అంతకన్నా చిత్రమైన సంగీతం సినీ పరిశ్రమని ముంచేయడంతో క్రమంగా ఉషాకాంతకి అవకాశాలు తగ్గిపోయాయి. పోటీ పెరగడంతో క్రమంగా ఆవిడ శాస్త్రీయ సంగీత కచేరీలు కూడా తగ్గిపోయాయి.

ఆమె పాటలు ఒక వర్గం వాళ్ళే అభిమానించారు, వారే ఆమెని ఆరాధించారు. ఆవిడ కీర్తికోసం తాపత్రయపడలేదు, పేరు ప్రతిష్టలకోసం ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. తనకి భగవంతుడిచ్చిన గాత్రాన్ని నమ్ముకుంది, అందుకే భగవంతుడి కోసమే పాడింది. కాబట్టి తన జీవితంలో కానీ, కెరియర్‌లో కానీ ఎలాంటి మార్పు జరిగినా అది భగవంతుడి ఆజ్ఞగానే భావించి మార్పులని హుందాగా స్వీకరించింది.

నెమ్మదిగా కాలం మారుతోందని, వేగంగా పరుగెత్తుతోందని గ్రహించి ఆ వేగాన్ని అందుకుని పరిగెత్తే శక్తి తనకు లేదని గ్రహించి కాలప్రవాహానికి ఎదురీదలేక పాడడం మానేసింది. అటు అభిమానులు, ఇటు కార్యక్రమ నిర్వాహకులు, సినీ నిర్మాతలు ఎవరూ కూడా నిష్క్రమణాన్ని పట్టించుకోలేదు.

ఇప్పటికి దాదాపు ఒక దశాబ్దం కావస్తోంది ఆమె అజ్ఞాతంగా జీవించడం ప్రారంభించి. అవకాశం తన దగ్గరకు రావాలికానీ, తను అవకాశాలను వెతుక్కుంటూ వెళ్ళడం ఆమె సిద్ధాంతాలకు వ్యతిరేకం. అందుకే ఉషాకాంత ఏరోజుకారోజు తన జీవితంలో వస్తున్న మార్పుల్ని హుందాగా ఆహ్వానిస్తూ తను సంపాదించిన కొద్దిపాటి ఆస్తిని కాపాడుకుంటూ అడపా, దడపా ఆకాశవాణిలో కచేరీలిస్తూ ఉండిపోయింది.

అలా చేసాక కూడా కొంతకాలం మానసికంగా చాలా మధనపడింది.

మంచిపని చేసానా? అని తనని తాను అనేకసార్లు ప్రశ్నించుకుంది. చాలా మంచిపని చేసావు కాలం మారింది, ప్రజల అభిరుచుల్లో మార్పొచ్చింది. జలపాతంలాంటి శ్రావ్యమైన సంగీతం కాదు వాళ్ళకి కావాల్సింది. హోరెత్తే సంగీతం కావాలి. యువతలో చైతన్యాన్ని కలిగించి, వాళ్ళచేత గంతులేయించే శబ్దాలు కావాలి. నువ్వు సరిపోవు వాళ్ళకి.. వాళ్ళంతట వాళ్ళు నిన్ను పూర్తిగా తోసేసే ముందే నీ అంతట నువ్వు తప్పుకోడం గౌరవం అంటూ అంతరాత్మ ఓదార్చింది.

అవును మార్పొచ్చింది అనుకుంది ఉషాకాంత. జీవితంలో మార్పు అనివార్యం అనుకుని సమాధానపడింది.

అయితే ఇంతకాలం ఉషాకాంత అనబడే ఒక గాయని బతికుందా, లేదా అని కూడా పట్టించుకోని కొందరు సాంస్కృతిక సంస్థల వాళ్ళు హఠాత్తుగా ఆమెని సంగీత కచేరీలకి ఆహ్వానించడం ప్రారంభించడం కాక నూతన సంవత్సర వేడుకలకి ఆమె సినీగీతాల కార్యక్రమం ఏర్పాటు చేస్తామని ఆహ్వానించడానికి రావడం ఆమెకి ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

అందుకు కారణం ఇటీవల కొందరి బలవంతం మీద ఒక ప్రముఖ టివి ఛానెల్‌లో అతిధిగా పాల్గొనడం.

'పాటపాడనా' అనే ఒక సినీగీత కార్యక్రమం ఒకటి ఒక ప్రముఖ టివి ఛానెల్‌లో సుప్రసిద్ధ సినీగాయకుడి ఆధ్వర్యంలో చాలాకాలంగా నిర్వహించబడుతోంది. నేటి యువతలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించే కార్యక్రమం అది. ప్రతిభ ఉండి సరైన ప్రోత్సాహం, గుర్తింపు లేక మారుమూల ఉన్న ఎందరో గాయనీ, గాయకులు ఈ కార్యక్రమం ద్వారా వెలుగులోకి వస్తున్నారు. ఆ కార్యక్రమంలో ఎందరో సినీప్రముఖులను, నేపధ్యగాయనీ, గాయకులను, సంగీత దర్శకులను అతిధులుగా ఆహ్వానించి గౌరవించుకుంటున్నారు కూడా. అయితే ఆ కార్యక్రమంలో కూడా ఇంతవరకూ ఉషాకాంతని అతిధిగా పిలవాలన్న ఆలోచన ఎవరికీ కలగలేదు. కాలక్షేపం కోసం ఆ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా చూసే ఉషాకాంత అందులో కనిపించే తన తోటి గాయనీ, గాయకులను చూసినప్పుడల్లా విరక్తిగా నవ్వుకునేది. తనని పరిశ్రమ మర్చిపోయిందనుకుని నిర్లిప్తంగా ఉండిపోయింది.

అనుకోకుండా ఇటీవలే ఆ కార్యక్రమ నిర్వాహకుల నుంచి ఆమెకి ఆహ్వానం అందింది కార్యక్రమానికి అతిధిగా రావాలని. ముందు నిరాకరించినా వాళ్ళెంతో బ్రతిమాలిన తరువాత చాలాకాలం తరువాత ఆమె ప్రజల్లోకి వెళ్ళింది. ఆ కార్యక్రమం ద్వారా మళ్ళీ ఉషాకాంతని గుర్తించిన వాళ్ళంతా ఇప్పుడు మళ్ళీ ఆమె కచేరీ కావాలని, ఆమె పాడిన సినీగీతాల కార్యక్రమం ఏర్పాటు చేస్తామని ముందుకు వస్తున్నారు.

కానీ, ఒక్కసారి అజ్ఞాతంలోకి వచ్చి ప్రశాంతంగా బతుకుతున్న ఆమెకి మళ్ళీ వెనక్కి వెళ్ళాలన్న ఆసక్తిలేదు.

అరవైకి చేరువవుతున్న ఉషాకాంతకి ఇప్పుడు దేనిమీదా ఆసక్తిలేదు, అనురక్తి అసలేలేదు.

గత పదేళ్ళుగా తన జీవితం ఓ మౌనరాగం అయిపోయింది. ఇప్పుడా మౌనాన్ని ఛేదించి మూగబోయిన మానసవీణ తీగలు సవరించాలన్న కోరిక ఏమ్రాత్రం లేదు.

సుమారు నలభై వసంతాలు ఈ సంగీత ప్రపంచంలో ఎన్నో రకాల పోటీలను తట్టుకుంటూ తనకంటూ ఓ స్థానం సంపాదించుకున్న గొప్ప గాయని. ఓ మధురగాయనిగా నీరాజనాలందుకుంది. తెలుగువారి గుండెల్లోనేకాక, తెలుగేతర ప్రజల అభిమానం చూరగొనడం కోసం తమిళం, హిందీ కూడా నేర్చుకుని ఆ భాషా చిత్రాల్లో కూడా ఎన్నో గొప్ప పాటలు పాడి చరిత్ర సృష్టించిన ఉషాకాంత.

ఆ చరిత్ర ముగిసిందనుకుంది. గాయనిగా తన జీవనప్రయాణం ఆగిపోయిందనుకుంది.

హఠాత్తుగా మళ్ళీ ఆగిన ప్రయాణం ప్రారంభించమంటున్నారు, ముగిసిన చరిత్ర తిరిగి మొదలుపెట్టమంటున్నారు.

ఎలా జరిగిందిలా? ఎలా వచ్చిందీ మార్పు?

ఇప్పుడు మళ్ళీ తనని ఆహ్వానించడంలో వాళ్ళ ఉద్దేశం ఏమై ఉంటుంది. మళ్ళీ ప్రజల అభిరుచుల్లో మార్పొచ్చిందా? శ్రావ్యమైన సంగీతాన్ని కోరుకుంటున్నారా? ఎందుకు ఇవాళ ఉషాకాంత గుర్తొచ్చింది.

ఏ ప్రజలకోసమైతే తను బతికిందో, ఏ ప్రజలకోసం తను పాడిందో, ఏప్రజల కోసం తను చిరునవ్వు నవ్విందో, ఆ ప్రజలే తనని వెలేశారు. అయినా తను వాళ్ళని ఏమీ నిందించలేదు. నిశ్శబ్దంగానే తప్పుకుంది.

తను పేరు ప్రతిష్ఠలకోసం, డబ్బుకోసం ఎన్నడూ ఆరాటపడలేదు. పురస్కారాలకోసం తపించలేదు. అభిమానుల ఆప్యాయత, ఆదరణ చాలనుకుంది అన్నీ తనకి లభించాయి. తిరిగి అవన్నీ తనని వదిలేసాయి అయినా తనేం చలించలేదే

మళ్ళీ ఎందుకు వీళ్ళంతా తననిలా పదే, పదే కలిసి తమ వినతిని అంగీకరించమని ఒత్తిడి తెస్తున్నారు.

"మేడమ్ మీకోసం ఎవరో ఒకమ్మాయి వచ్చింది."

గుమ్మం అవతల నుంచి పనమ్మాయి స్వరం వినిపించి ఆలోచనల నుంచి తెప్పరిల్లింది ఉషాకాంత.

" ఎవరు? " అడిగింది.

" తెలియదండి మిమ్మల్ని వెంటనే కలవాలంటోంది. "

ఇంకో కార్యక్రమ నిర్వాహకురాలా? లేక పత్రికా ప్రతినిధా? ఇంతకు ముందే పత్రికలవాళ్ళకి తన నిర్ణయం చెప్పేసింది మళ్ళీ ఈమె ఎవరు?

" కూర్చోపెట్టు వస్తున్నాను " అంది.

పనమ్మాయి వెళ్ళిపోయింది.

ఉషాకాంత మెల్లగా మంచం మీంచి లేచి చెదిరిన జుట్టు సవరించుకుని స్లిప్పర్లు తొడుక్కుని హాల్లోకి వచ్చింది.

" నమస్తే మేడమ్. "

పాతికేళ్ళ అమ్మాయి జీన్స్ ప్యాంట్, టీ షర్టులో సింపుల్‌గా అత్యంతాధునికంగా ఉంది.

" చెప్పమ్మా" తల పంకిస్తూ అందావిడ నిలబడే

" ప్లీజ్ మేడమ్ పదినిమిషాలు ఇస్తారా నాకు? " ప్రాధేయపూర్వకంగా అడిగింది.

ఆవిడ ఒక్క క్షణం మౌనంగా ఉండి సోఫాలో కూర్చుంటూ ఆమెని కూడా కూర్చోమన్నట్టుగా చేత్తో సంజ్ఞచేసి, " చెప్పు" అంది.

" నాపేరు మౌనిక.. నేను ప్లేబ్యాక్ సింగర్‌ని మిమ్మల్ని మొన్న టివిలో పాటపాడనా కార్యక్రమంలో చూసాను. అంతకు ముందు మీ పాటలెన్నో విన్నాను నా అభిమాన గాయనీమణుల్లో మీరొకరు. కాకపోతే .. " అంటూ ఆగిపోయింది.

ఉషాకాంత ఆమె చెప్పేది వినడానికి మౌనంగా చూస్తూ కూర్చుంది.

" మీరెక్కడ ఉన్నారో, ఎందుకు సినిమాల్లో పాడడంకానీ, కచేరీలివ్వడంకానీ మానేసారో తెలియలేదు. "

ఉషాకాంత ఆమెనే చూస్తూ ఆమె చెప్పేది వినసాగింది.

" మీరిక్కడ ఉన్నారని నాకు నిన్ననే తెలిసిది. వెతుక్కుంటూ వచ్చాను. మీరు పదేళ్ళనుంచీ పాడడం మానేసారని టివీలో చెప్పారు.. ఎందుకు మానేసారో తెలుసుకోవచ్చా? "

ఉషాకాంత నెమ్మదిగా నవ్వి " ఆ విషయం కూడా చెప్పానుగా" అంది.

" చెప్పారు అవకాశాలు తగ్గిపోడంతో తప్పుకున్నానన్నారు కానీ, ఇప్పుడు మీ పాటల కార్యక్రమం ఏర్పాటు చేయాలని కొందరు వస్తే మీరు నిరాకరించారని విన్నాను. అవకాశం వచ్చినపుడు ఉపయోగించుకునే వాళ్ళను చూసాను కానీ, మీలా నిరాకరించిన వాళ్ళను చూడలేదు. "

" అవును. "

" మీరేమీ అనుకోకపోతే మీ నిర్ణయం మార్చుకోవాలని కోరుతున్నాను. "

" ఎందుకు మార్చుకోవాలి? " అడిగిందావిడ మెత్తగా.

" మాకోసం.. మాలాంటి అప్‌కమింగ్ సింగర్స్ కోసం మీలాంటి అనుభవజ్ఞులు ఇలా అజ్ఞాతంలో ఉండకూడదు. మీరు మళ్ళీ ప్రజల్లోకి రావాలి. మళ్ళీ మీ గానామృతం తెలుగు గుండెల్లో నింపాలి. మీరు పాడాలి మేడమ్. ప్లీజ్ మీరు పాడాలి" ఉద్వేగంగా అందా అమ్మాయి.

ఉషాకాంత ఆమె వైపు విచిత్రంగా చూసింది.

" ఎందుకు నీకు నా పట్ల ఈ అభిమానం?" అడిగింది.

" అభిమానంకన్నా గౌరవం ఎక్కువ. మీరు పాడిన అనేక పాటల సిడిలు నాదగ్గర ఉన్నాయి. నిజం చెప్తున్నాను మీరు నమ్మాలి. ఒక విధంగా మీరే నా గురువు. నేను మీకు ఏకలవ్యుడిలాంటి శిష్యురాల్ని. నేనెక్కడా సంగీతం నేర్చుకోలేదు. కానీ పాడతాను. బాగా పాడతానో లేదో నాకు తెలియదుకానీ, నేను రెండేళ్ళనుంచీ ప్లేబ్యాక్ సింగర్‌గా సుమారు ఐదు సినిమాల్లో పాడాను. నన్ను నేను ప్రమోట్ చేసుకుంటాను. అవకాశాలు నా దగ్గరకు రాలేదు. నేనె వాటి వద్దకు వెళ్ళాను. బలవంతంగా పొందాను. నేనేకాదు నేటి తరం వాళ్ళందరూ ఇంతే. ప్రతిభ ఉండేది స్వల్పం, అవకాశాలకోసం ఆరాటం అనంతం."

" ఇదంతా నాకెందుకు చెప్తున్నావు? " కొంచెం కుతూహలంగా అడిగిందావిడ.

మౌనిక నవ్వింది.

" మాలాంటి వాళ్ళు ఈ సమాజాన్ని హైజాక్ చేస్తుంటే మీలాంటి వాళ్ళు ఇలా అజ్ఞాతంగా ఉండడం నాకిష్టంలేదు. "

" నువ్వు చాలా చిన్నదానివి, ఆధునిక సినీగీతాలను ఇష్టపడకుండా నా పాటలు ఇష్టపడుతున్నానని చెప్తున్నావు ఎంచేత? పాత వాళ్ళల్లో నాలాంటి ప్రతిభావంతులైన గాయనీమణులు ఎందరో ఉండగా నీకు నా పాటలే ఎందుకిష్టం?"

ఆమె నవ్వింది. " తినడానికి ఎన్నో రకాలుండే వెజిటబుల్ బిర్యానీ ఎందుకిష్టం? రసమలై ఎందుకిష్టం అంటే నేనేం చెప్పగలను? మీ స్వరంలో మాధుర్యంతోపాటు బాగా గమనిస్తేగానీ అర్ధంకాని ఆర్ద్రత ఉంటుంది. అది నాకిష్టం. గమకాలు పలికించడంలో మీ నైపుణ్యం

నాకిష్టం. నేనెప్పుడు మీపాటలు వినలేదు. కానీ, రెండేళ్ళక్రితం మా పిన్ని దగ్గర ఉన్న సిడిల్లో చూసాను. ప్లేబ్యాక్ సింగర్‌వి అవుతున్నావు అలనాటి గాయనీమణులు పాటలు వినాలి అంటూ పిన్ని నాకు మీ సిడి ఇచ్చి వినమంది. విన్నాను.. అంతే, మీ స్వరం నన్ను మాగ్నెట్‌లా ఆకర్షించింది. మీ సిడిల కోసం షాపుకి వెళ్ళి వెతగ్గా, వెతగ్గా మూడో, నాలుగో దొరికాయి. చాలాచోట్ల మిగతావాటికోసం వెతికాను. ఇంకా వెతుకుతూనే ఉన్నాను. మీరెక్కడ ఉన్నారో, ఏం చేస్తున్నారో అని అందర్నీ అడిగాను. ఎవరూ చెప్పలేకపోయారు. లక్కీగా టివి ఛానెల్ వాళ్ళు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయిన అనేకమంది నటీ, నటులను, గాయనీ,గాయకులను వెతుకుతూ మీ అడ్రెస్ పట్టుకుని, మిమ్మల్ని "పాటపాడనా" కార్యక్రమానికి అతిధిగా ఆహ్వానించడంతో మీ గురించి తెలిసింది. వెంటనే రావాలనుకున్నాను కానీ, రికార్డింగ్‌లో బిజీగా ఉండి రాలేకపోయాను. నిన్న నాకు మిత్రుడైన ఒక సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు మీరు కచేరీలకు ఒప్పుకోడంలేదని చెప్పగానే ఆందోళనతో ఇలా వచ్చాను. "

ఆవిడ మౌనిక మొహంలో నిజాయితీ వెతుకుతున్నదానిలా చూసింది.

ఆమె కళ్ళు తేజస్సుతో వెలిగిపోతున్నాయి. ఆ కళ్ళల్లో ఏదో సాధించాలన్న పట్టుదల, ఆరాటం తపన కనిపిస్తున్నాయి. తనమీద తనకి అంతులేని విశ్వాసంతో మెరుస్తున్నాయి.

"ఇప్పుడు నన్నేం చేయమంటావు? " మృదువుగా అడిగింది ఆవిడ.

ఆమాటకి ఆ అమ్మాయి కళ్ళు మెరిసాయి.

"మీకు వచ్చిన అవకాశాలను అంగీకరించండి. మళ్ళీ మీరు జనజీవితంలోకి రండి. అన్నిటికన్నా ప్రధానంగా నన్ను మీ శిష్యురాలిగా స్వీకరించండి ప్లీజ్." అభ్యర్ధనగా చూసింది.

ఆవిడ నవ్వింది. "నా వయసు తెలుసా నీకు?" అడిగింది.

"ఉండచ్చు అరవై, లేదా అరవైలోపు"

"మరి... ఈ వయసులో నాకు కావాల్సింది విశ్రాంతి కదమ్మా"

"మీరు పదేళ్ళముందే కావాల్సినంత విశ్రాంతి తీసుకున్నారు. "

ఉషాకాంత ఆమె ధైర్యానికి విస్తుబోయి చూసింది.

"సారీ చనువు తీసుకుంటున్నాను కానీ, మిమ్మల్ని కొత్తతరానికి పరిచయం చేసి, వాళ్ళల్లో ఉన్న అహంకారం అణచివేయాలనే నాకోరిక తీరాలి మీరు మళ్ళీ వెలుగులోకి రావాలి. మీ గానామృతంతో సంగీతం అంటే ఓ ప్రభంజనంకాదని, అదో నదీప్రవాహం అని తెలియచేయాలి. ముందు తరాలవారికి మీరు స్ఫూర్తి అయేలా ఏదన్నా చేయాలి."

"ఏం చేయాలి? "

మౌనిక కొన్ని క్షణాల నిశ్శబ్దం తరువాత నెమ్మదిగా అంది "మీ జీవితగాధని అక్షరీకరించాలి. అందుకు నాకు అనుమతినివ్వాలి. "

"నా జీవితగాధా? " ఆవిడ నిశ్చేష్టురాలిలా చూసింది.

"నా జీవితగాధ అక్షరీకరించాలా? " ఆమె కళ్ళల్లో పల్చటి తడి.

"నా జీవితం గొప్ప జీవితం కాదు. నేను మేధావిని కాను, నేనొక మామూలు స్త్రీని, బతకడం కోసం సంగీతాన్ని ఆశ్రయించాను. ఇంకా బతకడం కోసం సినీ నేపధ్యగాయనిగా మారాను. అంతే. "

"మేడమ్! " ఆత్మీయంగా నవ్వింది మౌనిక.

"మీగురించి నాకు చూచాయగా తెలుసు. ఎలా అని అడక్కండి తెలుసుకానీ, పూర్తిగా తెలుసుకోవాలనుకుంటున్నాను. నేను తెలుసుకుని రేపటి తరానికి తెలపాలి అని కూడా అనుకుంటున్నాను. మీ జీవితం అందరికీ ఒక స్ఫూర్తికావాలి. మీ జీవితం పాఠ్యపుస్తకాల్లో ఒక అంశంగా చేర్చబడాలి. ఒక వ్యక్తిలోని ప్రతిభ గుర్తించాలంటే ఏం చేయాలో అందరూ తెలుసుకోవాలి. అవివేకంతో, అజ్ఞానంతో రెక్కలు కట్టుకుని అమాంతం పైకెగరాలనే దురాశతో నేటి తరం కళాకారులు చేస్తున్న రక, రకాల విన్యాసాలు వాళ్ళమీద గౌరవానికన్నా, జుగుప్సని కలగచేస్తాయని, నిజమైన ప్రతిబకి ప్రచారం అవసరం లేదన్న వాస్తవం అందరూ తెలుసుకోవాలి నాతో సహా. అందుకే మీ జీవిత చరిత్ర రాసే అవకాశం నాకివ్వమని మిమ్మల్ని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నాను. "

ఒంగి ఉషాకాంత పాదాలకు నమస్కరించింది మౌనిక.

ఆమె మాటలకి అవాక్కై చూస్తూ ఉండిపోయింది ఉషాకాంత.

"నేను రేపు మళ్ళీ వస్తాను మీ నిర్ణయం నాకు ఆనందాన్నిచ్చేదిగా తెలియచేస్తారని నమ్ముతున్నాను. వస్తాను మేడమ్. "

మౌనిక గభాల్న లేచి వెళ్ళిపోయింది.

ఆవిడక్కడ ఏం జరుగుతోందో స్పృహలేనిదానిలా చూస్తూ ఉండిపోయింది.

కూర్చున్నచోటునుంచీ లేచే శక్తిలేనిదానిలా అలాగే శిలలా కూర్చుండిపోయింది.

"ఒక్కసారి ఆమె కళ్ళముందు గడచిన కాలం తెరలు, తెరలుగా కదిలిపోసాగింది. "

తన జీవిత కథ రాస్తుందా? జీవిత చరిత్ర రాస్తుందా? చరిత్రగా మారిపోయిన జీవితమా తనది. ఏం రాసినా ఆ అమ్మాయికి తన జీవితం గురించి చెప్పాలంటే ఏం చెప్పాలి? ఎందుకు చెప్పాలి? ఎవరా అమ్మాయి, హఠాత్తుగా వచ్చి మీ జీవిత చరిత్ర రాస్తా అనగానే చెప్పేస్తుందని ఎలా అనుకుంది?

గతించిపోయిన గతాన్ని కెలికి, అనుభవాల రాపిళ్ళను ఒర్చుకుంటూ పూడ్చిపెట్టిన జ్ఞాపకాలు తవ్వుకుంటూ వెళితే తను పొందేది అంతులేని వేదన.

ఇప్పుడావేదన తిరిగి గుర్తుచేసుకుని బాధపడడం అవసరమా? తను పేరు ప్రతిష్టలున్న ఒక సెలబ్రిటీ కావచ్చుకాక, అంత మాత్రాన తన జీవితం అందరికీ ఎందుకు తెలియాలి?

స్ఫూర్తినిస్తుందిట.. ఎలాంటి స్ఫూర్తినిస్తుంది?

ఆవిడ మనో ఫలకం మీద యాభై ఏళ్ళనాటి చిత్రాలన్నీ స్లైడ్‌షోలాగా కదలసాగాయి.

కళ్ళు మూసుకుని వెనక్కివాలింది.

మౌనిక రెండు చేతులూ ఒళ్ళో పెట్టుకుని రెప్పవేయకుండా ఉషాకాంతని చూస్తూ, ఆవిడ చెప్తున్న విషయం శ్రద్ధగా వినసాగింది.

"నువ్వు నానుంచి ఏం ఆశిస్తున్నావో నాకు తెలియదు. చరిత్రలో మిగిలిపోయేంత గొప్పదాన్నికాను నేను. నాకంటూ ఎవరూ లేరు. నా అభిమానులే నావాళ్ళనుకున్నాను. కానీ, మధ్యలో వచ్చిన మార్పులతో ఎవరూ ఎవరికీ శాశ్వతం కాదని తెలుసుకున్నాను. ఏ మార్పు వచ్చినా మనసారా ఆహ్వానించాను. మార్పు అనేది జీవితంలో అత్యంత ముఖ్యమైంది కాబట్టి. ఇంతకాలంగా నన్ను పట్టించుకోని వాళ్ళంతా ఇప్పుడు హఠాత్తుగా ఎక్కడినుంచి వచ్చారో, ఎందుకొచ్చారో నాకు అర్ధంకావడంలేదు. కాకపోతే ప్రతి వాళ్ళ కెరియర్‌లోనూ ఎత్తుపల్లాలు ఉంటాయన్నది వాస్తవం కాబట్టి గడచిన పదేళ్ళు అందులో భాగం అనుకుంటాను. ఇప్పుడు మళ్ళీ మీరంతా నన్నింతగా కోరుతున్నారు కాబట్టి తప్పకుండా పాడతాను. "

మౌనిక కళ్ళల్లో సంతోషం వెల్లివిరిసింది. సుప్రసిద్ధ గాయని ఉషాకాంత తిరిగి పాటల ప్రపంచంలోకి అడుగుపెడుతోంది. అదికూడా తనద్వారా. సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించబోతోంది. అంతకన్నా ఏం కావాలి? ఈవిడ కోసం తను ఎంతగా వెతికిందో తనకే తెలుసు. ఎందుకోసం వెతికిందో కూడా తనకి మాత్రమే తెలుసు. తన చుట్టూ తానో గిరిగీసుకుని ఆ పరిధిలో అందరికీ దూరంగా బతుకుతున్న ఈ గానకోకిలను మళ్ళీ ఈ ప్రపంచంలోకి తీసుకురాగలుగుతోంది. ఇది నిజంగా విజయమే.. తను ఆశించింది ఈ విజయమే.

ఉషాకాంత మౌనికవైపు చూస్తూ అంది "నీకెందుకమ్మా ఇంత పంతం నాచేత పాడించాలని.? "

మౌనిక నవ్వింది.

"చెప్పాగా నేను మీకు ఏకలవ్యుడిలాంటి శిష్యురాలిని. నా అభిమానగాయని మీరు. మీ శిష్యరికంలో నాలో ఉన్న కొద్దిపాటి ప్రతిభకు మెరుగుపెట్టుకుని మరింతగా పరిణతి సాధించాలన్నది నా ఆశయం. చెప్పండి నన్ను మీ శిష్యురాలిగా చేర్చుకుంటారా?"

"మళ్ళీ నా చేత గురువు వేషం కట్టించాలనుకుంటున్నావా? " నవ్వుతూ అడిగింది ఉషాకాంత.

"నాకోసం మాత్రమే. "

"నీకోసం అయితే తప్పకుండా ఒప్పుకుంటాను సరేనా? "

మౌనిక వికసించిన మొహంతో అంది "ఎప్పటినుంచీ ప్రారంభిద్దాం?"

"నీ ఇష్టం"

మౌనిక కొన్ని క్షణాలు ఎటో చూస్తూ నెమ్మదిగా అంది "నా కోర్స్ పూర్తి అయిందాకా మీ ఇంట్లో నాకు ఆశ్రయం ఇస్తారా?"

ఆవిడ ఆశ్చర్యంగా చూసింది. "నువ్విప్పుడు ఎక్కడ ఉంటున్నావు? "

"హాస్టల్ లో"

"ఓ దానికేం తప్పకుండా నాతో ఉండు. నేను కూడా ఒంటరితనం భరించలేకపోతున్నాను. తోడుగా ఉంటే నాకూ కాలక్షేపం" అంది.

"థాంక్యూ మేడమ్.. రెండు రోజుల్లో నేను హాస్టల్ ఖాళీచేసి వస్తాను థాంక్స్ ఎ లాట్" మౌనిక చటుక్కున లేచి ఆవిడ చేతులు పట్టుకుని ఊపేస్తూ అంది.

ఆవిడ నవ్వుతూ చూస్తూ ఉండిపోయింది.

**"అమ్మా కాఫీ"** ఆ స్వరానికి పెరట్లో మొక్కలకి నీళ్ళు పెడుతున్న ఉషాకాంత తలతిప్పి చూసింది.

చిన్న ట్రేలో పొగలు కక్కుతున్న కాఫీ కప్పు పెట్టుకుని నిలబడి ఉంది సీతమ్మ.

ఆవిడ చేతిలో రబ్బరు ట్యూబు కిందపడేసి, భుజం మీద ఉన్న టవల్‌తో చేయి తుడుచుకుని కాఫీకప్పు తీసుకుంది.

"మీరెందుకమ్మా శ్రమ తీసుకుంటారు? వెంకన్న పెడతాడుకదా నీళ్ళు" కిందపడిన రబ్బరు ట్యూబు చేతిలోకి తీసుకుని చుట్టలు చుట్టుకున్న కొంత భాగాన్ని పూర్తిగా లాగి చిక్కుడు పాదు దగ్గరకి వెళుతూ అంది సీతమ్మ.

ఆవిడ ఏం మాట్లాడలేదు.

తను ప్రతిరోజూ అలా ఉదయాన్నే మొక్కల సేవ వంకతో గార్డెన్‌లో తిరగడం ఒక వ్యాయామంలా భావిస్తుంది.

కానీ, సీతమ్మ, వెంకన్న, లక్ష్మి తను ఎంతో శ్రమపడుతోంది అనుకుంటారు. అది శ్రమ కాదని, మొక్కల మధ్య తిరగడం తనకిష్టమైన పని అని వాళ్ళకి చెప్పాలనుకోదు. చెప్పడం అనవసరం అనుకుంటుంది. అందుకే ప్రతిరోజూ సీతమ్మ నోటినుంచి ఈ డైలాగ్ వింటున్నా ఆవిడ మాత్రం ఏం మాట్లాడకుండా చిరునవ్వు నవ్వి ఊరుకుంటుంది.

వీధి వాకిట్లో అప్పుడే ఆటో ఆగడం అందులోంచి మౌనిక దిగడం చూసిన వెంకన్న కొంచెం వేగంగా నడుస్తూ వచ్చి "అమ్మగారూ మొన్న మనింటికి వచ్చిన పేపరమ్మాయి పెట్టెల్తో వచ్చిందండి" అని చెప్పాడు ఉషాకాంతతో.

"ఎవరూ?" అర్ధంకాని ఉషాకాంత ఒకింత ఆశ్చర్యంగా చూసింది.

"అదేనండి మూడురోజుల క్రితం ఒక పేపరమ్మాయిగారొచ్చారు కదండి ఆవిడే"

ఉషాకాంత అద్దాల్లోంచి వీధి గుమ్మం వైపు చూసింది.

మౌనిక రెండు పెద్ద సూట్‌కేసులతో లోపలికి వస్తోంది.

మర్నాడే వస్తానన్నా మౌనిక రాకపోవడంతో ఆ పిల్ల ఏదో ఆషామాషీగా అందనుకుని భావించింది. అనూహ్యంగా ఇప్పుడు పెట్టే, బేడా తీసుకుని వచ్చిన మౌనికను చూడగానే ఆవిడ విస్తుబోయింది. తనలో భావాలు పైకి కనిపించకుండా కాఫీ కప్పు వెంకన్న చేతికిచ్చి నెమ్మదిగా పెరటి తలుపు తీసుకుని లోపలికి నడిచింది.

"నమస్తే ఆంటీ" చిరునవ్వుతో చేతులు జోడించింది మౌనిక.

నెమ్మదిగా తేరుకుని చిరునవ్వుతో హృదయపూర్వకంగా "వచ్చావా, రామ్మా" అంటూ లోపలికి ఆహ్వానించింది.

"నిజంగా వస్తాననుకోలేదు కదూ మీరు?" చిరునవ్వుతో అడిగింది మౌనిక.

ఆవిడ చిరునవ్వే సమాధానంగా మౌనికవైపు చూసింది. మౌనిక సూట్‌కేసులు వదిలి చున్నీ సవరించుకుంటోంది. అప్పుడే అక్కడికి వచ్చిన వెంకన్నతో అంది "ఈ సూట్‌కేసులు గెస్ట్ రూములో పెట్టు వెంకన్నా."

"అట్టాగే అమ్మగారూ" మౌనిక చేతుల్లోంచి రెండు సూట్‌కేసులు అందుకుని లాక్కుంటూ లోపలికి వెళ్ళిపోయాడు వెంకన్న.

"కూర్చోమ్మా" సోఫాలో తను కూర్చుంటూ మౌనికతో అంది.

మౌనిక ఆవిడ పక్కనే కూర్చుంది.

"కాఫీ తాగుతావా?" అడిగిందావిడ.

"లేదండి నాకు కాఫీ, టీలు అలవాటులేదు."

"అలాగా గుడ్" నవ్వి ఆమె వైపు పరీక్షగా చూసింది.

లేతాకుపచ్చ రంగు మీద చిన్న ప్రింట్ ఉన్న కుర్తీ, తెల్లని లెగిన్ వేసుకుంది. భుజాలదాకా ఉన్న జుట్టుకి సగానికి వదిలి క్లిప్పు పెట్టింది. సన్నగా కాటుక, చిన్న బొట్టు స్టిక్కర్ ఆకర్షణీయంగా ఉంది.

"నేను మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేదు కదూ!" మృదువుగా అడిగింది మౌనిక.

ఆవిడ నవ్వింది "లేదు" అంది.

ఇంతలో లక్ష్మి వచ్చి "అమ్మా స్నానానికి నీళ్ళు పెట్టాను" అంది.

ఉషాకాంత లక్ష్మిని మౌనికకు పరిచయం చేస్తూ అంది "ఈ అమ్మాయి లక్ష్మి. దాదాపు పాతికేళ్ళనుంచి నా దగ్గరే ఉంటోంది." డైనింగ్ టేబుల్ దగ్గర నిలబడి ఏదో సవరిస్తున్న సీతమ్మను పిలిచింది. సీతమ్మగారూ ఇలారండి అంటూ. సీతమ్మ వచ్చింది.

"ఈవిడ సీతమ్మగారు, ఈవిడ దాదాపు ముప్పై ఏళ్ళనుంచీ నాదగ్గరే ఉంటున్నారు. ఆవిడ చేతి వంట తప్ప నాకు మరో రుచి తెలియదు. అతను వెంకన్న ఇంట్లో సమస్తం చూసుకుంటాడు. వీళ్ళు ముగ్గురూ నాకు, నేను వీళ్ళకి" అంటూ నవ్వి సీతమ్మతో అంది

"ఈ అమ్మాయి ఇవాళ్టినుంచీ ఇక్కడే ఉంటుంది."

సీతమ్మ ఆప్యాయంగా నవ్వింది మౌనికను చూసి.

"వీళ్ళంతా నాకు ఈరోజు నుంచీ ఆత్మీయులే" అంది మౌనిక.

ముగ్గురూ అక్కడినుంచి వెళ్ళిపోయారు.

"అందరం ఒక కుటుంబ సభ్యులం" అంది ఉషాకాంత.

"నన్ను మీ కుటుంబ సభ్యురాలిగా చేర్చుకున్నందుకు ధన్యవాదాలు మేడమ్" అంది మౌనిక.

ఆవిడ నవ్వింది.

కొంచెం సేపు నిశ్శబ్దంగా గడిచింది. కేవలం ఒక్క అరగంట పరిచయంతో ఆ అమ్మాయి తన దగ్గరకు పెట్టే, బేడాతో రావడం విచిత్రంగా అనిపిస్తోంది ఆవిడకి.

ఈ అమ్మాయి ఆషామాషీగా అనలేదనమాట. నిజంగానే వచ్చేసింది. చూస్తుంటే మంచి పిల్లలాగే ఉంది కానీ, సుమారు నలభై సంవత్సరాలుగా ఒంటరిగా ఏ బంధాలు, సంబంధాలు లేకుండా పనివాళ్ళే స్వంతవాళ్ళుగా బతుకుతోన్న తన జీవితంలోకి ఈ అమ్మాయి ఎందుకు వచ్చినట్టు అనే సందేహం ఆవిడ మనసుని తొలుస్తూనే ఉంది.

తనెవరో తెలీకుండా, ఒక స్వల్ప పరిచయానికే తన ఇంట్లో ఆశ్రయం ఇవ్వడానికి ఈవిడ సందేహిస్తోందా అని మౌనిక ఆలోచనలు సాగుతున్నాయి. తన వలన ఆవిడకి ఎలాంటి ఇబ్బంది ఎదురుకాదని ఎలా చెప్పాలి? తన ప్రవర్తనతో ఆవిడ మనసులో స్థానం సంపాదించుకోవాలి కానీ, మాటల్తో నమ్మించే ప్రయత్నం చేయడం ఎందుకు? నెమ్మదిగా ఆవిడే తెలుసుకుంటారు తన గురించి అనుకుంది.

ఆవిడ ఆలోచనలనుంచి తేరుకుని "నేను స్నానం చేసి వస్తాను.. రాగానే టిఫిన్ చేద్దాం" అంటూ సోఫాలోంచి లేచింది.

"అలాగే" అంది మౌనిక తనూ లేస్తూ.

"టీ.వి చూస్తావా?" అడిగిందావిడ రిమోట్ కోసం కలయచూస్తూ.

"మీరు వచ్చేదాకా మీ ఇల్లు చూస్తాను. సరేనా?" మృదువుగా నవ్వింది మౌనిక.

ఆవిడ తలూపి గదిలోకి వెళ్ళిపోయింది. మౌనిక లేచి విశాలంగా ఉన్న ఆ హాలు పరిశీలించింది.

హాల్లో నుంచి పెరట్లోకి, వంటగదిలోకి, వీధి గదిలోకి గుమ్మాలున్నాయి.

లేత రంగు గోడలకి సరస్వతీ దేవి నిలువెత్తు ఫోటో ఒక పక్క, వెంకటేశ్వరస్వామి ఫోటో ఒక పక్క ఆ ఇంటిని రక్షిస్తున్నట్టుగా ఉన్నాయి. హాల్లో ఎల్ ఆకారంలో వేసిన సోఫాలు, మధ్యలో చిన్న గాజు టీపాయ్. టీపాయ్ మీద శాస్త్రీయ సంగీతానికి చెందిన పుస్తకాలు రెండు ఉన్నాయి. ఒక మూల వీణ నిలబెట్టబడి, దానిమీద పల్చటి గులాబీరంగు బట్టకప్పి ఉంది. ఇంట్లో అలంకార సామాగ్రి ఏమీలేదు. అక్కడి నుంచి వీధి గదిలోకి వచ్చింది. ఆరు ప్లాస్టిక్ కుర్చీలు, ఒక సెంటర్ టేబుల్, రెండు మోడాలు తప్ప మరో సామానులేదు.

వంట గదిలోంచి సాంబారు వాసనవస్తోంది.

శంకరాభరణం సినిమాలో శంకరశాస్త్రిగారిల్లులా ఇంట్లో అడుగడుగునా తుంబరనాదాలు, సప్తస్వరాలు వినిపిస్తున్నట్టుగా అనిపించింది మౌనికకు.

అక్కడినుంచి పెరట్లోకి వెళ్ళింది.

ఓ పక్క కూరగాయలు, మరో పక్క జామ, సపోటా చెట్లు, మధ్యలో రాళ్ళు పరచి ఉంది. అప్పుడే నీళ్ళు పెట్టినందుకేమో మట్టి పరిమళం మోసుకొస్తున్నాయి పిల్లగాలులు. హేమంతం, వసంతం సరాగాలాడుతున్న కాలం. సూర్యకిరణాలు నులివెచ్చగా ఉన్నాయి.

గాలికి సుతారంగా ఊగుతున్న కొమ్మలను చూస్తూ కుడిపక్కగా ఉన్న సందులోంచి వీధివాకిట్లోకి నడిచింది.

గేటుకి రెండువైపులా అశోకా చెట్లు రక్షకుల్లా నిలబడి ఉన్నాయి. ఓ పక్క రకరకాల రంగుల గులాబీ మొక్కలు, మరో పక్క చామంతి, కనకాంబరం, గన్నేరు, నిత్యమల్లెపూల మొక్కలు. ఉషాకాంత అభిరుచిని చాటుతున్నాయి.

"ఏమ్మా మొక్కలిష్టమా?" ఉషాకాంత స్వరం విని వెన్నక్కి తిరిగి మౌనిక.

అప్పుడే స్నానం చేసి తెల్లని కాటన్ చీర కట్టుకుని వచ్చిన ఉషాకాంత తెల్లచామంతిలా అనిపించింది.

"అవునండి" అంటూ ఆవిడ వైపు నడుస్తూ అంది "మీ గార్డెన్ చాలా బాగుంది."

ఆవిడ వెనక్కి తిరిగి లోపలికి నడుస్తూ అంది "సంగీతం తరువాత నాకు శాంతినిచ్చేది ఈ గార్డెన్ మాత్రమే. "

"ఆవిడని అనుసరిస్తూ వస్తూ పూలు, పసిపాపలు, సంగీతం, సాహిత్యం ప్రతి మనిషినీ ప్రభావితం చేసి జీవితంపట్ల మమకారం కలిగిస్తాయి మేడమ్" అంది.

ఆవిడ మాట్లాడకుండా డైనింగ్ టేబుల్ దగ్గరకు నడిచింది.

డైనింగ్ టేబుల్‌కి కుడి పక్క కొంచెం దూరంలో పూజగది, చిన్నదీపం వెలుగుతూ అగరొత్తుల పరిమళాలను వెదజల్లుతోంది.

తను గార్డెన్ చూసేలోపల ఆవిడ స్నానం, పూజ అన్నీ ముగించినట్టున్నారు అనుకుంది మౌనిక.

వంటమనిషి సీతమ్మ ప్లేట్లు, గ్లాసులు తెచ్చింది. హ్యాట్ ప్యాక్‌లోంచి ఇడ్లీలు తీసి ప్లేట్లలో పెట్టి, చిన్న, చిన్న స్టీలు బౌల్స్‌లో సాంబారు పోసింది. టేబుల్ మీద పెద్ద గాజు బౌల్‌లో చట్నీ ఉంది. మరో చిన్న బౌల్‌లో కరిగించిన నెయ్యి ఉంది.

"రామ్మా" అంటూ మౌనికను ఆహ్వానించి నెయ్యి తీసి ఇడ్లీల మీద వేసింది ఉషాకాంత.

"నెయ్యి తిననండి" అంది మౌనిక.

ఆవిడ నవ్వి అంది "డైటింగ్ అంటూ మీరంతా నెయ్యి మానేస్తున్నారు కానీ, కనీసం అభికరించుకోవాలి అంటారు పెద్దవాళ్ళు. ముఖ్యంగా ఇడ్లీ మీద నెయ్యి వేసుకోకుండా తింటే గొంతుకి అడ్డం పడుతుంది. "

మౌనికకి అప్పటికే ఆకలిగా ఉంది అందుకే మారుమాట లేకుండా వేడి, వేడి ఇడ్లీ చట్నీ, సాంబారుతో తినసాగింది.

"మీ నాన్నగారు ఏం చేస్తారు?" అడిగింది ఉషాకాంత.

"లేరండి" నెమ్మదిగా చెప్పింది మౌనిక.

"ఓ అలాగా! అమ్మ?"

"ఉంది.. అమ్మ గృహిణి, నాతోపాటు ఇద్దరన్నయ్యలున్నారు. వాళ్ళిద్దరూ బి.టెక్ పూర్తిచేసి ఉద్యోగాలు చేస్తున్నారు. నాన్నగారు జిల్లాపరిషత్ ఆఫీసులో చేసారు ఆయన పెన్షన్ వస్తుంది అమ్మకి. "

"ఎక్కడుంటారు వాళ్ళు?" ఆ అమ్మాయి హాస్టల్లో ఎందుకుంటోందో తెలుకోడానికన్నట్టుగా అడిగింది.

"అమ్మ ఉండేది.. " చెప్పబోయి ఆగి మంచినీళ్ళ గ్లాసు తీసుకుని రెండు గుక్కలు తాగి చెప్పింది "నిడదవోలు."

"మరి అన్నయ్యలు?"

"బెంగుళూరులో వాళ్ళ ఉద్యోగాలు"

"అలాగా అమ్మ ఒక్కరే ఉంటారా?"

"మా పిన్ని కూడా అక్కడే ఉంటుంది. బాబాయి కూడా ఈ మధ్యే పోయారు పిన్నికి పిల్లల్లేరు."

"ఓ నువ్విక్కడ ఏం చేస్తున్నావు?"

"నేను ఎమ్, ఏ పాసయాను. మీడియా మీద ఆసక్తితో హైదరాబాద్‌కి వచ్చి, టీ.విలో యాంకర్‌గా అవకాశాలకోసం ప్రయత్నించి సక్సెస్ అయాను. దాంతోపాటు చిన్నప్పటి నుంచీ పాటలంటే ఇష్టం. ఆ ఇష్టంతోటే సినిమా పాటలు పాడుతుండేదాన్ని. ఇటీవలి కాలంలో టీ.వీలో వస్తున్న అనేక రకాల సినీగీతాల కార్యక్రమాల కోసం ఒక సింగర్ దగ్గర లలిత గీతాలు, సినిమా పాటలు నేర్చుకుని అప్పుడప్పుడూ ప్లేబ్యాక్ పాడుతున్నాను."

"సంగీతం నేర్చుకోలేదా?"

"లేదు మీ దగ్గర నేర్చుకుంటాను."

ఆవిడ నవ్వింది. మౌనిక ఆవిడ నవ్వులో అర్థాలు వెతకడానికి ప్రయత్నిస్తూ అడిగింది "ఎందుకు మేడమ్ నవ్వుతారు?"

ఆవిడ తల అడ్డంగా ఆడిస్తూ "ఏం లేదు.." అంటూ లేచి వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళి చెయ్యి కడుక్కుని నాప్‌కిన్‌తో తుడుచుకుంది.

మౌనిక కూడా చెయ్యి కడుక్కుని "సంగీతం రాకుండా ప్లేబ్యాక్ సింగర్ ఎలా అయిందా అని నవ్వుతున్నారు. అవునా?" అంది.

ఆవిడ మౌనిక భుజం మీద చేయేసి అంది "ఈ కాలం అలాంటిది. నువ్వే కాదు చాలామంది ప్రతిభ ఉన్నా, లేకపోయినా ఎక్కడికో ఎగరాలని ఆరాటపడుతున్నారు. ప్రతిభ పరిమళంలాంటిది దాచాలంటే దాగదు. "

మౌనిక సమాధానంగా నవ్వి అంది "ఈ కాలంలో మరో విపరీతం కూడా ఉంది మేడమ్.. తన గురించి తను చెప్పుకుంటే తప్ప గుర్తించలేకపోతున్నారు జనం. అందుకే సెల్ఫ్ పబ్లిసిటీ లేకపోతే ఎంతటి గొప్పవాళ్ళు అయినా అజ్ఞాతంలోనే ఉండిపోతున్నారు. బహుశా సుబ్బలక్ష్మిగారు ఈ కాలంలో పుట్టి ఉంటే ఆవిడ గొప్ప సంగీత సామ్రాజ్ఞి అన్న విషయం ఎవరికీ తెలిసేది కాదేమో!"

"అవునేమో!" అనుకుంది మనసులో ఉషాకాంత.

"రా.. నా గదిలోకి వెడదాం" అంటూ తన గదివైపు నడుస్తున్న ఆవిడని అనుసరిస్తూ సందేహంగా పిలిచింది మౌనిక "మేడమ్"

"చెప్పమ్మా"

"నేను మిమ్మల్ని ఆంటీ అని పిలవచ్చా?"

ఆవిడ మౌనిక వైపు చూసి నవ్వి "ఆంటీ అంటే ఏ వరస?" అంది.

"మీకూ నాకూ అనుబంధం తప్ప ఏ బంధముందో నాకు తెలియదు. అందుకే ఏ వరసో తెలియకుండా ఆంటీ అనాలనుకుంటున్నాను."

"మీ అమ్మగారి వయసెంత?"

"యాభై ఆరు అనుకుంటా"

"అయితే నన్ను పెద్దమ్మా అని పిలువు"

మౌనిక కళ్ళు తళతళా మెరిసాయి. "అంతకన్నా నాకేం కావాలి? అడక్కుండా అమ్మవారు వరం ఇచ్చినట్టుగా ఉంది" అంది.

ఆవిడ వాత్సల్యంగా నవ్వింది.

"ఎప్పటి నుంచి ప్రారంభిద్దాం?" అడిగింది ఆవిడ మంచం చివర కూర్చుంటూ.

"ఈ క్షణం అయినా నేను సిద్ధం."

"అయితే ఏదీ.. ఒక లలితగీతం పాడు."

మౌనిక ఊహించని ఆదేశానికి ఒక్క క్షణం తత్తరపడింది.

"ఇప్పుడా? మీ ముందా? అంది"

"ఏం నా ముందు పాడకూడదా?"

మౌనిక సిగ్గుగా నవ్వి అంది "భయమేస్తుంది."

"ఎందుకమ్మా భయం? సినిమాల్లో పాడిన దానివి నా ముందు పాడలేవా? పాడు ఫర్వాలేదు."

మౌనిక రెండు నిమిషాలు తలవంచుకుని మౌనంగా ఉండి అందుకుంది "మధురానగరి సమీపంలో, మలయానది సమీరంలో అర్ధనిమీలిత దృక్కులతోనే ఎదురుచూతునోయి.. కృష్ణా.." కళ్ళు వాల్చుకుని సన్నటి పెదాలు సున్నితంగా తెరిచి శ్రావ్యంగా పాడుతున్న మౌనికవైపే మంత్రముగ్ధురాలిలా చూడసాగింది ఆవిడ. అప్పటివరకూ ఉషాకాంతలాంటి గొప్ప గాయని ముందు పాడటానికి బెదిరిపోయి మౌనిక రాగం ఎత్తుకున్న క్షణం నుంచీ అందులో లీనమై తానే ఓ రాగమైపోయింది.

"ఈ పాట ఎవరు పాడారో తెలుసా?" ఉషాకాంత ప్రశ్నకి తల్లెత్తి చూసింది మౌనిక.

"వేదవతి ప్రభాకర్‌గారు"

"ఎవరు రాశారో తెలుసా?"

తెల్లమొహం వేసి చూసింది మౌనిక. "తెలియదు"

"వింజమూరి శివరామారావుగారు రాశారు. వీరు రాసిందే మరో తియ్యని పాట రావు బాలసరస్వతిగారు పాడారు" అది తెలుసా!

"ఊహూ."

"నల్లనివాడా నే గొల్లపిల్లనోయి పిల్లన గ్రోవూదుమా నా ఉల్లము రంజిల్లగా" పాడుతున్న కోకిల స్వరం మీద వెన్నెల కురుస్తున్నట్టుగా ఆవిడ తీయని స్వరం చల్లగా, మెల్లగా, హాయిగా.

"ఎంత అదృష్టవంతురాలిని!" అప్రయత్నంగా అంది మౌనిక విభ్రాంతిగా చూస్తూ.

రెండు చేతులూ సాచి మౌనికను దగ్గరగా తీసుకుని నుదుటిమీద ముద్దుపెట్టుకుంటూ అంది ఉషాకాంత "నువ్వు కూడా చాలా తీయగా పాడావు తల్లీ. తప్పకుండా నేర్పిస్తాను గొప్ప గాయనివి అవుతావు."

"మీ అంత గొప్పగాయనిని అవుతానా?" ఆవిడ గుండెల్లో ఒదిగిపోతూ ఆశగా అడిగింది.

"నాకన్నా గొప్పదానివి అవుతావు సరేనా?"

"థాంక్యూ పెద్దమ్మా."

ఒక్కసారిగా ఆవిడ గుండె ఝల్లుమంది. అమ్మా, పిన్ని, పెద్దమ్మా, అత్తా ఈ పిలుపులేవీ ఆవిడ గుండెల్ని సోకలేదు ఇంతవరకూ. ఏ బంధాలు ఆవిడని తడమలేదు. జీవితంలో రాగాలెన్ని ఉన్నా మమతానురాగాలు చవిచూడని ఆవిడకి ఇవాళ తన మానసవీణ కొత్తరాగాన్ని ఆలపిస్తున్నట్టుగా అనిపించింది. "ఎంత ప్రేమగా పిలిచావు తల్లీ" అంది.

"నా పిలుపులో లేదు పెద్దమ్మా. ప్రేమ మీ మాటల్లో ఉంది. మీ స్పర్శలో ఉంది."

"మౌనికా.. ఇన్ని మాటలెక్కడ నేర్చుకున్నావు?"

మౌనిక నవ్వింది.

ఇన్నేళ్ళ వంటరి జీవితంలో ఎందరో శిష్యులు వారి అభిమానాన్ని, గౌరవాన్ని ఆవిడకి అందించినా ఇంత నిష్కల్మషమైన అభిమానాన్ని ఎన్నడూ ఎవరివద్దా పొందలేదు. ఇవాళ ఈ మౌనిక అందిస్తున్న ఈ ప్రేమ ఏ జన్మది?

జీవితపు ఆఖరి అంచులో ఈ అమ్మాయినిలా ఇంత దగ్గరగా ఎందుకు పంపించాడా దేవుడు? ఇంతకాలం లేని అనుబంధాలు ఇప్పుడెందుకు పంచుతున్నట్టు?

"ఏం ఆలోచిస్తున్నారు పెద్దమ్మా?" అడిగింది మౌనిక.

ఆవిడ కళ్ళల్లో తడి కనిపించకుండా మొహం తిప్పుకుంటూ "ఏం లేదు తల్లీ" అంది.

ఆవిడ మనసులో కలుగుతున్న భావోద్వేగం అర్ధం చేసుకున్న దానిలా మౌనిక ఆవిడ చేతిమీద తన చేయి వేసింది.

ఆ స్పర్శలో నీకు నేనున్నాను అని తెలిపే సంకేతం నరనరానా పాకుతూ ఆవిడలో అప్పటిదాకా ఉన్న నైరాశ్యాన్ని తరిమివేస్తున్నట్టు అనిపించింది.

గభాల్న లేస్తూ "ఇలా రా" అంటూ గబగబా బైటికి నడిచి పూజగది వైపు వెళ్ళింది.

మౌనిక ఆవిడ వెనకాలే వెళ్ళి ఆవిడ ఏం చేస్తుందా అన్నట్టు కుతూహలంగా చూడసాగింది.

ఆవిడ హారతి పళ్ళెంలో కర్పూరం వేసి, వెలిగించి అక్కడే ఉన్న సరస్వతీ దేవి విగ్రహానికి, వినాయకుడికి హారతిచ్చి మౌనిక వైపు తిరిగిఅంది "అద్దుకో ఇవాళే మనం పాఠాలు ప్రారంభిద్దాం."

మౌనిక భక్తిగా హారతి కళ్ళకద్దుకుంది.

ఇద్దరూ రెండు చేతులూ జోడించి కళ్ళు మూసుకుని రెండు నిమిషాలు అలాగే నిలబడిపోయారు.

ఇద్దరి మనసుల్లోనూ ఎగసిపడుతున్న భావోద్వేగాలు ఎన్నో... కానీ వేరు, వేరు భావాలు.

**ఫోన్ మోగింది.**

తల వంచుకుని నోట్స్ రాసుకుంటున్న సుప్రియ తల తిప్పి టేబుల్ మీద పక్కనే పెట్టుకున్న మొబైల్ వైపు అసహనంగా చూసింది.

మౌనిక కాలింగ్.. అక్షరాలు కనిపించటంతో చటుక్కున పెన్ను పుస్తకం మీద వదిలేసి మొబైల్ అందుకుంది.

'హాయ్ అక్కా' ఆన్సరింగ్ బటన్ నొక్కి సంతోషంగా పిలిచింది.

'హాయ్ సుప్రీ ఏం చేస్తున్నావే? ' అడిగింది మౌనిక.

'నోట్స్ రాసుకుంటున్నానక్కా.. చాలా ఉంది. పరీక్షలు కూడా దగ్గరకొస్తున్నాయిగా' కొంచెం దిగులుగా అంది సుప్రియ.

'పరిక్షలొస్తున్నాయని దిగులుపడితే ఎలా? అప్పుడే మనం స్ట్రాంగ్‌గా ఉండాలి. నేను చూడు ఎంత స్ట్రాంగ్‌గా ఉన్నానో నాకన్నా పెద్ద పరీక్ష అటెండ్ అవబోతున్నావా?' నవ్వింది మౌనిక.

'కాదనుకో ఇంతకీ ఎలా ఉంది అక్కడ?'

'హాయిగా ప్రశాంతంగా ఉంది. కోటలో పాగా వేసాను.'

'ఎవరెవరు ఉంటారు?'

'నేను, ఆవిడా, పనిమనిషి, తోటమాలి, వంటావిడ.'

'అయితే ఆవిడ ఇన్నేళ్ళ నుంచి ఒంటరిగానే ఉన్నారన్నమాట.'

'అన్నమాటేగా.'

'మరి అమ్మ అలా అనేదేంటి?'

'అమ్మకి మాత్రం ఏం తెలుసే. అందరూ అనే మాటే అమ్మా అనేది. ఏది ఏమైనా సుప్రియా.. మన పెద్దమ్మ. రక్తసంబంధం ఉంది మనకు. ఆవిడ ఎవరో తెలియనంతకాలం ఆవిడ ఎలా ఉన్నా, ఎక్కడ ఉన్నా మనకేం సంబంధం లేదు. కానీ, ఆవిడ మనకి ఏమవుతుందో తెలిసాక ఈ వయసులో ఆవిడని మనం ఒంటరిగా వదిలేయడం అన్యాయం కదూ..'

'చాలా అన్యాయమక్కా. నెమ్మదిగా నువ్వు ఆవిడ దగ్గర మంచిపేరు సంపాదించుకో. తరువాత మన బంధుత్వం సంగతి చెప్పు. ఆవిడ ఏ మాత్రం ఫేవర్‌గా ఉన్నా అమ్మని తీసుకెళ్ళొచ్చు. అక్కా చెల్లెళ్ళను కలిపిన క్రెడిట్ మనకి దక్కుతుంది. '

'అవును. కుటుంబమే లేదనుకుంటూ నిర్లిప్తంగా బతికే పెద్దమ్మను కుటుంబం ఉన్నా తనకెవరూ లేరని బాధపడే అమ్మనూ కలిపితే మనకి ఒక పెద్ద కుటుంబం ఏర్పడుతుంది కదూ.'

'ఇంతకీ నీ సంగీత పాఠాలు మొదలైనాయా? '

'ఆ రెండు రోజులైంది. ఎంత హాయిగా ఉందో పెద్దమ్మ పాడుతుంటే అలా వింటూ ఉండిపోవాలనిపిస్తుంది.' మౌనిక స్వరంలో వినిపించిన పరవశం సుప్రియకు కూడా హాయిని గొలిపింది.

'అది సరే మళ్ళీ ఎప్పుడొస్తావు నువ్వు ఇంటికి? అమ్మ అడుగుతోంది ఎన్నాళ్ళే అక్క ట్రైనింగ్ అని.'

'ఆరునెల్లు అని చెప్పాగా. నువ్వుకూడా అదే చెప్పు.'

'చెప్పాలే కానీ, అస్తమానం అడుగుతూనే ఉంటుంది చాదస్తం కదా. సరేలే మరి ఉంటానక్కా.. నేను నోట్స్ రాసుకోవాలి.'

'అలాగే ఆల్ ద బెస్ట్. ' అవతల ఫోన్ ఆఫ్ అయిపోడంతో సుప్రియ తన మొబైల్ పక్కన పెట్టేసి తిరిగి పెన్ అందుకుంది.

కానీ, ఆమె చెయ్యి ముందుకు కదల్లేదు. ప్రారంభించి వదిలేసిన దగ్గరే ఆగిపోయింది.

అక్కకెంత ధైర్యమో అనుకుంది.

మౌనిక, సుప్రియ అక్కాచెల్లెళ్ళు. తండ్రి ఆర్మీలో చేసేవాడు. సుప్రియ పుట్టిన నాలుగేళ్ళకు చనిపోయాడు. అతని మరణం తరువాత వచ్చిన కొంత డబ్బు, ఆ పెన్షన్‌తో తల్లి సంధ్యాదేవి ఇద్దరాడపిల్లల్నీ పెంచి పెద్దచేసింది. మౌనికకి చిన్నప్పటి నుంచీ పాటలంటే మహా ఇష్టం. రేడియోలో వచ్చే ప్రతి సినిమా పాట నేర్చేసుకుని పాడేస్తుండేది. స్కూల్లో, కాలేజీలో కూడా జరిగే కార్యక్రమాల్లో ఎవరూ అడక్కుండానే పాటపాడేస్తూ బహుమతులు కొట్టేస్తూ ఉండేది. సుప్రియకి చదువంటే ఇష్టం. చదువు తప్ప వేరే ఆలోచన, ఆసక్తి లేవు. మౌనిక ఇంటర్‌లో ఉండగానే వాళ్ళనడిగి, వీళ్ళనడిగి టి.వి సినిమాలకు సంబంధించిన సమాచారం మొత్తం సేకరించి నెమ్మదిగా చిన్న, చిన్న కార్యక్రమాల ద్వారా టి.వి ఛానెల్స్‌లో దూరిపోయింది. ఆ తరువాత ఇంటర్ అయిపోగానే చదువాపేసి మీడియావైపు పూర్తిగా ఆకర్షితురాలైంది.

ఆ పిల్ల ధైర్యం, చాకచక్యం ఆమెని మంచి గాయనిగా నిలబెట్టి అడపా, దడపా సినిమాల్లో గ్రూపు సాంగ్స్ ఏవన్నా ఉంటే పిలవడం మొదలుపెట్టారు. కూతురు చదువు మానేసి అలా మీడియా వైపు వెళ్ళడం సంధ్యాదేవికి ఇష్టం లేకపోయినా అంతో, ఇంతో ఆ

పిల్ల సంపాదన చూసాక ఆర్థిక ఇబ్బందులను తట్టుకోడానికి, చిన్నకూతురు చదువు సజావుగా సాగడానికి అదే మంచిదని నిర్ణయించుకుంది.

అయితే ఇటీవల ‘పాటపాడనా‘ అనే కార్యక్రమంలో ఉషాకాంత కనిపించిన దగ్గర్నించీ తల్లిలో చిత్రమైన మార్పు గమనించింది మౌనిక. ఆ పిల్ల ఉషాకాంతని ఎప్పుడూ చూడకపోయినా ఆవిడ పాటలు వింటూ ఉండడం వలన ఆవిడ ఒక మంచి గాయని అని తెలుసు. తను నేర్చుకుని పాడుకునే పాటల్లో ఆవిడ పాటలు కూడా ఉన్నాయని తెలుసు. ఐతే ఆవిడని చూడగానే తల్లి కన్నీళ్ళు పెట్టుకోడం చూసి ఓ రోజు అడిగింది ‘ఎందుకమ్మా ఆవిడని చూసి కన్నీళ్ళు పెట్టుకున్నావు?‘ అని.

ఆరోజు తల్లి చెప్పిన విషయం విని మౌనిక, సుప్రియ కూడా నిర్ఘాంతపోయారు.

అప్పటిదాకా వాళ్ళకి అమ్మమ్మ, తాతయ్య, తండ్రి మాత్రమే తమకు ఉండేవారని వాళ్ళు చనిపోయారని తెలుసు. కానీ ఒక పెద్దమ్మ ఉండేదని, ఆవిడదొక చిత్రమైన జీవితం అనీ ఆవిడే ఉషాకాంత అనీ తెలిసి ఆ మిష్టరీ కథ వినాలని ఆరాటపడ్డారు.

కానీ సంధ్యాదేవి ఆ అక్కాచెల్లెళ్ళకు ఏమీ చెప్పకుండా ‘ఆవిడా, నేను అక్కా చెల్లెళ్ళం అనే విషయం చరిత్రలో మరుగునపడిపోయింది. ఇప్పుడా విషయాలేవీ కెలక్కండి‘ అంటూ నిక్కచ్చిగా చెప్పడంతో ఎట్లాగైనా ఆ చరిత్ర ఏంటో తెలుసుకోవాలనే తపన, ఆరాటం ఇద్దరికీ మొదలైంది.

‘అది తెలుసుకోవాలంటే ఉషాకాంతకి దగ్గర కావాలి‘ అంది మౌనిక ఓరోజు చెల్లెలితో

‘ఎలా? ‘ ఆశ్చర్యంగా అడిగింది సుప్రియ.

‘అదే ఆలోచిస్తున్నా‘ అంది మౌనిక.

‘అమ్మకిష్టం లేనట్టే ఆవిడకి కూడా మనతో ఉన్న అనుబంధం ఎవరికీ చెప్పుకోడం ఇష్టం ఉండకపోవచ్చు కదక్కా! ఎలా ఆవిడ దగ్గరకు వెళ్ళడం?‘ అడిగింది సుప్రియ.

‘చెప్తాను నన్ను ఆలోచించుకోనీ ‘ అంది సీరియస్‌గా ఆలోచిస్తూ మౌనిక.

దాదాపు నాలుగు రోజుల తరువాత తన ఆలోచన చెప్పింది. సుప్రియ అక్క తెలివితేటలకి ఆశ్చర్యపోయింది.

‘అవుతుందంటావా అక్కా?‘ అనడిగింది అనుమానంగా.

‘సంకల్పబలం ఉంటే విజయం అదే వరిస్తుంది‘ అంది మౌనిక వేదాంతిలా.

ఆ ఆలోచనకి రూపమే తను ఒక మంచి గాయనిని అని, ఉషాకాంత ఇంట్లో స్థానం సంపాదించుకోగలిగింది మౌనిక.

తన ధ్యేయం నెరవేరిందాక ఈ విషయం తల్లికి కానీ, ఇంకెవరికి కానీ తెలియకుండా అక్కాచెల్లెళ్ళిద్దరూ ఒప్పందం చేసుకున్నారు.

‘అక్క ఎంతైనా ధైర్యస్తురాలు‘ అనుకుంది సుప్రియ మరోసారి.

ఎక్కడినుంచో కోయిల తీయని స్వరం వినిపించింది.

మౌనిక తన గదిలోంచి గభాల్న పెరటివైపు బాల్కనీలోకి వచ్చింది.

కాంపౌండ్ వాల్‌కి అవతల పక్క విశాలంగా విస్తరించిన మామిడి చెట్టు నిండుగా చిగురుతో కళకళ్ళాడుతోంది.

మార్చి నెల... శిశిరం సెలవు తీసుకుంటూ వసంతానికి స్వాగతం పలుకుతున్న రోజులు.

ఎటు చూసినా మామిడి పూత, వేపపూతల పరిమళాలతో నిండి ఉంది ప్రకృతి.

గాలికి రాలుతున్న కొన్ని ఆకులు నేలమ్మతో ముచ్చట్లాడుతున్నాయి.

మధ్యాహ్నం భోజనాలు చేసాక ఓ గంటసేపు విశ్రాంతి తీసుకుంటుంది ఉషాకాంత.

ఆ సమయంలో మౌనిక తనకు కేటాయించిన గదిలో కూర్చుని ఏదన్నా చదువుకుంటూనో, లేక అటూ, ఇటూ తిరుగుతూనో కాలక్షేపం చేస్తుంది.

మూడున్నర దాటింది సమయం. ఎండ తగలకుండా నీడని పరుస్తున్నాయి చెట్లు.

మౌనిక అక్కడినుంచి కదిలి తన గదిలోంచి బైటికి వచ్చింది.

హాల్లో కూర్చుని రామాయణం చదువుకుంటోంది వంటమనిషి సీతమ్మ. మౌనికను చూసి 'ఏమన్నా కావాలా తల్లీ?' అనడిగింది ఆప్యాయంగా.

'ఏం ఒద్దండి. పెరట్లో చల్లగాలి వీస్తోందికదా కాసేపు అలా తిరుగుదామని' అంది మౌనిక నవ్వి.

'వెళ్ళు' అంటూ ఆవిడ తిరిగి రామాయణం చదువుకోడంలో మునిగిపోయింది.

మౌనిక ఎవరో.. ఇన్నేళ్ళనుంచీ ఎవరూ బంధుమిత్రులు రాలేదు. ఆవిడకి ఎవరూ లేరు. ఒంటరిగా బతుకుతున్న ఉషాకాంత దగ్గరకి ఊహించని అతిధిలా వచ్చి ఇక్కడే ఉంటోన్న ఆ అమ్మాయి ఎవరో తెలియకపోయినా అమ్మగారికి ఆప్తురాలు అయి ఉంటుందని, అందుకే ఆవిడ తనింట్లో ఆ అమ్మాయికి చోటిచ్చి ఉంటుందని అర్థం చేసుకున్న సీతమ్మ మౌనిక పట్ల ఎంతో ఆదరంగా ఉంటుంది. మిగతా పనివాళ్ళు కూడా ఆమె ఎవరు? ఏంటి? అనే విషయాలు పట్టించుకోకుండా గౌరవంగా అభిమానంగా చూడడం మౌనికకు తమాషాగా అనిపిస్తుంది. అదంతా ఉషాకాంత ఇచ్చిన ట్రైనింగ్ కాబోలు అనుకుంది.

అటూ ఇటూ తిరుగుతూ ఏవో సర్దుతున్న పనమ్మాయి లక్ష్మివైపు చూసింది మౌనిక.

అప్పుడే లక్ష్మి కూడా తనవైపు చూడడంతో నవ్వి 'కాసేపు అలా తిరుగుదాం వస్తావా?' అంది.

లక్ష్మి 'వస్తాను' అన్నట్టు తల ఊపి దోపిన చీరకుచ్చిళ్ళు సవరించుకుంటూ మౌనికతో పాటు పెరట్లోకి నడిచింది.

చల్లగాలి మృదువుగా తాకింది. చెదిరిన వెంట్రుకలు సుతారంగా సవరించుకుంటూ 'వాతావరణం చాలా బాగుందికదూ' అంది మౌనిక.

'అవును' అన్నట్టు నవ్వింది లక్ష్మి.

'నువ్వెప్పటినుంచి పనిచేస్తున్నావు ఇక్కడ?' నెమ్మదిగా మాటల్లోకి దింపింది.

'పదేళ్ళ నుంచీ అమ్మగారి దగ్గరే పనిచేస్తున్నానండి.'

'ఇక్కడికి వచ్చినప్పుడు నీ వయసెంత?' ప్రస్తుతం ఆమె వయసెంతో ఊహించడానికి ప్రయత్నిస్తూ అడిగింది.

'లక్ష్మి సిగ్గుపడుతూ నవ్వి నాకు తెల్దండి' అంది.

'మీ అమ్మా, నాన్న ఎక్కడుంటారు?'

'అమ్మగారిది బొబ్బర్లంక కదండీ మా యమ్మ ఆడే ఉండేదండి. అమ్మ పోయాకండి నన్ను ఈ పెద్దమ్మగోరే పెంచారండి.'

ఓ చాలా కథ ఉందే మనసులో అనుకుని 'అలాగా' అని నవ్వి ఊరుకుంది.

బొబ్బర్లంక... అదెక్కడో అమ్మమ్మవాళ్ళు గుంటూరులో ఉండేవాళ్ళు. గుంటూరు దగ్గరర ఏదో ఊరు. పేరేంటబ్బా గుర్తుచేసుకోడానికి ప్రయత్నించింది. ఆ... గుర్తొచ్చింది. మంగళగిరి.

మరి పెద్దమ్మ బొబ్బర్లంకకి ఎలా వచ్చింది? పెళ్ళి చేసుకుని వచ్చిందా? పెళ్ళి చేసుకుని వస్తే మరి బంధుత్వాలు ఎందుకు పోయాయి? అంటే పెద్దమ్మ ప్రేమించి పెళ్ళిచేసుకుందా? అప్పట్లో ప్రేమ పెళ్ళిళ్ళు ఉండేవా? లేదు. ఇంకేదో ఉంది అదేంటో?

'మీరు అమ్మగారికి ఏటవుతారండి?' లక్ష్మి ప్రశ్నతో ఆలోచనలనుచి తెప్పరిల్లి అనుకోని ఆ ప్రశ్నకి సమాధానం తోచక ఒక్క క్షణం తడబడి తరవాత చిరునవ్వుతో అంది 'ఏమీ అవను. ప్రస్తుతం ఆవిడ శిష్యురాలిని.'

'అంటేనండి'

'అంటే... ఆలోచిస్తూ అంది అంటే ఆవిడ దగ్గర సంగీతం పాఠాలు నేర్చుకోడానికి వచ్చానన్నమాట.'

'అలాగటండి. అమ్మగారు ఎవరికీ సంగీతం పాఠాలు చెప్పరు కదండి.'

ఆసక్తిగా చూసింది 'ఏం ఎందుకని?'

'ఏమోనండి తెల్దండి. శానామంది అడిగేవోరండి సెప్పమని. సెప్పనవోరండి'

'ఓ... నేను చాలా అదృష్టవంతురాలిననమాట' అనుకుంది.

'అమ్మగారు శానా మంచోరండి. నన్ను సొంత బిడ్డలా సూసుకుంటారండి.'

చిరునవ్వుతో వినసాగింది లక్ష్మి మొహం వైపు చూస్తూ. నల్లటి నలుపు లక్ష్మి. వయసు ముప్పైపైనే ఉండచ్చు. చిన్నప్పటినుంచీ ఇక్కడే పనిచేస్తోందనమాట. ఈమె మాటలని బట్టి చూస్తే తల్లి, తండ్రి లేరు మరి భర? పెద్దమ్మ ఈ అమ్మాయికి పెళ్ళి చేసి ఉండచ్చుకదా! ఎందుకు చేయలేదో?

'అమ్మగారు నాకు మనువుకూడా సేసినారండి. కానీ దురదృట్టం మా ఆయన ఏడాదికే పోయినాడండి. అప్పటినుంచీ నేను ఇక్కడే ఉంటున్నానండి.'

అడక్కుండానే సమాధానాలు రావడంతో లక్ష్మి చెప్పేది శ్రద్ధగా వినసాగింది.

ఇంతలో పెరటి తలుపు తెరుచుకుని వెంకన్న వచ్చి 'అమ్మగారు లేచారమ్మా.. తమరిని రమ్మంటున్నారు' అని పిలవడంతో ఇద్దరూ లోపలికి నడిచారు.

హాల్లో సోఫాలో కూర్చుని టీ తాగుతోంది ఉషాకాంత.

మౌనికను చూడగానే 'రామ్మా' అంటూ పిలిచింది ఆప్యాయంగా.

మౌనిక వచ్చి ఆవిడ పక్కన కూర్చుంది.

'కాసేపు పడుకోపోయావా? ' ఆప్యాయంగా అందావిడ.

'అలవాటు లేదండి' నవ్వింది మౌనిక.

'నా గదిలో సంగీతానికి సంబంధించిన చాలా పుస్తకాలు ఉన్నాయి. నీకిస్తాను చదువుకో.'

'అలాగే.'

'నీకు ఇంగ్లీషు బాగా వచ్చా?' అడిగిందావిడ.

మౌనిక నవ్వి 'నేను ఇంగ్లీషు మీడియం చదువుకున్నాను' అంది.

'అయితే నా దగ్గర చాలా ఇంగ్లీషు పుస్తకాలు కూడా ఉన్నాయి.'

'మీరు ఇంగ్లీషు చదువుతారా?' ఆశ్చర్యంగా చూసింది మౌనిక.

'ఏం? నాకు చదువురాదనుకున్నావా?' ఆవిడ పెదవుల చివర నవ్వు.

'అదికాదు ఊరికే అడిగాను.'

ఆవిడ మళ్ళీ అంది 'పరీక్షలు రాయలేదు. సర్టిఫికెట్లు లేవు కానీ, నువ్వు ఏ సబ్జెక్ట్ అడిగినా చెప్పగల పరిజ్ఞానం సంపాదించాను కేవలం పుస్తకాలు చదివి. చదువంటే పరీక్షలు పాసవడం కాదు. చదువంటే జ్ఞానాన్ని సముపార్జించడం. చదువు ఉద్యోగం కోసం అనుకుంటూ, ఏ చదువు చదివితే ఎలాంటి ఉద్యోగం వస్తుందో అని ముందే తెలుసుకుని అదే చదువుకుంటున్నారు ఇప్పటి తరం వాళ్ళు. కానీ, అది పద్ధతికాదు. చదువు ఉన్నతంగా, సంస్కారవంతంగా బతకడానికి. విలాసవంతంగా బతకడానికి కాదు నువ్వేమంటావు?'

ఆవిడ మాటలు ముగ్ధురాలై వింటున్న మౌనిక హఠాత్తుగా ఆవిడ వేసిన ప్రశ్నకి కొంచెం కలవరపడి అంది 'నేను మీకన్నా అన్ని విషయాల్లో చాలా చిన్నదాన్ని నేనేమంటాను?'

'చిన్నవాళ్ళకి కూడా పెద్ద ఆలోచనలుంటేనే జీవితాన్ని తీర్చిదిద్దుకోగలుగుతారమ్మా. మీరంతా నవతరం వాళ్ళు. తెలివైన వాళ్ళు. చక్కగా జీవించాలి. హాయిగా ఉండాలి. ' ఆవిడ స్వరంలో లీలగా వినిపించిన వణుకు.

సానుభూతిగా చూసింది మౌనిక.

ఆవిడ టీ తాగేసి కప్పు టీపాయ్ మీద పెట్టి 'వెడదాం పద. క్లాసు మొదలు పెడదాం' అంటూ లేచింది.

మౌనిక తను కూడా లేచి ఆవిడని అనుసరించింది.

ఇద్దరూ సంగీతం ప్రాక్టీస్ చేసే గదిలోకి వెళ్ళారు. అది ఒక ప్రత్యేకమైన గది. చాలా విశాలంగా ఉంది. గోడకి ఒకే ఒక్క ఫోటో. ఆ ఫోటో శ్వేత వస్త్రధారిణి అయి వీణ ఒడిలో పెట్టుకుని చిరునవ్వుతో దీవిస్తున్నట్టు ఉన్న సరస్వతీదేవిది. ఒక మూల చిన్న బల్ల మీద వీణ, మరో పక్క తంబురా. మధ్యలో ఖరీదైన తివాచీ పరిచి ఉంది. గదంతా మంచి అగరువత్తుల పరిమళం వ్యాపించి ఉంది.

ఆవిడ తివాచీ మధ్యలో ఉన్న దివాన్ మీద కూర్చుంది.

మౌనిక ఆవిడ ఎదురుగా తివాచీ మీద కూర్చుంది.

లక్ష్మి వచ్చి ఆవిడ చేతికి తంబురా తెచ్చిచ్చి వెళ్ళిపోయింది.

ఆవిడ మెల్లగా తంబురా మీటుతూ శృతిచేయసాగింది.

**ఉషాకాంత శిక్షణలో** మరో ఆరునెలలు గడిచిపోయాయి. ఇప్పుడు మౌనిక మునపటికన్నా బాగా పాడగలుగుతోంది. ఆమె అనేక ప్రయత్నాలు చేసి వేదికలమీద ఎన్ని పాటలు పాడినా, అడపాదడపా సినిమాల్లో నేపథ్య సంగీతానికి గుంపులో తన గొంతు కలిపినా ఆమె పాటలో ఎన్నో అపస్వరాలు వినిపిస్తుండేవి. అవి కంప్యూటర్ మాయాజాలంలో కొట్టుకుపోయి మౌనిక ఒక గాయనిగా నిలబడ్డానికి దోహదపడింది.

మొదటిసారి ఉషాకాంత ఎదురుగా పాడిన రోజు ఆవిడ వీపు తట్టి ప్రోత్సహించినట్టు అనిపించి బాగానే పాడినా, శిక్షణ ప్రారంభించాక అనేక అపస్వరాలు దొర్లడం ఉషాకాంత గమనించింది. ఆ అమ్మాయి తనొక నేపథ్యగాయని అని తనని తను పరిచయం చేసుకున్న మొదటిరోజు గుర్తొచ్చి ఆవిడ పెదవుల మీద చిన్న చిరునవ్వు విరిసేది. ఆ చిరునవ్వు చూడగానే మౌనిక సిగ్గుతో ముడుచుకుపోతుండేది. నెమ్మదిగా ఆవిడ సహనంతో ఒకటికి పదిసార్లు పాడించి సానపట్టడంతో ఇప్పుడు మౌనిక చక్కగా పాడగలుగుతోంది.

''శాస్త్రీయ సంగీతం అభ్యాసం లేకుండా రాదమ్మా.. రోజూ కనీసం గంటన్నా సాధన చేయాలి.'' అంటూ రోజూ ఉదయాన్నే లేపి సాధన చేయిస్తోంది.

సరళీస్వరాలనుంచి ప్రారంభించి ఇప్పుడే స్వరజతులు అయిపోయి గీతాల్లోకి వచ్చింది.

వరవీణా గీతం మొదలుపెట్టగానే మౌనికకు తను చాలా నేర్చేసుకున్న అనుభూతి, ఆనందం కలిగాయి. ఉత్సాహంగా స్వరాలు అందుకుంది.

మధ్య, మధ్య ఉషాకాంత తప్పులు సరిదిద్దుతూ, మరోసారి, మరోసారి పాడిస్తుంటే నెమ్మదిగా మౌనిక గళంలో పదును తేలి మృదుమధురమైన గీతంగా సాగింది.

ఆ రోజు పౌర్ణమి.

ప్రతి పౌర్ణమికీ ఉషాకాంత కోరికమీదట వెన్నెల్లో డిన్నర్ ఏర్పాట్లు చేస్తుంది సీతమ్మ. ఆ రోజు కూడా అలాగే రాత్రి ఏడున్నర అయేసరికి మేడమీద ఉన్న కేన్ టీపాయ్ మీదకి సీతమ్మ, లక్ష్మి కలిసి వండిన వంటలన్నీ చేర్చారు. ఉషాకాంత స్నానం చేసి తెల్ల కాటన్ చీర కట్టుకుని మేడమీదకి వచ్చింది. మౌనిక కూడా స్నానం చేసి నైటీ వేసుకుని వచ్చింది.

ఆకాశంలో నిండు చంద్రుడు రాజసంతో వెలిగిపోతున్నాడు. అక్కడక్కడా మిణుకు, మిణుకుమంటూ అక్కడక్కడా మేఘాలతో దోబూచులాడుతున్న తారకలు రారాజుని చూసి చేరువ అవడానికి పరుగులు పెడుతూ వస్తున్నాయి. డాబా పిట్టగోడ మీదకి వాలిన సన్నజాజులు విచ్చుకుని పరిమళాలు వెదజల్లుతున్నాయి. నాలుగువైపులా పేర్చిన కుండీల్లో గులాబీలు, చేమంతులు, లిల్లీలు, కనకాంబరాలు వెన్నెల్లో స్నానాలు చేస్తూ పరవశించిపోతున్నట్టుగా అటూ, ఇటూ ఊగసాగాయి.

కేన్ కుర్చీల్లో ఆసీనులైయారు ఉషాకాంత, మౌనిక.

సీతమ్మ ఇద్దరికీ ప్లేట్లలో పుల్కాలు పెట్టి, కూరవేసి టీపాయ్ మీద పెట్టింది. లక్ష్మి మంచినీళ్ళ గ్లాసులు తెచ్చిచ్చింది.

''వెన్నెలంటే మీకిష్టమా ఆంటీ?'' ప్లేటు అందుకుంటూ అడిగింది మౌనిక. అడిగాక తన తెలివితక్కువ ప్రశ్నకి తనని తనే తిట్టుకుంది.

ఆవిడ నవ్వింది ''వెన్నెలంటే ఇష్టంలేని మనిషేకాదు మౌనికా, అసలు జీవులే ఉండవు. వెన్నెలంటే అదిగో ఆ గులాబీ పూవుకి ఇష్టం, ఆ సన్నజాజులకీ ఇష్టం. పిట్టగోడకీ ఇష్టం. నేలతల్లికీ ఇష్టం. చూడు తన మీద విచ్చలవిడిగా కురుస్తున్న వెన్నెలని తనలో పొదుపుకోవడానికి ఎంతగా ఆరాటపడుతోందో! '' ఆ తలి అంది నేలమీద జారుతున్న వెన్నెలవానవైపు చూస్తూ.

మౌనిక ముగ్ధురాలైపోయింది ఆవిడ మాటలకి. ఈవిడకి సంగీతమేకాదు సాహిత్యం కూడా తెలుసు కాబోలు. ఎంత భావుకత ఈవిడలో అనుకుంది.

అందుకేనేమో కుటుంబంలో అందరిలోకి విభిన్నమైన జీవితం గడుపుతోంది. ఇంత విభిన్నమైన ఆలోచనలున్నందుకేనా?

''నాకు నా సంగీతం తరువాత ఈ ప్రకృతే తోడు. ప్రకృతిని ప్రేమిస్తాను.. ప్రకృతిలో ఆడుకుంటాను. ప్రకృతిలో పాడుకుంటాను, ప్రకృతిలో మమేకమై జీవిస్తున్నాను.''

ఈవిడ ప్రకృతికాంత ఉషాకాంత కాదు అనుకుంది మౌనిక.

''ఈవాళ పౌర్ణమి కదా పెరట్లో అన్నాలు తిందాం'' అని ఎప్పుడు అడిగినా, ''తోటలో తినడం ఏంటే నీకేం పిచ్చా అసహ్యంగా అలా బైట కూర్చుని తినడం ఏంటి? పురుగులూ పుట్రా చేరవూ! '' అంటూ మందలించే తల్లి సంధ్యాదేవి గుర్తొచ్చింది మౌనికకి.

నింగికీ, నేలకీ ఉన్నంత తేడా వుంది అక్కా చెల్లెళ్ళకి అనుకుంది.

ఈవిడ ఎంత తీయగా పాడగలదో, అంత తీయగా బతకగలదు. అమ్మకి పాటలు రావెందుకో!?

"ఏంటి ఆలోచిస్తున్నావు మౌనికా! " అడిగింది ఆవిడ.

మౌనిక ఆలోచనలనుంచి తేరుకుని నవ్వి అంది "ఏం లేదాంటీ.. మీ అంత తీయగా ఎప్పుడు పాడగలనా అని ఆలోచిస్తున్నాను."

"నాకన్నా బాగా పాడుతున్నావు. సరేనా?" మృదువుగా అంది.

గలగలా నవ్వింది మౌనిక. "చిన్నపిల్లకు నచ్చచెప్పినట్టు చెబుతున్నారు. నా సంగతి నాకు తెలుసు లెండి. నేను ప్లేబ్యాక్ సింగర్ని అనుకుని పొంగిపోయిన రోజే తెలిసిపోయింది నాగురించి నాకు."

"నువ్వు బాగా పాడకపోతే సింగర్వి ఎలా అవుతావు?"

"అయ్యో ఆంటీ మీకు ఈ కాలం గురించి ఏమీ తెలియదనుకుంటా. ఈ రోజుల్లో పేరు, ప్రతిష్టలున్నవాళ్ళకి ప్రతిభ ఉండదు. నిజమైన ప్రతిభ ఉన్నవాళ్ళకి గుర్తింపు ఉండదు. ఎవరికి పట్టు పర్శ్రిమ గురించి బాగా తెలుసో వాళ్ళు చాలా గొప్పవాళ్ళు అవుతారు తెలుసా మీకు."

"పట్టు పర్శ్రిమంటే?"

"అంటేనా!? " మరోసారి పక, పకా నవ్వి చెప్పింది మౌనిక. "పట్టుపర్శ్రిమ అంటే ఎక్కడ మనకి అవకాశాలకి అవకాశం ఉంటుందో అక్కడ తిష్టవేసుకుని, సక్సెస్ అయిందాకా పట్టువదలకుండా ప్రయత్నించడం. ఉదాహరణకి నేను సినిమాల్లో హీరోయిన్ కావాలనుకుంటే ఇండస్ట్రీ చుట్టూ ఓపిగ్గా, పట్టుదలగా తిరుగుతూ ఎవరు నాకు అవకాశం ఇస్తారో వాళ్ళని మంచి చేసుకోడం అవకాశాలు కొట్టేయడం.. అవన్నీ రాజకీయ్యాల్లెండి."

ఉషాకాంత నిట్టూర్చింది. "ఒకప్పుడు ప్రతిభను వెతుక్కుంటూ అవకాశాలు వచ్చేవి ఇప్పుడు అవకాశాలను వెతుక్కోడం అందరికీ అలవాటైపోయింది. పరిమళించే పూవుకి గుర్తింపు అవసరమా?"

"ఆంటీ మిమ్మల్నోమాట అడగనా? " సందేహంగా ఒక్కో అక్షరం కూడదీసుకుంటూ అడిగింది మౌనిక.

"చెప్పమ్మా."

మౌనిక కొన్ని సెకన్లు మౌనంగా ఉండి స్వరం తగ్గించి అడిగింది. "మీరు పెళ్ళెందుకు చేసుకోలేదు?"

ఆ ప్రశ్న ఊహించిన ఉషాకాంత వెంటనే సమాధానం చెప్పలేదు.

మౌనిక పుల్కా ముక్క విరిచి కూరలో అద్దుకుని మునిపంట కొరుకుతూ వెన్నెల వెలుగులో ఆవిడ కళ్ళల్లో కదిలే భావాల కోసం వెదకసాగింది.

ఆవిడ చేతిలో ప్లేటు టీపాయ్ మీద పెట్టేసింది.

తింటూ, తింటూ ఆవిడ అలా ప్లేటు పక్కన పెట్టేయడంతో మౌనిక నొచ్చుకుంటూ అంది "సారీ ఆంటీ అడక్కూడని సమయంలో అడిగాను అనుకుంటూ.. ప్లీజ్ తినండి." అంటూ ఆవిడ పక్కన పెట్టిన ప్లేటు తీసి ఆవిడ చేతికివ్వబోయింది.

ఆవిడ అది అందుకోకుండా అంది "తింటాను అలా ఉంచు."

"సారీ ఆంటీ"

ఆవిడ చిరునవ్వు నవ్వింది.. "సారీ ఎందుకు? ఎప్పుడో ఒకప్పుడు నేను ఈ కథ చెప్పాల్సిందేగా. నువ్వు నా దగ్గరకు వచ్చేముందే చెప్పావుగా నా ఆటోగ్రఫీ రాస్తానని. చెప్తాను. నాకూ ఇవాళ చెప్పాలనే ఉంది చెప్తాను." అంటూ కుర్చీలో వెనక్కి వాలి కాలు మీద కాలేసుకుంది. తలెత్తి ఆకాశం కేసి కొన్ని క్షణాలు చూసి నెమ్మదిగా చెప్పడం ప్రారంభించింది.

మౌనిక కుతూహలంగా వినసాగింది.

ఆకాశంలో అల్లరి చేస్తున్న నక్షత్రాలు కూడా బుద్ధిగా కూర్చున్నట్టు కదలకుండా ఉన్నట్టు అనిపించింది మౌనికకి. వినండి వినండి. నేనేదన్నా మర్చిపోతే మీరు చెబుదురుగాని తరువాత అనుకుంది మనసులో.

ఆవిడ స్వరం మోహనరాగం ఆలపిస్తున్నట్టుగా సాగింది.

– కళ అనేది దైవదత్తం. అది అందరికీ అబ్బదు. అబ్బిన కళని సద్వినియోగం చేసుకోకపోతే కళాసరస్వతిని అవమానించినట్టే. ఎవరైనా సరే సద్వినియోగం చేసుకోవాలంటే అందుకు చుట్టుపక్కల ఉన్న వాళ్ళ ప్రోత్సాహం, ఆదరణ కావాలి. అదే లేకపోతే ఆ కళ ఆశ్రయంలేని అనాథలా విలవిల్లాడుతుంది.

వేదవతికి చదువు అబ్బలేదు. అ, ఆ, ఇ, ఈలు దిద్దించినపుడే నాకీ చదువొద్దు అంటూ పేచీపెట్టి అక్షరాలను పాతేసింది కానీ, సరిగమలు ఆమెని ప్రేమించి దరిచేరాయి. ఉత్తరం ముక్క రాసుకునే అక్షరాలు దిద్దించాలనుకున్న తండ్రి కూతురు చదువుపట్ల ఆసక్తి చూపకపోవడంతో కనీసం సంగీతం అన్నా నేర్పిస్తే పెళ్ళయ్యాక మంగళహారతులు పాడుకుంటుందని, మంచి సంగీతం మాష్టారిని పెట్టి సంగీతం నేర్పించాడు. ఆయన ఆశించినట్టే ఆ పిల్ల గాత్రం విని ఇంట్లో నోములు, వ్రతాలకి, పూజలు, పునస్కారాలకి మంగళహారతులు పాడడానికి పనికి వస్తుంది అని ముచ్చటపడి కోడల్ని చేసుకున్నారు అచ్చమ్మగారు.

వేదవతి, విజ్జిబాబుల పెళ్ళి అయింది. అత్తగారు తన బాధ్యతలన్నీ కోడలికి అప్పగించింది.

నలుగురు మరుదులు, ఇద్దరాడబిడ్డలు, భర్త, మావగారు, అత్తగారు, అత్తగారి అత్తగారు ఇంతమంది ఉన్న ఆ ఇంట్లో వేదవతికి రేయింబవళ్ళు పనులు, పూజలు సరిపోయేవి. మంగళహారతులు తప్ప గొంతెత్తి హాయిగా ఏ కీర్తనో పాడుకునే అవకాశం ఆవిడకి దక్కలేదు. గుండెల్లో గీతాలన్నీ నొక్కేసి బతకడం మొదలు పెట్టింది. ఆవిడకి ముగ్గురాడపిల్లలు పుట్టారు.

పిల్లలని నిద్రబుచ్చుతూ సన్నగా ఎవరికీ వినిపించకుండా అన్నమయ్య లాలిపాటలు పాడుతూ తన దాహం తీర్చుకోసాగింది.

అందరిలోకి మూడో అమ్మాయి ఉషాకాంత తల్లిపాటలు వింటూ చిన్నప్పటినుంచీ ఆల్చిప్పల్లాంటి కళ్ళు తెరుచుకుని వింటూ బోసినవ్వులు నవ్వుతుండేది. ఆ పిల్ల అలా కళ్ళు తెరిచి వింటున్న తీరుకి ఆవిడ హృదయం పులకించిపోయేది. దీనికి, నా చిట్టితల్లికి సంగీతం నేర్పాలి అనుకుంది.

ఉషాకాంతకి రెండో ఏడు వచ్చిన దగ్గర్నించీ తల్లి పలికించిన స్వరాలు ముద్దు, ముద్దుగా పలుకుతుంటే పులకించిపోయేది వేదవతి.

ఈలోగా అత్తగారి అత్తగారు కాలం చేయడం, మావగారు అస్వస్థులు కావడంతో వేదవతికి పాడుకునే సమయమూ, పాపకి పాట నేర్పే సమయమూ కూడా ఉండేదికాదు.

ముగ్గురు పిల్లల్ని బళ్ళో వేసాడు విజ్జిబాబు. ఆడపిల్లలు అక్షరాస్యత వైపు వడివడిగా నడుస్తున్న కాలం అది. కందుకూరి వీరేశలింగంగారి స్ఫూర్తితో ఆడపిల్లలని వంటా, వార్పూ నేర్పిస్తూ, కుట్లు, అల్లికలు చేస్తూ బతకమని చెప్పకుండా వాళ్ళని కనీసం స్కూల్‌ఫైనల్ అయినా చదివించాలనుకున్నాడు విజ్జిబాబు.

మరో మూడేళ్ళు గడిచాయి.

అత్తగారు కూడా కాలగర్భంలో కలిసిపోయాక, వేదవతికి కాస్త వీలు చిక్కింది. తల్లిలాంటి అత్తగారు పోయిన దుఃఖాన్ని మర్చిపోడానికి తిరిగి సంగీతాన్ని ఆశ్రయించింది.

భార్య సంగీతం పాడడం ఇష్టమే అయినా తల్లి, తండ్రులంటే ఉన్న భయం, గౌరవం వలన ఇన్నాళ్ళు ప్రోత్సహించడానికి సందేహించిన విజ్జిబాబు తిరిగి భార్య సాధన మొదలు పెట్టడంతో ఎంతో ఆనందించాడు.

భార్యాభర్తలిద్దరూ ఉషాకాంత గాత్రం గురించి, ఆమె సంగీత పరిజ్ఞానం గురించి, ఆసక్తి గురించి చర్చించుకుని ఆ పిల్లని సంగీతంలో మంచి దిట్టగా మలచాలని నిర్ణయించారు.

ఉషతోపాటు, పెద్దపిల్ల చంద్రికకు, రెండో అమ్మాయి సంధ్యకి కూడా సంగీతం నేర్పుతూ ఉషపట్ల మాత్రం కొద్దిగా ఎక్కువ శ్రద్ధ వహించసాగింది వేదవతి. వాళ్ళు కూడా మొక్కుబడికి సరిగమలు పాడేవాళ్ళేకాని ఇద్దరికీ కూడా అంతగా ఆసక్తిలేదు. ఉష మాత్రం చదువు పట్ల కన్నా సంగీతం ఆసక్తి చూపిస్తూ త్వరలోనే కీర్తనలు, వర్ణాలు నేర్చేసుకుని అడపా, దడపా శ్రీరామనవమికో, ఇతర పర్వదినాలప్పుడో పాడుతూ ఉండేది.

చంద్రికకీ, సంధ్యకీ అటు సంగీతము, ఇటు చదువూ కూడా సరిగా అబ్బలేదు. వాళ్ళిద్దరికీ ఏడాది తేడాతో పెళ్ళిళ్ళు అయిపోయాయి.

అప్పటికి ఉషకి పదమూడేళ్ళు వచ్చాయి. అప్పటివరకూ ఒకటీ, అరా పాటలతో మెప్పించిన ఉష మొదటిసారిగా మేనమామగారి ప్రోద్బలంతో శ్రీరామనవమి సంబరాల్లో దాదాపు గంటసేపు గొంతు విప్పి రామదాసు కీర్తనలు పాడింది. ఆ గాత్రానికి శ్రీ రాముడు పొంగిపోయి భవిష్యత్తులో గొప్ప గాయనివి కావాలి అని దీవించాడన్నారు పెద్దలంతా.

వేదవతి రెట్టించిన ఉత్సాహంతో తన కళనంతా కూతురుకి ధారపోసి ఆ సంగీతాన్నే సారెగా ఇచ్చి పదహారో ఏట అత్తారింటికి పంపించింది.

కానీ, సంగీతాన్ని ఆస్వాదించడానికి సున్నితమైన హృదయం ఉండాలి. ఉషాకాంత జీవితం పంచుకున్న వ్యక్తికేకాదు, అతనికి జీవితాన్నిచ్చిన వాళ్ళక్కూడా ఆ హృదయం లేదు. ఆమెకి భగవంతుడు ఇచ్చిన వరం అక్కడ శాపం అయింది ఆమె స్వరం, హృదయం రెండూ మూగబోయాయి.

కాల చక్రంలో నాలుగేళ్ళు గడిచాయి.

ఆమె జీవితం వంటగదికీ, కట్టెలపొయ్యికీ, వచ్చీ, పోయే బంధువులకి వండి వార్చడంతో సరిపోయింది. పిల్లలు పుట్టలేదు గొడ్రాలివన్నారు అందరూ. ఉషాకాంత తల్లి, తండ్రి ఆక్రోశించినా వినకుండా కొడుక్కి మరో పెళ్ళిచేసారు.

అత్తపోరుకి, భర్తపోరుకి, సవతిపోరు తోడైంది. జీవితం నరకం అయింది. తనకి భర్త ప్రేమ దక్కకపోయినా తను ప్రేమించే సంగీతం అయినా పాడుకోడానికి అనుమతినిమ్మని ప్రాధేయపడింది కానీ కసాయి గుండెలు కరగలేదు.

కోయిల గొంతు కోసినా తీయని రాగం ప్రకృతితో పల్లవిస్తూనే ఉంటుంది.

శరీరానికి గాయాలైతే వేసుకోడానికి మందులుంటాయి. కానీ మనసుకి గాయం తగిలితే ఏ మందు ఉంటుంది. మనసులో బాధ చెప్పుకోడానికి ఎవరూ లేరు, ఉన్నవాళ్ళకి ఆమె ఆక్రోశం వినిపించదు, ఆవేదన కనిపించదు.

ఆమెకి ఉన్న తోడు, నీడ ఊపిరి సంగీతం.

గుండెకి గాయాలైనా గొంతు మూగబోదు.

ఆమె గాయపడిన గుండె శోకాన్ని రాగంగా మార్చుకుని అప్రయత్నంగానే భగవంతుడికి తన వేదన వినిపిస్తూ రామదాసు కీర్తన పాడుకోసాగింది.

ఆ పాటలో సర్వం మర్చిపోయి భగవంతుడిలో తనని తాను ఐక్యం చేసుకునేలా సాగింది ఆమె గానం.

ఎవరైతే వినకూడదో అతనే విన్నాడు. ఆ పాట ఆమె భర్త చెవులపడింది. మూర్ఖుడికి మల్లెపూవులాంటి మనసు గురించి తెలుస్తుందా? పశువుకి పాటలో తీయదనం అర్థం అవుతుందా?

పూజ గదిలో కళ్ళు మూసుకుని పారవశ్యంతో పాడుకుంటున్న ఆమె కళ్ళనుంచి రక్తం స్రవిస్తోంది. అది చూసి అతనిలోని రాక్షసత్వం ఒళ్ళు విరుచుకుంది. నిన్ను మేము కష్టాలు పెడుతున్నామనా దేవుడికి చెప్పుకుంటున్నావు. ఏదీ వచ్చి రక్షించమను అంటూ జుట్టుపట్టి... -

హఠాత్తుగా ఆవిడ ఆపేసింది.

"చె..చెప్పండి" ఏం జరిగింది ఆ తరువాత ఆతృతగా అడిగింది మౌనిక.

ఆవిడకి ఎలాగో అనిపించింది. ఇన్నేళ్ళ తరువాత తనెందుకు పాత విషయాలు గుర్తుచేసుకుంటోందో ఆవిడకే అర్థం కాలేదు. "ఎవరీ మౌనిక? " ఈమె అడగగానే తనెందుకు గుండె పొరల్లో పాతేసిన జ్ఞాపకాలు తవ్వి బైటకు తీస్తోంది.

గతం గతః.. పీడకలలాంటి గతం గుర్తుకు తెచ్చుకుని బాధపడడం వలన ఏం ప్రయోజనం? ఎలాంటి ప్రయోజనం లేని విషయాలు తలుచుకుని బాధపడుతూ కూర్చునే మనస్తత్వం కాదు తనది. కనిపించిన దారిలో ముందుకు నడిచి వెళ్ళిపోతూ ఇవేళ ఈ గమ్యం చేరిది. అమ్మ ఇచ్చిన నిధి సంగీతం.. ఆ నిధి నిక్షేపాలతో ఇవాళ ఎంతో ఉన్నతమైన స్థానం చేరింది. ఇంత ఉన్నత స్థానంలో నిలబడి పాతేసిన గత శకలాలను ఏరుకోడంలో ఔచిత్యం ఉందా?

"చెప్పండి ఆంటీ నేనీ సస్పెన్స్ భరించలేను ఆ తరువాత ఏం జరిగింది?" ఆత్రంగా అడుగుతున్న మౌనిక వైపు చూసింది ఆవిడ.

ఎందుకీ అమ్మాయికి ఇంత ఆసక్తి తన జీవితచరిత్ర ఎందుకు రాయాలనుకుంటోంది. తన గురించి ప్రజలకి తెలియాల్సిన అవసరం ఏం ఉంది? ఎందుకు తెలియాలి?

"ఆంటీ చెప్పండి" మరోసారి అడిగింది మౌనిక.

ఆవిడ ఆలోచనలు మరోసారి వెనక్కి మళ్ళాయి.

- ఆరోజు గొంతెత్తి, గుండెల్లో గూడుకట్టుకున్న వేదన కరిగిపోయేల పాడుకోసాగింది. అతని చెవిన పడ్డాయి ఆ పాటలు. మృగంలా మారాడు.

అసలు గొంతే విప్పద్దని ఆదేశించిన వారి మాటలు లెక్కచేయకుండా అంతసేపు పాడుకోడం అతని దృష్టిలో క్షమించరాని నేరం. ఫలితంగా ఆమెకి శిక్ష వేశాడు. మామూలు శిక్ష కాదు.

జుట్టుపట్టి లాగి తిండీ, నీళ్ళు లేకుండా పెరట్లో ఉన్న వంటచెరుకు పెట్టే గదిలో పడేసాడు. ఇంట్లోకి వెళ్ళే తలుపులన్నీ మూసేసాడు.

అదృష్టవశాత్తూ ఆ గదికి తలుపులు లేవు. నెమ్మదిగా పెరట్లో చేరి ఆ చీకటి రాత్రంతా ఓ చెట్టుకింద ప్రకృతిలో లీనమై ఒంటరిగా కూర్చున్న ఆమెకి నా జీవితం ఎందుకిలా అయింది? నేనేం తప్పు చేసాను అనే ప్రశ్న మనసులో మెదిలింది. కన్నీళ్ళతో మొక్క, మొక్కనీ అడిగింది. ఆ ప్రశ్నకి సమాధానంగా బాదం చెట్టుమీద పక్షులు మా రెక్కలు చూడు స్వేచ్ఛగా ఎగరొచ్చు మేము అంటూ రెక్కలు రెపరెపలాడించాయి. కోయిల నేను ఏడాదంతా మూగబోయినా వసంతంలో మాత్రం ఎంత తీయగా, హాయిగా కూ కూ అని పాడుకుంటానో తెలుసా అంటూ కర్తవ్యాన్ని బోధించింది.

అంతే అప్పటికప్పుడే పారిపోవాలనిపించింది. ఈ చిన్న పొట్టకి కావలసిన గుప్పెడు మెతుకుల కోసం ఇంతటి అరాచకాన్ని భరించాలా? ఒక ఆడపిల్లకి తన అనేవాళ్ళు, ఒక ఇల్లు భర ఎందుకు కావాలి? ఆశ్రయం కోసమా? తలదాచుకోడానికి గూడు కోసమా? అందుకు ఈ ఇల్లే ఎందుకు? వెళ్ళిపోవాలి, వెళ్ళిపోవాలి.. కానీ, ఎలా? అవును ఎలా వెళ్ళాలి? ఈ చిన్న ఊరిలో అడుగు బైట పెట్టగానే అందరికీ తెలిసిపోతుంది. ఎవరికీ తెలియకుండా ఎలా వెళ్ళాలి? ఎక్కడికి వెళ్ళాలి? బైటకి వెళ్ళి ఎలా బతకాలి? ఏం చేయాలి? పుట్టింటికి వెళితే ఆదరించే ధైర్యం లేదు అమ్మా, నాన్నలకి సమాజం వాళ్ళని ఆడిపోసుకుంటుంది. అసహ్యించుకుంటుంది.

ఏం చేయలో తోచలేదు.

ఉషాకాంత కళ్ళు వర్షించసాగాయి. అరవై దశాబ్దాల కాలం ఎలా గడిచిందో తెలియకుండా గడిచిపోయింది.

"ఆంటీ" ఆందోళనగా పిలుస్తూ కుర్చీలోంచి లేచి ఆవిడ కాళ్ళ దగ్గర కింద కూర్చుంది మౌనిక.

"ఆంటీ ప్లీజ్ బాధపడకండి. అనవసరంగా మీరు మర్చిపోయిన గతం కెలికి మిమ్మల్ని బాధపెడుతున్నాను. నన్ను క్షమించండి."

ఆవిడ మాట్లాడలేదు.

మౌనికకి కూడా దుఃఖం పొంగుకొచ్చింది.

ఆవిడ చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ అంది "నా జీవితంలాంటి జీవితం నా శత్రువుకి కూడా ఉండద్దని ప్రతిరోజూ భగవంతుడిని కోరుకుంటూ ఉంటాను. అమ్మా, నాన్న నాకు పెళ్ళిచేయకపోయినా బాగుండేది. పెళ్ళి చేసుకుని నరకంలో పడ్డాను, పిల్లలు పుట్టకపోవడం నా నేరమా! కానే కాదు. నాకే శిక్ష.. సంగీతం పాడడం నేరమా? కానేకాదు. అయినా అందుకూ శిక్షే.

నా వయసెంత? నా శారీరక బలమెంత?

అలాంటి నా చేత ఎంత చాకిరీ చేయించారో తెలుసా? తల్చుకుంటే నా గుండె పగిలిపోతుంది. నా లేత చేతులతో రాగానికి లయబద్ధంగా తాళం వేయడమే తెలుసు నాకు. అమ్మ నా చేత ఎన్నడూ ఒక్కపనికూడా చేయించలేదు. కానీ, అక్కడ రాక్షసిలా పనిచేసాను. అయినా నా మీద ప్రేమ సంగతి పక్కన పెడితే కనీసం జాలికూడా ఉండేది కాదు వాళ్ళకి."

"మీరక్కడనుంచి ఎలా బైటపడ్డారాంటీ?" వణుకుతున్న స్వరంతో అడిగింది మౌనిక.

ఆవిడ విషాదంగా నవ్వింది.

ఆవిడ కళ్ళముందు యాభై ఏళ్ళనాటి ఆ సన్నివేశం స్పష్టంగా కనిపించసాగింది.

**ఆమె అలా దీనంగా** కూర్చుని వుండగానే సూర్యాస్తమయం అయింది.

పక్షులన్నీ గూళ్ళు చేరాయి. పశువులన్నీ వాటి స్థానాల్లోకి వెళ్ళిపోయాయి.

సమస్త ప్రకృతీ ఏ ఆధారము లేక, ఏ ఆశ్రయమూ లేక నిరాశ్రయురాలై, దీనంగా కూర్చున్న ఉషాకాంతను జాలిగా చుస్తూ నిద్రావస్థలోకి జారిపోయింది.

హఠాత్తుగా పెరటివైపు తలుపు చప్పుడైంది.

ఉషాకాంత ఉలిక్కిపడి గబ, గబా తిరిగి వంట చెరకున్న గదిలోకి వెళ్ళిపోయి ఓ మూల ఒదిగి కూర్చుంది.

"నిద్రపోయినట్టుందమ్మా"

"చావనీ"

రెండే స్వరాలు ఒకటి భర్తది రెండు అత్తగారు.

తిరిగి పెరటివైపు తలుపు మూసిన శబ్దం.

తనని లోపలికి రమ్మంటారనుకుంది. తిట్టినా, కొట్టినా ఇంట్లోనే ఓ మూల వుండనిస్తారని ఆశపడ్డది. ఆమె ఆశ నిరాశ అయిపోయింది.

వాళ్ళు కఠినాత్ములు. గుండెల్ని తన్నుకుంటూ వచ్చింది దుఃఖం.

ఉషాకాంత ఏడ్చి, ఏడ్చి దాదాపు సొమ్మసిల్లిపోయింది.

ఉదయం నుంచీ తిండిలేదు. నీళ్ళు లేవు. నీరసం, ఆకలి, దాహం దరిదాపులో ఏ సడీలేదు. అందరూ లోపలెక్కడో తలుపులు బిగదీసుకుని పడుకున్నారు.

బైట చీకటి దట్టంగా అలుముకుంది. వంట చెరకు నిండిన ఆ గదిలో ఎలుకలు స్వేచ్ఛగా తిరుగుతున్నాయి.

పదహారేళ్ళ లేత ప్రాయం. కష్టాలకి, కన్నీళ్ళకి నెలవైపోయింది.

గొంతు విప్పి పాడుకున్నందుకు కఠినమైన శిక్షకు గురైన ఆ స్వరంలోంచి పాటకాదు కదా చిన్న శబ్ధంకూడా రావడం లేదు. నీరసంతో తూలిపోతోంది.

పెరటిగోడ అవతల ఖాళీ స్థలం అంతా బహిర్భూమికి వాడుకుంటారు ఆ ఊరివాళ్ళు. అక్కడినుంచి దుర్గంధం వ్యాపించింది. ముక్కు బద్ధలైపోతోంది. పెద్ద పెద్ద చెట్లు చీకట్లో దయ్యాల్లా ఊగుతున్నాయి గాలికి.

తనేం తప్పుచేసిందో ఆ చిన్నారి బుర్రకి ఎంత ఆలోచించినా తట్టడంలేదు. పాడుకోడం తప్పా?

తనేమీ పిచ్చిపాటలు పాడలేదే? దేవుడి పాటలు పాడుకుంది. దైవనామస్మరణ చేసుకునే స్వాతంత్ర్యం కూడా లేదా తనకి? అయ్యో దేవుడా నాకెందుకీ శిక్ష? వెక్కి వెక్కి ఏడ్చింది.

ఎంత ఏడ్చినా ఆమె వేదనని అర్థం చేసుకునేవాళ్ళు లేరు. ఆమెని రక్షించేవాళ్ళు లేరు.

ఉషాకాంతలో అప్పటిదాకా ఉన్న భయం, దుఃఖం స్థానంలో ఏదో తెగింపు రెక్కలు విప్పుకోసాగింది.

నేనేం తప్పు చేసాను? అవును ఏం చేసాను?

ఆలోచించింది. వెళ్ళిపోవాలి ఈ ఇంట్లోంచి వెళ్ళిపోవాలి. ఇంక ఈ రాక్షసుల మధ్య వుండకూడదు. అమ్మ దగ్గరకు వెళ్ళిపోవాలి. అమం గుండెల్లో ఓదార్పు పొందాలి. అమ్మతో కలిసి గొంతెత్తి పాడాలి. అవును పాడాలి. పాడుకోవాలి. పాడుతునే వుండాలి.

నెమ్మదిగా ఆమెలో ధైర్యం, సాహసం చోటు చేసుకున్నాయి. కూర్చున్న దగ్గరనుంచి లేవబోయింది.

కళ్ళు తిరిగినట్లైంది.

కొన్నిక్షణాలు అలాగే కూలబడిపోయింది.

నెమ్మదిగా తన్ని తాను నిగ్రహించుకుంటూ మోకాళ్ళ మీద పాకుతూ గుమ్మం దగ్గరకు వచ్చింది. అలాగే పెరట్లోకి వచ్చి నూతి గట్టుమీద కూర్చుంది.

నూతిలో దూకేస్తే. గోడమీద నుంచి అవతల ఖాళీస్థలంలోకి దూకితే పెద్ద గొయ్యి వుంది. ప్రజలు ఆ గొయ్యినే బహిర్భూమికి వాడుకుంటారు. అందులో పడితే తిరిగి లేవడం జరగదు. కానీ, కానీ ఛీ ఉషాకంతకి ఆ ఆలోచనకే వాంతి వచ్చినట్టు అయింది.

అవును ఎందుకు చావాలి? ఓ ప్రశ్న బాణంలా వచ్చింది.

ఎందుకు చావాలి? వాళ్ళు నిరాదరించినంత మాత్రాన బతకలేదా? వాళ్ళ ఆశ్రయం కోసమే వాళ్ళ దారుణాలన్నీ భరించాలా? ఎందుకు? తిండికోసమా? బతకడం కోసమా? ఈ చిన్నిపొట్టకి కావలసిన గుప్పెడు మెతుకుల కోసం ఇంతటి అరాచకాన్ని భరించాలా? ఒక ఆడపిల్లకి తన అనేవాళ్ళు, ఒక ఇల్లు భర్త ఎందుకు కావాలి? ఆశ్రయం కోసమా? తలదాచుకోడానికి గూడుకోసమా? అందుకు ఈ ఇల్లే ఎందుకు? వెళ్ళిపోవాలి, వెళ్ళిపోవాలి. కానీ, ఎలా? అవును ఎలా వెళ్ళాలి? ఈ చిన్న వూరిలో అడుగు బైటపెట్టగానే అందరికీ తెలిసిపోతుంది. ఎవరికీ తెలియకుండా ఎలా వెళ్ళాలి? ఎక్కడికి వెళ్ళాలి? బైటకి వెళ్ళి ఎలా బతకాలి? ఎక్కడికి వెళ్ళాలి? ఏం చేయాలి?

అమ్మ దగ్గరకే వెళ్ళాలి. అమ్మ దగ్గరకు అంటే పుట్టింటికి. అత్తింట్లో కష్టం వచ్చిందని పుట్టింటికి రాకూడదు. అలా వస్తే గౌరవం వుండదు. అమ్మ అన్న మాటలు చెవుల్లో మోగాయి. అవును అక్కడికి వెళితే తనని ఎవరాదరిస్తారు? ఎలా ఆదరిస్తారు? సమాజం వాళ్ళని ఆడిపోసుకుంటుంది. అసహ్యించుకుంటుంది. సమాజాన్ని ఎదిరించే ధైర్యం అమ్మా, నాన్నలకి లేదు. తను భర్తని వదిలి వెళితే వాళ్ళని సమాజం వెలేస్తుంది.

వెళ్ళకూడదు. ఎక్కడికి వెళ్ళాలి? ముందు ఇక్కడినుంచి వెళ్ళాలి? ఈ చీకట్లోనే వెళ్ళాలి. ఇప్పుడే మంచి సమయం. వీధి గేటు తాళం వేయరు. అది సరిగా గడియకూడా పడదు. వెళ్ళిపోవచ్చు.

ఒక నిర్ణయానికి వచ్చింది ఉషాకాంత. చెంగుతో కళ్ళు తుడుచుకుంది. మెడలో మంగళ సూత్రాలు తడిమి చూసుకుంది. నెమ్మదిగా లేచి నిలబడింది. ఇప్పుడా నిలబడడంలో తొట్రుపాటులేదు. స్థిరంగా దృఢంగా అడుగులు వేస్తూ వీధి గేటువైపు వచ్చింది. చెక్కగేటు. మధ్య అబద్దాలతో బిగించి తాడుతో కట్టేసారు.

ఉషాకాంత సులభంగా తాడు ముడి విప్పి గేటు తెరిచి చీకట్లోంచి వీధిలోకి నడిచింది.

అలవాటు అయిన వీధి. ఫర్వాలేదు చీకటిగా వున్నా ధైర్యంగానే నడిచింది. నెమ్మదిగా రోడ్డుమీదకు వచ్చింది. రిక్షాలోనే నిద్రలుపోతున్నారు రిక్షావాలాలు. అక్కడక్కడా గుడ్డిదీపాలు వెలుగుతున్నాయి. బతకాలన్న సంకల్పంతో నిండిన ఆమె కళ్ళే దీపాల్లా దారి చూపిస్తుంటే రైల్వే స్టేషన్ చేరింది. ఆమెకి తెలుసు అప్పుడు ఎక్కడికీ వెళ్ళే రైళ్ళు లేవు. రావు. ఒకే ఒక్క చిన్నగది. అదే వెయిటింగ్ రూమ్. అందులోకి వెళ్ళింది. నలుగురైదుగురు నేలమీద జంబుకానా పరుచుకుని పడుకున్నారు. వారిలో ఇద్దరు మగవాళ్ళు, ఒక స్త్రీ, ముగ్గురు పిల్లలు. అందరూ గాఢనిద్రలో ఉన్నారు. వాళ్ళ తలల దగ్గర సంచులు, గుడ్డల మూటలు ఒక బెడ్డింగ్. ఈ వూరు వాళ్ళు కాదు. ఎక్కడినుంచో వచ్చారు. ఎక్కడికో వెళ్తున్నారు. తెల్లవారితే కానీ, రైలు కోసం ఎదురుచూస్తూ అక్కడే నిద్రకి ఒరిగారు. ఉషాకాంత తను కూడా వెళ్ళి చీకటిగా వున్న చోట ఓ మూల నేలమీద ముడుచుకుని కూర్చుంది.

ఎంత ధైర్యంగా వుండడానికి ప్రయత్నిస్తున్నా లోలోపల నుంచి భయం జరజరపాక్కుంటూ వస్తోంది. ఏ క్షణాన ఆ రాక్షసులు వచ్చి మీద పడతారో, బలవంతంగా పెడరెక్కలు విరిచి తీసుకెళ్ళి ఆ చీకటి గదిలో పడేస్తారో అని బిక్కుబిక్కుమంటోంది ప్రాణం

కడుపులో ఆకలికి పేగులు లుంగలు చుట్టుకుపోతున్నట్టుగా అనిపిస్తోంది. నిద్రపోడానికి ప్రయత్నించినా కళ్ళు మండుతున్నాయి కానీ, కునుకుపట్టడంలేదు. టైం ఎంత అయిందో తెలియడంలేదు. ఎప్పుడు తెల్లవారుతుందో ఏదో ఒక రైలు వస్తే బాగుండు. కనీసం గూడ్సు వచ్చినా ఎలాగోలా దాక్కుని వెళ్ళిపోవచ్చు. ముందు ఈ వూరునుంచి వెళ్ళిపోతే అప్పుడు ఆలోచించవచ్చు ఏం చేయాలో, ఎలా చేయాలో.

ఆలోచనల్లోనే నెమ్మదిగా కళ్ళు మూతలు పడ్డాయి.

తిరిగి మెలుకువ వచ్చేసరికి తెల్ల తెల్లారిపోయింది. ఉషాకాంత కూర్చున్న చోటునుంచి కదిలింది. వణుకుతున్న శరీరం స్వాధీనంలోకి తెచ్చుకుని లేచి నిలబడింది. పక్కనే చిన్న కిటికీ కిటికీలోంచి ఫ్లాట్‌ఫామ్ మీదకి చూసింది. ఒకే ఒక్క ట్రాక్ ఆ ఊరి

మీదుగా వెళ్ళే రైళ్ళేగాని ఆ ఊరు నుంచి వెళ్ళే రైళ్ళు లేవు. అందుకే ప్రయాణీకులు ఎవరూ కనిపించలేదు. అక్కడక్కడా సిల్వర్ కారేజీల్లో ఇడ్లీలు, వడలు పెట్టుకుని అమ్మేవాళ్ళు, ఫ్లాస్కుల్లో కాఫీ అమ్మేవాళ్ళు తిరుగుతున్నారు.

అప్పటికే రాత్రి నిద్రపోతున్న ప్రయాణీకులు లేచి మొహాలు కడిగేసుకుని ఇడ్లీలు తెచ్చుకుని తింటున్నారు.

ఉషాకాంతకి ఆకలి గుర్తొచ్చింది. చిల్లగవ్వలేదు తన దగ్గర.

మొహం కడుక్కుని కాసిని నీళ్ళు తాగితే బాగుండు అనుకుంటూ చుట్టూ చూసింది. చాలా చిన్నగది. ఆరుగురు గుండ్రంగా కూర్చుని కింద పేపర్లు పరుచుకుని ఇడ్లీలు తింటున్నారు. ఇద్దరి చూపులు ఉషాకాంతవైపు తిరిగాయి. చెదిరిన జుట్టు, నలిగిపోయిన చీర, ఏడ్చి, ఏడ్చి వాచిన మొహం బొట్టులేదు, కాటుకలేదు మెడలో పసుపుతాడు, చేతులకి నాలుగేసి మట్టిగాజులు, చిన్నపిల్ల దీనావస్థలో ఉన్నట్టుగా తెలుస్తోంది ఆమె వాలకం.

వాళ్ళు పక్కన ఉన్నవాళ్ళకి సైగచేయడం, వాళ్ళు తలతిప్పి ఉషాకాంతవైపు చూడడం, నిమిషంలో అందరి చూపులు తనవైపు తిరగడంతో సిగ్గుతో కుంచించుకుపోయింది. కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి.

"ఎవురమ్మా నువ్వు?" ఒక మహిళ అడిగింది సానుభూతిగా చూస్తూ..

"నే...నే.." తడబడింది ఉష.

ఇంతలో హఠాత్తుగా కలకలం వినిపించింది. భయంతో వణికిపోయింది ఉష. వచ్చేసారు. వాళ్ళొచ్చేసారు. గుండె దడ, దడలాడింది.

ఆమె కళ్ళల్లో భయం, శరీరంలో వణుకు, బైట కోలాహలం అంతా గమనిస్తున్న మగవాళ్ళు గభాల్న లేచి గదిలోంచి బైటికి వెళ్ళారు.

పిల్లా, జెల్లాతో కలిసి పదిమంది ప్రయాణీకులు తట్టాబుట్టాతో వచ్చారు.

వాళ్ళిద్దరూ వెనక్కి వచ్చి వాళ్ళ ఆడవాళ్ళతో ఏదో చెప్పారు. వెంటనే ఆ ఇద్దరు ఆడవాళ్ళు లేచి ఉషాకాంత దగ్గరగా వచ్చారు.

"ఎవరమ్మా? ఏ ఊరు నీది" ఆప్యాయంగా అడిగారు.

సమాధానం రాలేదు. ఏడుపొచ్చింది. వెక్కి, వెక్కి ఏడవసాగింది.

"అయ్యో ఏం కష్టమొచ్చింది తల్లి? ఏడవబాక.. ఏడవబాక.. దా కాస్త ఎంగిలిపడు. ఇలా రా మొహం కడుక్కుందువుగాని. " అంటూ చేయి పట్టుకుని తనతో తీసికెళ్ళింది ఒక స్త్రీ. ప్లాట్‌ఫామ్ మీద ఉన్న పంపు దగ్గరకు తీసుకెళ్ళి "పళ్ళపొడి లేపోతే మాన్లె నీళ్ళతో కడుక్కో" అంటూ పంపు తిప్పింది.

ఆవిడ ఆప్యాయతకి చలించిపోతూ నోట్లో నీళ్ళుపోసుకుని నాలుగుసార్లు పుక్కిలించి ఉమ్మేసి, చన్నీళ్ళతో కళ్ళు, మొహం కడుక్కుంది. చీరచెంగుతో తుడుచుకుంటూ ఆవిడతోపాటు తిరిగి గదిలోకి వచ్చింది. వాళ్ళు తలా ఒక ఇడ్లీ వాళ్ళ ఆకుల్లోంచి తీసి మరో ఆకులో పెట్టి ఉషాకాంతకి ఇచ్చారు.

"తిను తల్లీ. ఏ వేళ తిన్నావో యావో" అంటూ ఆవిడే ఇడ్లీ ముక్క తుంచి ఉషాకాంత నోటికి అందించింది.

ఆ ఆదరణకి గుండె దుఃఖంతో నిండిపోగా అలాగే కన్నీళ్ళను దిగమింగుతూ ఎలాంటి సడి చేయకుండా నిశ్శబ్దంగా తినేసింది. ఆఖరి ముక్క తింటుండగ రైలు వస్తున్న శబ్దం వినిపించి "అమ్మో పదండి, పదండి" అంటూ అందరూ హడావుడిగా వాళ్ళ సామాన్లు పట్టుకుని ఉషాకాంతను కూడా తొందర చేసి పరుగులు పెడుతూ ప్లాట్‌ఫామ్ మీదకి వచ్చారు. రైలు వచ్చేసింది. అందరూ కనిపించిన పెట్టెలోకి ఎక్కేసారు. ఉషాకాంతకి చేయి అందించి ఎక్కడానికి సాయ చేసిందావిడ.

రైలు కదిలింది.

ఉషాకాంత గుండెనిండా గాలిపీల్చుకుది. బాగా రద్దీగా ఉంది రైలు. ఎక్కడా కూర్చోడానికి చోటులేదు.

ఇలారా పాపా అంటూ తన సీటు దగ్గర కింద కూర్చుని ఉషాకాంతని పిలిచింది ఆవిడ.

"కూర్చో.. బెంచి మీద ఎవరన్నా దిగేసాక పోదువులే నీ పేరేంటి?" అడిగింది.

"నా పేరు.. నా పేరు. ఉ.. ఉమ చెప్పింది తడబాటుగా."

"ఏమైంది అత్తారింట్లో గొడవపడ్డావా? అమ్మగారింటికి పంపించేత్తన్నారా?"

ఏం చెప్పాలో అర్థంకాక తల అటు అడ్డంగా, ఇటు నిలువుగా కాకుండా తలాడించింది.

"ఆడ కూతుళ్ళ బతుకులే ఇట్టా ఉన్నాయిలే బిడ్డా. ఏంటో లోకం. మీ నాయన కట్నం ఇయ్యలేదా?"

ఏం చెప్పాలి? కట్నం కోసమా తనని వాళ్ళు, బాధించింది. ఆ విషయం ఏం అనలేదే.. కేవలం కోడలంటే సేవకురాలు. భార్యంటే బానిస. అంతే అదే భావంతో చూసారు వాళ్ళు. అందుకే పన్నెత్తి పలకరించనివ్వలేదు. గొంతెత్తి పాడుకోనివ్వలేదు.

ఉషాకాంత మౌనం చూసి "అమ్మ వాళ్ళ ఊరెక్కడ?" అడిగిందావిడ మళ్ళీ.

ఉషాకాంత మాట్లాడలేదు.

"పోనీలే పెదనందిపాడేగా ఈ రైలెళ్ళేది. అక్కడే వుంటారా మీ అమ్మోరు.?" సమాధానంతో కూడిన ప్రశ్న.

అప్పుడూ మౌనమే.. మౌనంగా బతకడం అలవాటైపోయిందేమో మాట రావడంలేదు.

"జాగ్రత్తగా ఎల్లమ్మా నాలుగురోజులుండి అత్తారింటికెళ్ళు. లోకం మొగుడొదిలేసిన దానివని ఆడిపోసుకుంటుంది. నీ మానాన నిన్ను బతకనివ్వదు. " ఆవిడ జీవిన సత్యాలు చెబుతోంది.

అన్యమనస్కంగా వింటోంది ఉషాకాంత.

రైలు వేగంగా వెళ్తోంది. ప్రయాణీకులు కలగాపులగంగా మాట్లాడుకుంటున్నారు. పిల్లలు ఏడుస్తున్నారు. కొందరు పిల్లలు ఒకరితో ఒకరు గొడవపడుతూ కొట్టుకుంటున్నారు. రైలు ఎక్కడో ఆగింది. అది ఏం స్టేషనో. కొందరు ప్రయాణీకులు దిగుతున్నారు. ఉషాకాంత గభాల్న లేచింది. "ఇది పెదనందిపాడు కాదమ్మాయ్. " ఆవిడ స్వరం గాల్లో కలిసిపోయింది. ఉషాకాంత రైలు దిగేసింది. రైలు కదిలింది.

అక్కడే వుంటే ఆవిడ ప్రశ్నలు అలా సాగుతూనే వుంటాయి. ఒక్క ప్రశ్నకి కూడా తన దగ్గర సమాధానం లేదు.

చుట్టూ చూసింది. సిమెంటు బెంచీలు, నాలుగు ట్రాక్‌లు, ఒక క్యాంటీను ఉన్న స్టేషన్.

ఏ ఊరైతే తనకేం. ఆ ఊరినుంచి, ఆ మనుషుల నుంచి పారిపోయింది.

ఇప్పుడు తీరుబడిగా ఆలోచించి ఒక నిర్ణయానికి రావచ్చు.

దేవతలా ఆదరించి ఆవిడ తినిపించిన ఇడ్లీలు కొద్దిగా శక్తినిచ్చాయి.

సిమెంటు బెంచీమీద చల్లగా, నీడగా వున్న చోట కూర్చుంది. పల్చగా జనం అటూ, ఇటూ తిరుగుతున్నారు.

ఏంటి ఈ జీవితం? ఎటు పోతోంది. ఏం జరగబోతోంది? కళ్ళు మూసుకుని కూర్చున్న ఆమె కళ్ళనుంచి అశ్రువులు. వేదనామయంగా మారిన గుండె చీల్చుకుంటూ వచ్చిందో కీర్తన. "నిన్నెంతో వేడిన నన్నుబ్రోవ నీకేల దయరాదు రామ" అని ఒక అలౌకిక భావనతో కళ్ళు మూసుకుని పాడుతూనే వుంది. కళ్ళు తెరిచేసరికి చుట్టూ జనం తన పక్కనే చిల్లర నాణాల కుప్ప.

అవమానంతో దహించుకుపోయింది. ఆఖరికి ఇలా బతకాల్సి వచ్చిందా భగవంతుడా అమ్మ దగ్గరకు వెళితే అయిష్టంగానైనా గుప్పెడు మెతుకులు పెట్టదా? గమ్యం లేకుండా బైటకొచ్చి ఇలా బతకమని శాసిస్తున్నావా?

ఎంత కమ్మగా పాడిందో హరికథా బాగవతారిణేమో. అవును మరి ఆ కళకి ఆదరణేది? పాపం.

తలా ఒక మాట.

కన్నీటితో నిండిన కళ్ళకి మసక, మసగ్గా చిల్లర నాణాలు.

అందరూ వెళ్ళిపోయారు.

"ఏ ఊరు తల్లీ?" స్వరంలో లాలిత్యం. పలకరింపులో ఆప్యాయత.

కనురెప్పలెత్తి చూసింది. ఎర్రటి గుంటూరు జరీచీర ఆకుపచ్చ రవికె. తెలుపు నలుపుల మిశ్రమంతో ఉన్న వెంట్రుకలు వేలు ముడేసి, నుదుట రూపాయి కాసంత కుంకుమ బొట్టుతో తన వేదన ఆలకించి ప్రత్యక్షం అయిన పార్వతీదేవిలా చేతిలో గుడ్డసంచి.

"ఎక్కడికెళ్ళాలమ్మా? చాలా కష్టంలో ఉన్నట్టున్నావు. నాతో వస్తావా?"

ఆశ్చర్యంగా చూసింది.

ఆవిడ ప్రేమగా నవ్వింది. "నీ తల్లిలాంటిదాన్ని. సందేహించకు. ఆడపిల్లవి చూడచక్కనిదానివి. ఇలా ప్లాట్‌ఫామ్ మీద కన్నీళ్ళు పెడుతుంటే బాగోదు. నలుగురూ నానామాటలంటారు. పద తల్లీ. మాది ఈ ఊరే. పక్కూరులో ఆడపడుచు వుంది వెళ్ళాలని బయల్దేరా. నిన్నిలా వదిలి వెళ్ళాలనిపించడంలేదు. నా మాట విని నాతో రా లేమ్మా. ఆలోచించకు. తీసుకో ఆ డబ్బులు తీసుకో తప్పేం లేదు. అభిమానపడకు. నీ కళకు ఇచ్చిన నజరానా తీసుకో. దొంగతనం చేయలేదుగా. తీసుకో."

అవమానం, ఆవేదన ఆకలిని జయించాయి. ఆవిడ మాటలు మంత్రాల్లా అనిపిస్తుంటే అప్రయత్నంగా చిల్లరంతా చెంగులో పోసుకుని లేచింది.

ఆవిడ అందించిన చేయి అందుకుని ఆవిడని అనుసరించింది.

ఆవిడే మహాలక్ష్మమ్మగారు.

ఒక అగ్రహారం. ఎత్తు అరుగులు ఇల్లు. పసుపు పచ్చగా కళకళ్ళాడుతున్న గడపలు, చల్లగా చలివేంద్రంలా పెద్ద వసారా మధ్య నడవా ఒక పడక గది. పొడుగాటి వంటగది అవతల పెరడు. పెరట్లో ఓ మూల స్నానాల గది, మరుగుదొడ్డి. ఈశాన్యమూల బావి. బావి పక్కనే పెద్ద బాదం చెట్టు. కిందంతా బాదంకాయలు, పండిన బాదం ఆకులు రాలిపడి వున్నాయి. అవికాక, పెరటిగోడకి దగ్గరగా కొన్ని కనకాంబరాలు, చంద్రకాంతపూల మొక్కలు.

"నేను నిశ్చింతగా బతకడానికి, ఆధారం కోసం ఎవరినీ ఆశ్రయించకుండా వుండడానికి నా భర్త ఈ ఇల్లు నాకిచ్చి తను మరో భార్య దగ్గరకు వెళ్ళిపోయాడు. ఈ రోజు నుంచీ నాతోపాటు నువ్వు కూడా వుండచ్చు వెళ్ళు అదిగో అదే స్నానాలగది. లోపల బాయిలర్ వుంది. వేడినీళ్ళుంటాయి. లోపలికి వెళ్ళి స్నానం చేసిరా. అన్నట్టు నీకు వేరే బట్టల జత ఉన్నట్టులేదు. ఒక్క క్షణం ఆగు. "

ఆవిడ లోపలికి వెళ్ళింది.

వెంటనే వచ్చి ఏం జరుగుతోందో, తనెక్కడికి వచ్చిందో అర్థం కాక అయోమయంగా నిలబడిన ఉషాకాంత చేతిలో ఒక చీర జాకెట్టు, పెట్టింది. "ఇవి కట్టుకో ఆనక బజారుకెళ్ళి నీక్కావల్సిన బట్టలు కొనుక్కుందాం సరేనా? " వెళ్ళు మృదువుగా శాసించింది.

మంత్రముగ్ధురాలిలా లోపలికి నడిచింది ఉషాకాంత.

వేడి, వేడి నీళ్ళు స్నానం చేసి వచ్చేసరికి అంతకన్నా వేడిగా పొగలు కక్కుతున్న దోసకాయ పప్పు, అన్నం, నెయ్యి మాగాయ వడ్డించిన విస్తరి ఆహ్వానించింది. మారుమాట్లాడకుండా ఆవురావురుమంటూ తినేసింది.

"నీకు సంగీతం వచ్చా? " విసనకర్రతో విసురుతూ అడిగింది మహాలక్ష్మమ్మ.

"తల ఊపింది."

"ఎంతవరకు నేర్చుకున్నావు?"

అప్పుడు విప్పింది నోరు. "కీర్తనలు, వర్ణాలు"

"త్యాగయ్య కీర్తనలు పాడతావా?"

"తలూపింది."

"నాకు నేర్పుతావా?"

ఉలిక్కిపడి చూసింది.

మెత్తగా నవ్వుతోంది ఆవిడ.

తలవంచుకుంది ఉషాకాంత.

"భయపడకు నాకు కాదులే నా పిల్లలకి నేర్పు."

ప్రశ్నార్థకంగా చూసింది.

"అవును నాకు వేరే పిల్లలు లేరు. ఈ చుట్టుపక్కల పిల్లలే నా పిల్లలు, వాళ్ళకి నేను రోజూ భగవద్గీత చెప్తాను. నువ్వు సంగీతం నేర్పు.. సరేనా?"

కృతజ్ఞత, అంగీకారం రెండూ కలిసిన చూపులు.

మృదువుగా నవ్వింది మహాలక్ష్మమ్మ.

"వెళ్ళు కాసేపు విశ్రాంతి తీసుకో. అన్నీ మర్చిపో నేనున్నాను. నీకు ఈ ఇల్లు మనది."

ఉషాకాంత కళ్ళల్లో నీళ్ళు.

ఆవిడ ఆమె భుజమ్మీద చేయేసి లోపలికి నడిపించింది. పందిరి మంచం దోమతెర కట్టి వుంది. అది చూడగానే ఉషాకాంత సర్వం మరిచిపోయింది.

కొద్ది నిమిషాల్లోనే ఆమె గాఢనిద్రలోకి జారిపోయింది.

**ఉషాకాంత జీవితం** ఊహించని మలుపు తిరిగింది. అలాంటి మలుపు అనేది ఒకటుంటుందని కూడా తెలియని అమాయకురాలు. ఆ మలుపు ఉక్కిరి బిక్కిరి చేసింది.

మహాలక్ష్మిగారి ఆప్యాయతతో కూడిన పలకరింపు, చిరునవ్వుతో చూస్తూ కరుణ కురిపించే నేత్రాలు చూస్తుంటే ఇంత మంచివాళ్ళు కూడా వుంటారా అనుకుంది.

అత్తగారింట్లో ఇంటిల్లిపాదీ ధాష్టీకంతో నిత్యం చిత్రహింసలపాలవుతూ, కడుపునిండా తిండి, కంటినిండా నిద్ర కరువై కన్నీళ్ళతో బతికిన ఆ అమ్మాయికి మహాలక్ష్మమ్మగారింట్లో లభిస్తున్న ఆదరణ అద్భుతంగా అనిపించింది.

ఆవిడ ఆదరణ, ఆప్యాతల్లో మర్చిపోయింది.

అత్తగారింట్లో తెల్లవారుఝామున ఐదింటికి లేచి వీధివాకిలి వూడ్చి, పేడకళ్ళాపి చల్లి ముగ్గులేయడంతో ప్రారంభం అయే దినచర్య రాత్రి పదకొండు అయాకకానీ పూర్తయేదికాదు. పచ్చడి మెతుకులు, నీళ్ళ మజ్జిగతో రెండుపూట్లా అన్నం తిన్నాననిపించడం తప్ప కమ్మటి తిండికి నోచుకోలేదు.

ఇక్కడ రోజూ ఉదయం చిక్కటి, కమ్మటి కాఫీతో ప్రారంభమయ్యే దినచర్యలో టిఫిను, మధ్యాహ్నభోజనం, రాత్రి భోజనం ఆవిడ స్వయంగా వండి, దగ్గర కూర్చుని కొసరి, కొసరి వడ్డిస్తుంటే పెళ్ళయాక ఇలాంటి భోజనం గురించే మర్చిపోయిన ఉషాకాంత ఆవిడ ప్రేమగా పెడుతుంటే ఆవురావురుమని తినేది.

అలా తింటున్నప్పుడు అప్రయత్నంగానే కన్నీళ్ళు ఉబికి వస్తుండేవి. ఆవిడ ప్రేమగా ఆ కన్నీళ్ళు తుడేచేది కానీ ఎందుకేడుస్తున్నావని మాత్రం అడిగేదికాదు.

ఆ అమ్మాయి ప్రవర్తన, ఒద్దిక మహలక్ష్మమ్మగారికి ఆమె గురించి సమస్తం చెప్పేసాయి. ఇంక ఆమెని ఆవిడ ఏమీ అడగలేదు. అనుభవజ్ఞురాలైన మహలక్ష్మమ్మ కంటిచూపుతోటే సర్వం గ్రహించింది. ఆ ఇంట్లో ఉషాకాంతకి మహలక్ష్మి కూతురుగా స్థానం లభించింది.

ఊళ్ళోవాళ్ళ సందేహాలు, ప్రశ్నలు ముందే ఊహించిన మహలక్ష్మమ్మ ఉషాకాంత మెడలోని పసుపుతాడు తీసేసి, మంగళసూత్రాలు దాచేసింది. "తరువాత ఇవి చెడగొట్టించి సన్నగొలుసు కొనుక్కుందువుగాని ఎవరికీ నీకు పెళ్ళయిందన్న విషయం చెప్పకు. నీ గురించి నేను చెప్తాను. నువ్వు మాత్రం ఎవరికీ నీ విషయాలు చెప్పకు" అని చెప్పింది ఉషాకాంతకి.

కళ్ళు చెమ్మగిల్లుతుంటే తల వూపింది ఉషాకాంత.

నాలుగు రోజులు ఉషాకాంత బాగా విశ్రాంతి తీసుకుని, మానసికంగా, శారీరకంగా బాగా కోలుకున్నాక ఐదోరోజు సాయంత్రం నలుగురు పిల్లలు వచ్చారు. వాళ్ళని ఉషాకాంత దగ్గరకు తీసుకొచ్చి "వీళ్ళు ఇవాళ నుంచీ నీ శిష్యురాళ్ళు. వీళ్ళకి సంగీతం నేర్పించాలి" అంది మహలక్ష్మమ్మ.

ఆ పిల్లలు ముగ్గురూ పట్టు పరికిణీ వేసుకుని రెండు జడలు వేసుకుని మడిచి రిబ్బనుతో పైకి కట్టుకున్నారు. పదేళ్ళు, తొమ్మిదేళ్ళ వయసువాళ్ళు. ఉత్సాహంగా "అక్కా! మాకు సంగీతం నేర్పించవూ!? " అని అడుగుతూ చనువుగా దగ్గరకు రాగానే ఉషాకాంత కళ్ళు చెమ్మగిల్లాయి. "తప్పకుండా చెల్లాయిలూ.. " అంటూ ఆ రోజు నుంచే వాళ్ళకి సంగీతం పాఠాలు నేర్పడం ప్రారంభించింది.

స...ప...సా అంటూ ఆరోహణ, అవరోహణతో సంగీత పాఠాలు మొదలవగానే ఆవిడకూడా అక్కడే కూర్చుని ఉషాకాంత స్వరంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ ఆమె సంగీతం వింటుండేది.

రోజులు ప్రశాంతంగా గడిచిపోతున్నాయి. ఉషాకాంత ఆవిడని "అమ్మా.. " అని పిలవడం మొదలుపెట్టింది.

ఆ పిలుపుని ఆవిడ ఆనందంగా స్వీకరించింది.

ఆ ఊళ్ళో రెండు దేవాలయాలున్నాయి. ఒకటి రాములవారిది, రెండోది దుర్గాదేవిది.

రోజూ ఉదయం మహలక్ష్మమ్మగారు తప్పనిసరిగా ఉదయమే లేచి రెండు ఆలయాలు సందర్శించి వస్తుంది.

కొన్ని రోజులు చూసాక ఉషాకాంత తను కూడా ఆవిడతోపాటే లేచి తానూ ఆవిడతో కలిసి ఆలయానికి వెళ్ళడం మొదలు పెట్టింది. సరిగా హారతిచ్చే సమయానికి ఎవరూ అడక్కుండానే ఉషాకాంత అమ్మవారి మీద చక్కటి మంగళహారతులు పాడుతుండడంతో అక్కడికి వచ్చే భక్తులకి, గుడి పూజారికి ఆమె పట్ల అభిమానం ఏర్పడింది.

"ఈ అమ్మాయి ఎవరు మహాలక్ష్మమ్మా?" అనడిగాడు పూజారి ఒకరోజు.

"నాకు దేవుడిచ్చిన కూతురు స్వామి!" అంది ఆవిడ.

ఆ సమాధానంలోనే సర్వం గ్రహించిన ఆయన మరో ప్రశ్న వేయలేదు.

"అయితే మన ఊరికే దేవుడిచ్చిన ఆడపడుచు" అన్నాడు.

అప్పటినుంచీ ఊళ్ళో ఎవరింట్లో ఏ శుభకార్యం, జరిగినా ఉషాకాంత పాటలు తప్పనిసరిగా వుండేవి.

ఆమె పిల్లలకి సంగీతం నేర్పిస్తుందని తెలుసుకున్న ఇల్లాళ్ళు కొందరూ వాళ్ళ పిల్లల్ని కూడా పంపించడం మొదలుపెట్టారు.

నెలకి ఐదురూపాయల ఫీజు నిర్ణయించింది మహాలక్ష్మమ్మ.

"నీకంటూ సంపాదన ఉండాలని నీకు ఇది ఒక ఉపాధిగా మారాలని ఇలా ఏర్పాటు చేసాను ఉషా.. అంతేకానీ, నీకు నేను భోజనం పెట్టలేక కాదు" అంది ఒకరోజు ఆవిడ.

ఆవిడ ఔదార్యానికి, విచక్షణకి ముగ్ధురాలైపోయింది ఉషాకాంత.

అవును నా కాళ్ళ మీద నేను నిలబడాలి అనుకుంది.

అందుకు తన దగ్గర ఉన్న విద్య సంగీతం.. నమ్ముకున్నా, అమ్ముకున్నా ఇదే నా జీవనాధారం అనుకుంది.

అప్పటినుంచీ మరింత శ్రద్ధగా పిల్లలకి పాఠాలు చెప్పడం మొదలుపెట్టింది.

త్వరలోనే నలుగురు పిల్లలతో ప్రారంభమైన ఆ శిక్షణ నలభైమందికి చేరింది.

అంతమందికి ఇంట్లో స్థలం సరిపోకపోవడంతో పూజారిగారి అనుమతి, ఆయన సహకారంతో దేవాలయంలో శిక్షణా తరగతులు మొదలుపెట్టించింది మహలక్ష్మమ్మ.

ఇప్పుడు పిల్లలతో పాటు ఉత్సాహం ఉన్న కొందరు యువతులు కూడా శిక్షణ కోసం ఉషాకాంత దగ్గరకు రాసాగారు.

నెలకి ఆమె సంపాదన ఇప్పుడు మూడు వందలు దాటుతోంది..

ఒకే ఒక బ్యాంకు ఉంది ఆ ఊళ్ళో.. చిన్న బ్రాంచి స్టేట్ బ్యాంక్ వారిది.

ఆ బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడి ఉషాకాంత పేరుమీద అకౌంట్ ఓపెన్ చేయించి ప్రతినెలా వచ్చిన డబ్బుల్లో ఓ పాతిక రూపాయలు ఉషాకాంత ఖర్చులకోసం ఆమెకిచ్చి మిగతా డబ్బు బ్యాంకులో వేసేది ఆవిడ.

నెమ్మదిగా ఉషాకాంతకి స్కూలు టీచర్ మరియమ్మ ద్వారా ఇంగ్లీషు నేర్పించింది.

ఇప్పుడు ఉషాకాంతలో ఎంతో ఆత్మవిశ్వాసం, మరెంతో ధైర్యం కలిగాయి.

గతం పూర్తిగా మర్చిపోయింది. ఎప్పుడన్నా గుర్తువచ్చినా అదో పీడకల అని చన్నీళ్ళతో మొహం కడిగేసుకుని తిరిగి వచ్చి వర్తమానంలోకి పడిపోతుంది.

కొంతకాలం తనకోసం ఎవరన్నా వెతుక్కుంటూ వస్తారేమో అని భయపడుతూ ఇంట్లోంచి ఎక్కడికి వెళ్ళడానికి ఇష్టపడేదికాదు.. మహలక్ష్మమ్మగారితో గుడికి వెళ్ళి రావడం తప్ప ఇంకెక్కడికీ వెళ్ళేదికాదు.

చుట్టుపక్కలవాళ్ళు పేరంటాలకి పిలిచినా ఒక్కతీ వెళ్ళడానికి భయపడుతుండేది.

ఇప్పుడు ఊరంతా హాయిగా తిరిగేస్తోంది.

తన శిష్యురాళ్ళతో కలిసి అప్పుడప్పుడూ ఊళ్ళో ఉన్న రెండు సినిమాహాళ్ళలో వచ్చిన సినిమా లు చూడడానికి వెళ్తుంది.

తన దగ్గర దాచిన డబ్బుల్లోంచి పదిరూపాయలు పెట్టి మహలక్ష్మమ్మగారికి చీర కొనుక్కుని వచ్చింది ఒకరోజు.

"నాకెందుకమ్మా? నీకేదన్నా కొనుక్కోకపోయావా?" అందావిడ ఆప్యాయంగా.

"అమ్మకి కొన్నాక నేను కొనుక్కుంటాను. చీర బాగుందామ్మా?" అడిగింది.

ఆవిడ చిరునవ్వు నవ్వి "నువ్వు ప్రేమతో కొన్న చీర బాగుండదూ!? చక్కగా వుంది" అంది.

కానీ, ఆవిడకి అర్థమైంది "ఈ పిల్లకి ఏమీ తెలియదు అన్న విషయం. చాలా ముతకచీర కేవలం రంగు చూసికొంది కానీ, ఆ అమ్మాయికి బట్టలు కొనుక్కోడం, తనకి కావలసినవేవీ కూడా స్వంతంగా కొనుక్కునే తెలివి, చాకచక్యంలేదని తెలుసుకుంది."

మర్నాడు తనే స్వయంగా వెంటపెట్టుకుని వెళ్ళి ఉషాకాంతకి మంచి నైలెక్స్ చీరలు కొంచి ఆవిడ.

"ఇలాంటి చీరలు కట్టుకోవచ్చా?" అమాయకంగా అడిగింది ఉషాకాంత.

"ఎందుకు కట్టుకోకూడదు? నువ్వు చిన్నపిల్లవు ఇలాంటివే కట్టుకోవాలి" అందావిడ.

అలాగే పౌడర్, స్నో, కాటుక, బొట్టు బిళ్ళలు, గాజులు, జడగంటలు, పాదాలకు వెండి పట్టీలు కొంది.

ఉషాకాంత మెడలోంచి తీసి దాచేసిన మంగళసూత్రాలు చెడగొట్టించి సన్నటి గొలుసు చేయించి, దానికి ఒక లక్ష్మీదేవి పతకం చేయించింది.

ఇప్పుడు ఈ ఉష పాత ఉష కాదు. అందంగా, నాజూగ్గా, లక్ష్మీదేవి కళనీ, సరస్వతీదేవి స్వరాన్ని అందిపుచ్చుకున్న అమ్మవారు.

అయితే ఎంత ప్రేమగా చూసినా, ఎంత అభిమానించినా, సహజమైన కుతూహలాన్ని ఎవరూ ఆపుకోలేరు. ఒకరోజు పక్కింటి కామేశ్వరి, విశాలాక్షి వచ్చారు మహలక్ష్మమ్మ దగ్గరకి.

ఆ సమయంలో ఉషాకాంత తన శిష్యురాళ్ళతో కలిసి చెరువుగట్టుకి షికారెళ్ళింది.

"ఏం చేస్తున్నావు పిన్నీ? ఉష లేదా? " అంటూ వచ్చారిద్దరూ.

"రండర్రా " అంటూ చాపపరిచి ఆహ్వానించింది ఆవిడ.

"ఉష లేదా? " మరోసారి రెట్టించి అడిగారు ఇద్దరు.

లేదు చెరువుగట్టుకి షికారెళ్ళింది చెప్పిందావిడ.

ఆడపిల్లనలా ఒంటరిగా ఎందుకు పంపించావు పిన్ని అంది విశాలాక్షి.

"ఒక్కతీ వెళ్ళలేదులే. కూడా శిష్యురాళ్ళు ఉన్నారు."

ఆ వాళ్ళేం నాపసానులా ఏంటి? వాళ్ళు కుర్రపిల్లలే. ఆడపిల్లలని అలా చెరువుగట్టుకి, పొలాలవైపు పంపిస్తే ప్రమాదం కదూ.

"ప్రమాదం ఏం ఉంది కామేశ్వరీ!? వాళ్ళకి ఊరు తెలుసు. ఊరుకి వాళ్ళు తెలుసు. ఎవరూ ఎవరికీ కొత్తకాదుగా అయినా అస్తమానం ఇంట్లో వుండి ఏం చేస్తుంది కాస్త సేపు అలా చల్లగాలి పీల్చుకుని వస్తారు."

"ఏమో నీకు చాలా ధైర్యంలే. ఇంతకీ ఆ అమ్మాయిది ఏ ఊరు? తల్లి, తండ్రి లేరా?" ఆరాగా అడిగింది విశాలాక్షి.

మహలక్ష్మమ్మ నింపాదిగా చెప్పింది "ఎవరూ లేరు దానికి. మా మేనత్తకి దూరపు చుట్టాల పిల్ల. తల్లి, తండ్రి ఎవరూ లేరు. కొన్నాళ్ళు మా మేనత్త సాకింది. ఆవిడా పెద్దదైపోయి చేతకాక నా దగ్గరకు పంపించింది."

"అలాగా! అయితే మీ మేనత్తే దానికి సంగీతం అదీ నేర్పించిందా?"

"అంతేగా ఆడపిల్లని చదువు పేరుతో దూరంగా పంపడం ఇష్టంలేకా, చూసే మగదిక్కులేకా, ఉన్న ఊళ్ళోనే ఒక విద్వాంసురాలి దగ్గర సంగీతం నేర్పించింది. చక్కగా కీర్తనలు, వర్ణాలు నేర్చుకుంది కూర్చోండి కాఫీ తెస్తాను" అంటూ వాళ్ళు మరో ప్రశ్న వేసే అవకాశం ఇవ్వకుండా లేచి వంటగదిలోకి వెళ్ళిపోయిందావిడ.

ఇద్దరూ భుజాలు ఎగరేస్తూ ఒకరినొకరు చూసుకున్నారు.

కామేశ్వరి కూడా లేచి ఆవిడ వెనకాలే వెళ్ళి "అయితే మరి పిల్లకి ఇరవై ఏళ్ళు వచ్చినట్టుగా అనిపిస్తోంది పెళ్ళి మాట ఏం చేస్తున్నావు?" అడిగింది.

మహలక్ష్మమ్మ ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

అవును నిజమే సుమా ఉషాకాంతకి పెళ్ళిచేయాలి. ఈ ప్రశ్న వస్తుందన్న ఆలోచనే తనకి రాలేదెంచేత? ఇంట్లో వయసొచ్చిన ఆడపిల్ల వుంటే ఈ ప్రశ్న తప్పకుండా వస్తుంది. అందులోనూ ఇది పల్లెటూరు. అబద్ధాలు చెప్పి ఎంతోకాలం కాపాడలేదు తను. వయసు వచ్చిన పిల్ల ఊళ్ళో తిరుగుతుంటే అందరి కళ్ళు దానిమీదే వుంటాయి.

"ఏంటి పిన్నీ ఆలోచిస్తున్నావు?" మొహంలోకి తొంగిచూస్తూ అడిగింది కామేశ్వరి.

"అవునవును చేయాలిగా కామేశ్వరీ. చూడు ఏదన్నా మంచి సంబంధం నీ ఎరికిలో వుంటే చెప్పు." అంది కాఫీ గ్లాసు అందిస్తూ.

"ఎంతమాట పిన్నీ. నా చిన్నతమ్ముడు గోవిందం వున్నాడు. వాడికెలాగూ ఈ వేసవిలో పెళ్ళిచేయాలనుకుంటోంది మా అమ్మ. పిల్లకి ఈడూ, జోడూనూ అంది" ఆవిడ చేతిలోంచి తనూ గ్లాసు అందుకుంటూ విశాలాక్షి.

"మా పిన్ని కొడుకు కూడా వున్నాడు. బి.ఏ పాసై ఈ మధ్యే పంచాయితీ ఆఫీసులో గుమాస్తాగా ఉద్యోగంలో చేరాడు. కుర్రాడు చక్కగా వుంటాడు" అంది కామేశ్వరి.

"అలాగే మాట్లాడండి మరి. దానికి ఎవరితో రాసి పెట్టి వుందో అంది" మహలక్ష్మి.

"అవును పిన్నీ ఆ అమ్మాయి కనీసం ఎలిమెంటరీ చదువు అయినా చదువుకుందా? "

"చదువుకోకేం మొగుడికి ఉత్తరాలు రాయగలదు. మొగుడు రాసిన ఉత్తరాలు చదవగలదు. అయినా చక్కగా పుస్తకం చూస్తూ వర్ణాలు పాడే పిల్లకి చదువురాకపోడం ఏంటి? ఈ మధ్యన ఇంగ్లీషు కూడా చదువుకుంటోంది."

"ఆ, ఇంగిలీసెందుకులే ఉద్యోగం చేయాలా? పాడా."

"ఆ సంగీతం పాఠాలేవో చెబుతుందిగా ఇంక ఉద్యోగం దేనికి? "

మరికాసేపు ఉష గురించే అవీ, ఇవీ మాట్లాడి ఇద్దరూ వెళ్ళిపోతూ త్వరలో పెళ్ళిచూపులు ఏర్పాటు చేస్తామని చెప్పి వెళ్ళారు.

వాళ్ళు వెళ్ళిపోయాక మహాలక్ష్మమ్మ కూర్చున్న చోటే నిస్తేజంగా కూర్చుండిపోయింది.

ఆవిడ మెదడు నిండా ఉష పెళ్ళి గురించిన ఆలోచన నిండిపోయి బరువెక్కింది.

ఉష పెళ్ళిచేయాలా? ఎలా? ఆమె వివాహిత. పిల్లలున్నారో, లేదో తెలియదు. భర్తనుంచి పారిపోయి వచ్చిందో, భర్తే వెళ్ళగొట్టాడో. ఎందుకు పారిపోయి వచ్చిందో తనేమీ వివరాలు అడగలేదు.

అతనెక్కడ వుంటాడో, ఈమెని ఆవేశంలోనో, ఉద్రేకంలోనో వెళ్ళగొట్టినా, వెతక్కుండా వుంటాడా?

ఈమె క్షణికోద్రేకంలో ఇంతదూరం వచ్చి, ఇక్కడే ఇలాగే వుండిపోతుందా? భర్త దగ్గరకు వెళ్ళదా?

క్షణికోద్రేకం అయితే అదే ఊళ్ళో ఏ గుళ్ళోనో తలదాచుకుని, తిరిగి వెళ్ళిపోయేది, లేదూ పుట్టింటికి వెళ్ళి కష్టాలు చెప్పుకునేది. ఎటూ కాకుండా ఇంతదూరం ఎందుకు వచ్చింది?

తను ఆమె వివరాలేమీ అడక్కుండా తప్పు చేసింది.

ఇవాళ ఆమె గురించిన వివరాలు సేకరించాలి.

ఈమె భవిష్యత్తు ఏంటి? ఎలా బతుకుతుంది? సంగీతం పాఠాలు చెప్పుకుంటే కొంత ఆర్థికస్వాతంత్ర్యం వుంటుందని తను ఆలోచించిందే కానీ, ఆడపిల్ల ఒంటరిగా ఎలా బతుకుతుంది? తనెంతకాలం ఆమెకి అండగా వుండగలదు.

పరిపరి విధాలుగా ఆలోచిస్తున్న మహాలక్ష్మమ్మ "అమ్మా" అంటూ లోపలికి వచ్చిన ఉషాకాంత అలికిడికి ఆలోచననుంచి తెప్పరిల్లింది.

"అమ్మా ఏంటి దీపం వెలిగించలేదు. చీకట్లో కూర్చున్నావేంటి?" లాంతరు వెలిగించి తీసుకొచ్చింది ఉష.

"ఏదో ఆలోచిస్తూ కుర్చున్నానమ్మా ఏరీ చెల్లాయిలంతా వెళ్ళిపోయారా?"

"అవునమ్మా చదువుకోవాలి అంటూ వెళ్ళిపోయారు. అమ్మా మరి మేమంతా చెరువుగట్టున కూర్చుని ఎన్ని పాటలు పాడుకున్నామో తెలుసా? ఎంత హాయిగా అనిపించిందో కళ్ళల్లో మెరుపులు కురిపిస్తూ" అంది ఉష.

"అలాగా మంచి పని చేసారు. ఆ, చూడు ఉషా నేను వంట చేస్తాను నువ్వు వాకిట్లో కళ్ళాపి చల్లి ముగ్గుపెట్టమ్మా" అంది ఆవిడ కూర్చున్న దగ్గరనుంచి లేస్తు.

"అలాగేనమ్మా" ఉష హుషారుగా పరిగెత్తింది.

ఇవాళ ఈ పిల్లతో మాట్లాడాలి. ఈమె కథ ఏంటో తెలుసుకోవాలి. ఆమె వెళ్ళిన వైపు చూస్తూ అనుకుంది మహాలక్ష్మమ్మ.

ఉషాకాంత కూనిరాగాలు తీస్తూ వాకిట్లో కళ్ళాపి చల్లి, మెలికలు తిప్పుతూ చక్కటి ముగ్గేసింది. వేసవికాలం అవడం వలన నీళ్ళు పడగానే తడిసిన మట్టి పరిమళాలు వెదజల్లింది. ఆ పరిమళాలు ఆఘ్రాణిస్తూ అంతే హుషారుగా పెరట్లోకి వెళ్ళిపోయి చల్లటి నీళ్ళు స్నానం చేసింది.

తెల్లని వాయిల్ చీర కట్టుకుని జడల్లుకుని మళ్ళీ పెరట్లోకి వెళ్ళి వెన్నెల వెలుగులో విచ్చుకున్న జాజులు కోసి, మాలకట్టింది. పొడుగాటి ఆ మాల సగానికి తెంపి తీసుకెళ్ళి సరస్వతీదేవి విగ్రహానికి వేసింది. మిగతా సగంలో చిన్న ముక్కతుంచి మహలక్ష్మమ్మగారికి పక్కన పెట్టి మిగతాది తను జడలో తురుముకుంది.

వసారాలో ఇనుప చువ్వల కిటికీమీద కూర్చుంది.

మహలక్ష్మమ్మ అన్నం వండి, బంగాళాదుంప వేయించి, చారుపెట్టింది. ఆవిడ కూడా స్నానం చేసి ఉషాకాంత కూర్చున్న దగ్గరకు వచ్చింది.

ఆవిడ్ని చూడగానే చెంగున కిటికీ దిగి వెళ్ళి పూలు తీసుకొచ్చి ఆవిడ ముడిలో అలంకరించింది.

భర్త తనని వదిలి వెళ్ళిపోయినా ఆవిడ ఆ బాధ ఎప్పుడూ మొహంలో కనిపించనీయకుండా అర్ధరూపాయంత కుంకుమ బొట్టు, కళ్ళనిండా కాటుకతో కళకళ్ళాడుతూ వుంటుంది.

"అమ్మా.. ఒక మాట అడగనా?" నెమ్మదిగా అడిగింది ఉష.

"ఏంటమ్మా చిరునవ్వుతో అంది ఆవిడ."

"మరి, మరి నాన్న ఎక్కడమ్మా?"

ఆవిడ నవ్వింది. "నాన్నకి నేను నచ్చలేదు తల్లీ. అందుకే మరో భార్య దగ్గరే వుంటారు. వస్తారులే ఎప్పుడో ఆయన బుద్ధి తిరిగినప్పుడు."

"నీకన్నా అందంగా వుంటుందా ఆవిడ?"

ఆవిడ నవ్వింది. "నాన్నకు నచ్చిందిగా"

"ఏమో" బుంగమూతి పెట్టింది ఉష

"పద త్వరగా భోజనాలు చేసి డాబామీద పడుకుందాం. అక్కడ చెప్పుకోవచ్చు కబుర్లు" అందావిడ.

"అలాగే" నాకూ బాగా ఆకలేస్తోంది అంది ఉష.

ఇద్దరూ అక్కడ్నించి లేచి వంట గదిలోకి వెళ్ళారు.

కబుర్లు చెప్పుకుంటూ కమ్మటి భోజనం ముగించాక ఉష వంటగది కడిగేసింది.

మహాలక్ష్మమ్మ పక్కబట్టలు తీసుకుని డాబా మీదకు వెళ్ళింది.

తదియ చంద్రుడు పల్చటి వెలుగులు విరజిమ్ముతున్నాడు. పారిజాతాలు, సన్నజాజులు మిళితమైన పరిమళం గాలిలో వలయాలుగా తిరుగుతోంది. చల్లగాలి వీస్తోంది. పిట్టగోడ దగ్గర నిలబడి ప్రకృతిని చూడసాగింది ఉష. దూరంగా విశాలంగా వున్న పచ్చిక మైదానాలు దట్టంగా వున్న చెట్లు అక్కడక్కడా లైటు వెలుగుతున్న డాబా ఇళ్ళు.

"దా.. ఉషా" మహాలక్ష్మమ్మగారి పిలుపుతో అక్కడినుంచి కదిలి ఆవిడ దగ్గరగా వెళ్ళింది.

"కూర్చోమ్మా" పరిచిన పక్క మీద ఆవిడకి కొంచెం ఎడంగా కూర్చుంది.

ఆవిడ ఉషవైపు పరీక్షగా చూసింది. వదులుగా వేసుకున్న జడలోంచి కొన్నిపాయలు గాలికి చెదిరి మొహం మీద పడుతున్నాయి. పల్చటి చెక్కిళ్ళు వెన్నెల్లో తళ, తళలాడుతున్నాయి. సన్నటి నడుం, చక్కగా, చందనం బొమ్మలా వుంది.

"ఉషా!" ఆవిడ పిలుపులో కొత్తదనం ఉలిక్కిపడి చూసింది ఉష.

"నిన్ను నేను ఎప్పుడూ అడగలేదు ఇవాళ అడుగుతున్నాను. నీ కథ ఏంటమ్మా? ఎందుకు ఇల్లు వదిలి వచ్చావు?"

ఉషాకాంత ఉలిక్కిపడింది. ఊహించని ప్రశ్న. తనిక్కడికి వచ్చిన నాలుగు నెలల తరవాత ఎందుకు?

ఎందుకొచ్చింది ఆవిడకీ సందేహం?

"చెప్పమ్మా నీ భవిష్యత్తు నిర్ణయించాలంటే నాకు నీ గురించి కొన్ని విషయాలు తెలియాలి."

"నా భవిష్యత్తా?" అంటే వణికిపోతూ అడిగింది ఉష.

"అంటే ఏంటి తల్లి? నిండా ఇరవై ఏళ్ళులేని నువ్వు ఎంతకాలం ఇలా వుంటావు? నీకు పెళ్ళి చేయాలనుకుంటున్నాను. నేనొక నిర్ణయం తీసుకునే ముందు నీ గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత నామీద వుందికదా."

"పెళ్ళా.. అదిరిపడుతూ అంది ఉషాకాంత. నాకు పెళ్ళేంటి? మీరు, మీరు ఎందుకు ఈ విషయం ఆలోచిస్తున్నారు?"

"ఆలోచించక? నేను ఆలోచించకపోయినా ఈ ఊరు ఆలోచిస్తుంది. నువ్వున్నది పల్లెటూళ్ళో. వద్దన్నా అనుక్షణం కొన్ని జతల కళ్ళు నిన్ను పహరా కాస్తుంటాయి. నీ నడకనీ, నడతనీ గమనిస్తూ వుంటాయి. నీ గురించి ఎన్నో ప్రశ్నలు నామీద సంధిస్తుంటాయి. అవన్నిటికీ నేను సమాధానం చెప్పాలంటే నాకు నీ గురించి తెలియాలిగా. చెప్పు. ఏంటి నీ కథ?"

హఠాత్తుగా ఉషాకాంత రెండు చేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

ఆవిడ నిశ్చేష్టురాలై చూడసాగింది.

**"ఏడవకు ఉషా జరిగిందేదో జరిగింది**. ఏడిస్తే సాధించేదేం లేదు. ధైర్యంగా ఇంట్లోనుంచి వచ్చేసినదానివి ధైర్యంగానే వుండాలి. నువ్వు మనసు విప్పి చెపితే నేనేమన్నా చేయగలనేమో ప్రయత్నిస్తాను" మృదువుగా, ఓ తల్లిలా ఓదార్పు స్వరంతో మాట్లాడుతోంది మహాలక్ష్మి.

కన్నీళ్ళు నిండిన కళ్ళతో ఆవిడ వైపు జాలిగా చూసింది ఉషాకాంత.

"చెప్పు తల్లీ నువ్వు ఏ పరిస్థితుల్లో ఇంటి నుంచి బైటకి వచ్చేసావో, ఎందుకు వచ్చావో ఏం జరిగిందో చెప్పు. క్షణికావేశంలో వచ్చావా? చిన్న విషయానికి అలిగి వచ్చావా? ఇవన్నీ నేను అడగలేదు. అడగను కూడా. ఎందుకంటే నిన్ను చూసిన మొదటి క్షణంలోనే నువ్విలా వచ్చే మనిషివి కావని, ఏదో బలీయమైన కారణం వుంటే తప్ప ఇల్లు వదిలి గమ్యం తెలియకుండా రావనే అనుకున్నాను."

ఆవిడ మరోసారి అడగడంతో నెమ్మదిగా దుఃఖం నుంచి తేరుకుని, కళ్ళు తుడుచుకుంది ఉష,

ఆవిడ వైపు ఓసారి చూసి చూపులు తిప్పుకుని నేలచూపులు చూస్తూ జరిగిందంతా ఓసారి సింహావలోకనం చేసుకుంటున్నదానిలా కొన్ని క్షణాలు మౌనంగా వుండి చెప్పసాగింది.

"నేను చేసిన తప్పేంటో నాకు తెలియదమ్మా. అందరిలాగే నాకు అమ్మ పెళ్ళి చేసింది. కాపురానికి పంపించింది. అమ్మకి సంగీతం అంటే ప్రాణం. అక్కలకి అంతగా ఆసక్తిలేదు. నాకు అమ్మ అభిరుచి వచ్చింది నాకూ సంగీతమంటే ఆసక్తి ఏర్పడింది. అమ్మ దగ్గర శ్రద్ధగా నేర్చుకున్నాను. నేను బాగా పాడుతున్నానని అమ్మ మురిసిపోయేది. ఎవరింట్లో పెళ్ళి, పేరంటాలు అయినా, ఏ పుణ్యకార్యాలు జరిగినా నా పాటలే. ఉషని పిలవండర్రా కాసిని మంగళహారతులు పాడుతుంది అంటూ ఆడుకుంటున్న నన్ను ప్రత్యేకంగా పిలుచుకుని వెళ్ళేవాళ్ళు.

అందరూ మెచ్చుకుంటుంటే అమ్మకి నాతో కచేరీలిప్పించాలనిపించేది కానీ, ధైర్యం చేసి నాన్నతో ఆ విషయం చెప్పలేకపోయేది. ఓసారి మేనత్త ఇంట్లో వదిన సీమంతం అయింది. ఆ రోజు నేను పాడిన పాటలు మామయ్య విన్నాడు. 'ఎంత బాగా పాడుతోందే మన ఉష' అంటూ అమ్మ దగ్గర మురిసిపోయాడు.

'అవునన్నయ్యా. కానీ, దాని స్వరం, దాని ప్రతిభ మగళహారతుల దగ్గరే వుండిపోతుందేమో అని భాధగా వుంది' అంది అమ్మ.

'నువ్వేం దిగులు పెట్టుకోకు నేను దానిచేత కచేరీలిప్పిస్తాను. వచ్చే శ్రీరామనవమికి, వినాయకచవితికి చక్కటి కచేరీ ఏర్పాటు చేస్తాను' అంటూ మామయ్య అమ్మకి అభయం ఇచ్చాడు.

ఆ తరువాత కొన్నిరోజులకే ఆ అవకాశం వచ్చింది.

మావయ్య ఇచ్చిన ధైర్యం, ప్రోత్సాహంతో కచేరీలిచ్చాను.

నాన్నకి ఇష్టమో, అయిష్టమో తెలియదు. ఏనాడూ నా పాట బాగుందని అనలేదు అలాగని బాగాలేదు అని కూడా అనేవాడు కాదు. అలాగే ఎప్పుడూ పాడద్దని అనలేదు, పాడమని అడగలేదు.

ఈలోగా నా పెళ్ళయింది. వాళ్ళు పెళ్ళిచూపుల్లో 'అమ్మాయికి పాటలొచ్చా' అని అడగగానే అమ్మ పొంగిపోయింది.

'సంగీతం నేర్చుకుందండి. చక్కగా పాడుతుంది' అంది.

వాళ్ళు వెంటనే ఓ పాట పాడమన్నారు. పాడాను 'నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ' రామదాసు కీర్తన పాడాను. పాడమని అడిగిన వాళ్ళెవరూ నేను పాట ఆపాక బాగా పాడావు అనికానీ, అబ్బే అంత బాగోలేదు ఇంకా బాగా నేర్చుకో అని కానీ అనలేదు. చాలా యాంత్రికంగా విన్నారు.

పాట అవగానే 'వంటలొచ్చా, వాకిట్లో ముగ్గులేయడం వచ్చా? ఎంతమందికి వంట చేయగలదు. మా ఇంట్లో చుట్టాలు, పక్కాలు వస్తూ పోతుంటారు వాళ్ళందరికీ వంట చేయాల్సివస్తుంది' అంటూ చాలా చెప్పారు.

అన్నిటికీ అమ్మ 'తప్పకుండా చేస్తుందండి 'అంది వినయంగా. మిగతా విషయాలు మాట్లాడుకున్నారు ఇరుపక్క పెద్దలు. పెళ్ళి అయిపోయింది.

మొదటిరోజు ఆ ఇంట్లో అడుగుపెడుతూనే ఎందుకో నా ఒళ్ళు జలదరించింది.

సత్యనారాయణ వ్రతం చేయించారు. మంగళ హారతి పళ్ళెం తీసుకుని వచ్చిన ఆడపడుచులు ఇద్దరూ పాటలు పాడారు. ఆ వయసులోనే నాకు వాళ్ళు పాడుతుంటే పారిపోవాలనిపించింది. నేనే పాడుకోవచ్చుకదా అనుకుని వాళ్ళ పాట అవగానే ఆ పాట ఎంత

మధురంగా పాడచ్చో వాళ్ళకి చెప్పాలని నేను సన్నగా అందుకున్నాను. అంతే మా ఆయన పక్కనే వున్నాడుగా నా తొడమీద గట్టిగా కొట్టాడు. దిమ్మెరపోయి చూసాను.

'నీకు పాటలొచ్చుని మాకు తెలుసు. నోరుమూసుకో' అన్నాడు. భయంతో నోరు మూసుకున్నాను. "

ఉషాకాంత దుఃఖం అడ్డుపడడంతో ఆపేసింది.

మహాలక్ష్మి ఆమె భుజం మీద ధైర్యం చెబుతున్నట్టు చేయి వేసింది.

తనని తాను నిలదొక్కుకుని తిరిగి ప్రారంభించింది ఉష.

"ఆ మూసిన నోరు అలా మూసుకునే వున్నాను. కానీ, పాడడానికి అలవాటు పడిన స్వరం ఆగుతుందా? అప్పుడప్పుడూ ఏదో పనిచేసుకుంటూ వుంటే అప్రయత్నంగానే నా నోట్లోంచి కీర్తన వచ్చేది. అంతే కొంపలంటుకుపోతున్నట్టు వచ్చేసేది మా అత్తగారు.

'అయ్యో, అయ్యో ఇది సంసారులుండే కొంపే ఆ పాటలేంటి? నోరుమూసుకో అంటూ నెత్తిన ఒక్కటి మొట్టేది.' ఆవిడ నోటితో మాత్రమే చెప్పేదికాదు. ఎప్పుడూ ఆవిడ చేయి కూడా పనిచేస్తూనే వుండేది. ఆవిడ బుద్ధులే అక్షరాలా ఆవిడ కొడుక్కి వచ్చాయి.

కనీసం మా గదిలో కూర్చుని కూడా నేను స్వరం సవరించుకునే అవకాశం కలిగేదికాదు. పొరపాటున రాగం బైటకి వస్తేచాలు నా తొడమీదో, వీపుమీదో ఠకీమని పడేది ఓ దెబ్బ.. 'నోరుమూసుకో. మా అమ్మ విన్నదంటే నీ తోలు తీస్తుంది' అనేవాడు.

ఎందుకు నేను నోరుమూసుకోవాలో నాకు అర్థం అయేదికాదు.

అలా అక్కడ ఉన్నన్ని రోజులు నేను నోరు బలవంతంగా మూసుకుని, మూసుకుని దాదాపు మూగదాన్ని అయాను.

అయినా ఏదో ఓ వంకతో నాకు తిట్లు, శాపనార్థాలు, దెబ్బలు తప్పేవికావు.

ఆయనకి, వాళ్ళ కుటుంబ సభ్యులకి సంగీతం అంటే ద్వేషం. సంగీతాన్ని ప్రేమించేవాళ్ళు తెలుసు, ప్రేమించకున్నా అంతగా ఆసక్తి చూపించని వాళ్ళు తెలుసు నాకు కానీ, ద్వేషించడం ఎందుకో అర్థం కాలేదు.

నామీద కోపమా, సంగీతం మీద నా కోపమా? నాకేం తెలియదు. ఆఖరికి దేవుడి ముందు మంగళహారతి పాడుకున్నా నేనేదో నేరం చేసినట్టు నన్ను హింసించేవాళ్ళు. భరించాను. అన్నీ భరించాను. ఆఖరికి ఆ రోజు. ఆ రోజు నన్నో పశువుని పడేసినట్టు ఓ గదిలో పడేసారు. నన్ను కాపాడేవాళ్ళు ఎవరూ లేరు. అరిచినా వినే నాథుడు లేడు. ఏం చేయాలి? ఏడుస్తూ వున్న నాకు ఈ ప్రకృతే ఓ దారి చూపించింది. అదే రోజు అతి కష్టమ్మీద వూరు వదిలి వచ్చాను. ఆ తరువాత జరిగిందేమిటో మీకు తెలుసు. నన్ను పాడద్దని అన్నా నోరుమూసుకుని పడుండేదాన్ని కానీ, ఆ హింసలు భరించలేకపోయాను. నేను మనిషిని. నన్నో పశువులా చూస్తుంటే ఎలా బతకగలను?"

వెక్కి, వెక్కి ఏడుస్తున్న ఉషాకాంతని ఉద్విగ్నంగా దగ్గరకు తీసుకుని హృదయానికి హత్తుకుంది ఆవిడ. ఆవిడ కళ్ళు చెమర్చాయి. ఉష తల మీద మృదువుగా రాస్తూ అందావిడ.

"బాధపడకు. అయిపోయింది. అదంతా ఓ పీడకల అనుకో. నువ్వు చెప్పినదాన్ని బట్టి వాళ్ళు నిన్ను వెతుక్కుంటూ వచ్చే సమస్యలేదు. కాబట్టి నువ్వు ధైర్యంగా వుండు. నీకు పెళ్ళి అంటే ఓ నరకం అనే అభిప్రాయం ఏర్పడడంలో ఆశ్చర్యంలేదు. నీకు పెళ్ళి చేయాలనుకున్నాను. చిన్నదానివి కాబట్టి నువ్వు సుఖపడాలి అనుకున్నా. కానీ నీకు పెళ్ళి ముఖ్యం కాదు. నువ్వు ఎదగాలి. నీలోని ప్రతిభ ఈ ప్రపంచానికి తెలియాలి. ఎక్కడో మారుమూల ఒక అపరసరస్వతి పుట్టి పెరుగుతోందని, ఆ సరస్వతి ఏదో ఒకనాడు ఆంధ్రదేశంలో సంగీత సామ్రాజ్యాన్ని ఏలుతుందని ఈ సంఘానికి తెలియాలి. అవునమ్మా నువ్వు ఎదగాలి. సుఖ, సంతోషాలు అనేవి పెళ్ళితో ముడిపడలేవు. ఆడపిల్లవు నువ్వు అణిగిమణిగి వుండాలని వాళ్ళు అనుకున్నారు. ఆడపిల్లవైనా ఆకాశమంత ఎత్తు ఎదిగి నువ్వేంటో

ఋజువు చేయాలి. పేరు ప్రఖ్యాతులు సంపాదించాలి. అప్పుడు వాళ్ళే నిన్ను వెతుక్కుంటూ వస్తారు. ఆ రోజున చెప్దాం నువ్వేంటో. ఇంకెప్పుడూ పెళ్ళిమాట ఎత్తను సరేనా?"

ఉష మాట్లాడలేదు. ఆమె మౌనం చూసిన మహలక్ష్మమ్మకి సందేహం కలిగింది. తనేదో ఆవేశంలో అంటోంది ఈ అమ్మాయి వుద్దేశం ఏంటో అనుకుంటూ కొంచెం సందేహంగా అడిగింది "నీకు పెళ్ళి చేసుకుని అందరిలా సంసారం చేసుకుంటూ, పిల్లల్ని కని ఓ గృహిణిగా స్థిరపడాలని వుందా? ఈ సమాజంలో నీకంటూ ఓ వునికినిచ్చి నీ ప్రతిష్ఠను పెంచే సంగీతాన్ని వృత్తిగా తీసుకుని ముందుకు సాగాలని వుందా?"

"లేదు నాకు పెళ్ళంటే భయం, భర్తంటే భయం. నేను మళ్ళీ పెళ్ళి అనే నరకంలో పడలేను. నన్నిలా వుండనివ్వండి. మీకు నేనేమ్మాత్రం భారం కాను. ఎంత మంది పిల్లలకైనా సంగీతం నేర్పుతాను."

ఆవిడ నవ్వింది వాత్సల్యంగా, అభయం ఇస్తున్న మహాలక్ష్మిలా నవ్వింది.

"నువ్వు నాకు భారం అవుతావని నేనెప్పుడూ అనుకోలేదమ్మా. నీలాంటి వాళ్ళని మరి నలుగురిని పోషించగలను. కానీ, ఎంతకాలం? నీకంటూ ఒక జీవితం వుండాలి. నీకంటూ ఒక వ్యక్తిత్వం వుండాలి. నీకు ఎప్పుడైతే ఆర్థిక స్వాతంత్ర్యం వస్తుందో నీ మీద నీకు నమ్మకం ఏర్పడుతుంది. నీలో బతకగలనన్న ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది. ఆ నమ్మకం, ఆ ఆత్మవిశ్వాసం నిన్ను ముందుకు నడిపిస్తాయి."

అయితే, అయితే "నేను మీ దగ్గరే వుండిపోవచ్చుగా" ఆశగా చూసింది ఉష.

ఆ కళ్ళల్లో కనిపిస్తున్న భయం సందేహం చూడగానే ఆవిడలో ఆ పిల్లపట్ల వాత్సల్యం పెల్లుబుకింది. దగ్గరగా తీసుకుని గుండెకి హత్తుకుని తలమీద ప్రేమగా రాస్తూ అంది. "సంతోషంగా వుండచ్చు. ఈ ఇల్లు నీది కూడా. సరేనా?"

ఉషాకాంత హాయిగా నవ్వింది.

మర్నాటి నుంచే మహాలక్ష్మి ఉషాకాంత భవిష్యత్తు విషయమై తీవ్రంగా ఆలోచించసాగింది.

ప్రస్తుతం ఉషాకాంత సంగీత పాఠాలు చెబుతున్న స్థలం చాలా చిన్నది. అది ఒక పాఠశాలగా అభివృద్ధి చెందాలంటే మరికొంచెం పెద్దస్థలం కావాలి. ఈ ఊరితో ఆగిపోకుండా ఉషాకాంత ప్రతిభ చుట్టుపక్కల వున్న ఊళ్ళకి కూడా వ్యాపిస్తే మరికొంత మంది పిల్లలు వస్తారు నేర్చుకోడానికి అప్పుడు ఆమెకి ఆదాయం బాగుంటుంది. అందుకేం చేయాలి?

ఆలోచించి, ఆలోచించి ఆవిడ ఓ నిర్ణయానికి వచ్చింది.

మర్నాడే ఆలయపూజారి గారి దగ్గరకు వెళ్ళి రాబోయే శ్రీరామనవమి ఉత్సవాల గురించి మాట్లాడింది. తన తరఫున ఐదువేల రూపాయలు శ్రీరామనవమి ఉత్సవాల నిమిత్తం ఇస్తానని ఈ ఏడాది ఉత్సవాలు ఆడంబరంగా జరగాలని. అందులో ఉషాకాంత సంగీత కచేరీ వుండాలని కోరింది.

అందుకు ఆనందంగా అంగీకరించాడు పూజారి. అక్కడినుంచి కరణం గారింటికి వెళ్ళింది. ఆవిడ వెళ్ళేసరికి కరణంగారు విశ్రాంతిగా పడక కుర్చీలో కూర్చుని వున్నారు. పక్కనే ఆయన భార్య నేలమీద కూర్చుని ఆయనకి విసనకర్రతో విసురుతోంది.

"నమస్కారం కరణంగారూ!" చిరునవ్వుతో గుమ్మం ముందు నిలబడిన మహాలక్ష్మిని చూసి ఆప్యాయంగా ఆహ్వానించాడు ఆయన. ఆయనకి మహలక్ష్మమ్మ అంటే ఎంతో గౌరవం. భర్త తనను వంచించినా ఆయన్ని గౌరవిస్తూ, ఎంతో గౌరవనీయంగా బతుకుతున్న ఆవిడంటే ఆయనకే కాదు ఆ ఊళ్ళో దాదాపు అందరికీ ఎంతో అభిమానం, గౌరవం. ఏదన్నా ముఖ్యమైన పని వుంటేనే

ఆవిడ ఎవరింటికైనా వస్తుంది. ఊరికే వూసుపోక వచ్చి కబుర్లు చెప్పడం ఆమె స్వభావంకాదు. ఊరులోనే వున్నా కలుసుకునేది చాలా తక్కువ అలాంటిది ఆవిడ ఇవాళ తన గుమ్మం ముందుకు రావడంతో ఆయనకి ఆశ్చర్యంతోపాటు, ఆనందమ్మ కూడా కలిగింది.

గభాల్న కుర్చీలోంచి లేచి "నమస్కారం అమ్మా రండి, రండి ఏంటి ఇలా వచ్చారు?" అంటూ భార్య వైపు తిరిగి లేచి "అలా కుర్చీ పట్టావే" అన్నాడు.

మహాలక్ష్మమ్మ రావడం ఆవిడనీ ఆశ్చర్యంలో ముంచేయడంతో వెంటనే ఏం చేయాలో తోచక అలా విగ్రహంలా కూర్చున్న అన్నపూర్ణమ్మ భర్త హెచ్చరికతో విసనకర్ర పక్కన పడేసి లేచి వెళ్ళి లోపలనుంచి ఇనపకుర్చీ తీసుకొచ్చి వేసి "రండమ్మా కూర్చోండి మంచినీళ్ళు తీసుకుంటారా?" అంటూ మర్యాదగా పలకరించింది.

"ఎందుకమ్మా నన్నిలా పరాయిదానిలా చూస్తారు? ఎందుకీ మర్యాదలు? నేనూ మీతోపాటు ఇక్కడే కూర్చుంటాను మీరలా కూర్చోండి పంతులుగారూ" అంటూ అన్నపూర్ణమ్మగారి చేయి పట్టుకుని నేలమీద కూర్చోబెట్టి తను ఆవిడ పక్కనే కూర్చుంది.

"అయ్యో మీరలా కుర్చీలో కూర్చోండి" గాభరాగా అన్నాడు ఆయన.

"ఏంటి పంతులుగారూ మనలో మనకి ఈ మర్యాదలేంటి? కూర్చోండి మీరు" పెద్ద తరహాగా మందలించింది.

ఆయన మరేం మాట్లాడకుండా పడక కుర్చీ పక్కకి జరిపి ఇనపకుర్చీ మీద కూర్చున్నాడు.

"ఏంటమ్మా ఎలా వున్నారు?" అన్నపూర్ణమ్మగారి చేతిమీద చేయివేసి ఆప్యాయంగా అడిగింది మహాలక్ష్మి.

"ఆవిడకేం నిక్షేపంలా వుంది. మీరెలా వున్నారు? ఎవరో అమ్మాయిని చేరదీసారట. ఆమె గాయనిట. ఓసారి మీ ఇంటికి రావాలనుకుంటూనే అశ్రద్ధ చేసాను. ఇంతకీ ఎవరా అమ్మాయి?" కుతూహలంగా అడిగాడు ఆయన.

"ఆ విషయం మీతో మాట్లాడాలనే వచ్చాను పంతులుగారూ" చిరునవ్వుతో అందావిడ.

"పూర్ణా అమ్మగారికి కాఫీ పట్టాకూడదూ" అన్నాడాయన.

"ఎందుకండి" మొహమాటంగా అంటున్న మహాలక్ష్మి మాటలు పట్టించుకోకుండా అన్నపూర్ణ నవ్వుతూ లేచి లోపలికి వెళ్తూ అంది. "కాఫీ ఇప్పుడు ఆయనకీ కావాలి. మీరు వంక అంతే."

మహాలక్ష్మి కూడా నవ్వింది.

మహాలక్ష్మి ఆవిడ వచ్చేదాకా మౌనంగా పరిసరాలు గమనిస్తూ కూర్చుంది.

విశాలంగా వున్న వీధిగది, ముందు ఖాళీ స్థలం, అక్కడక్కడా కొన్ని మొక్కలు, బలమైన చెక్కగేటు. చుట్టూ ఖాళీ స్థలం, లోపల మరికొన్ని గదులు, పెరటిలోకి చూస్తే పెద్ద తులసికోట, చూడగానే మనసుని దోచేలా వుంది ఇల్లు.

అన్నపూర్ణ పెద్ద స్టీలు గ్లాసుల్లో చిక్కటి కాఫీ తెచ్చింది.

కరణంగారికి, మహాలక్ష్మికి ఇచ్చి, తనో గ్లాసు తీసుకుని తిరిగి మహాలక్ష్మి పక్కన కూర్చుంది.

కమ్మటి కాఫీ తాగి "చాలా బాగుందమ్మా!" అంది మహాలక్ష్మి.

"మా ఆవిడ చేతిలో కాఫీ తయారుచేయడానికి ప్రత్యేకమైన భాగం ఏదో వుందమ్మా. అంచేత కాఫీ మాత్రం అద్భుతంగా చేస్తుంది. అందుకే నేను రోజులో అరడజను సార్లు కాఫీ తాగుతాను. ఒక విధంగా కాఫీతోటే బతుకుతాను" అన్నాడు కరణంగారు.

ఇంకా నయం కాఫీతోటే బతుకుతున్నాను "మా ఆవిడ వంట చండాలంగా చేస్తుంది" అనలేదు.

ఆవిడ మాటలకి నవ్వేసింది మహాలక్ష్మి.

అరవై ఏళ్ళకి చేరువ అవుతున్న ఆయన, యాభై ఏళ్ళ అన్నపూర్ణల అన్యోన్యత, ఈ వయసులో కూడా వాళ్ళ మధ్య వున్న సరస సల్లాపాలు చూసి మనసారా నవ్వుకుంది మహాలక్ష్మి.

"ఇంతకీ మీరేదో చెప్పాలనుకున్నారు చెప్పలేదు" అన్నాడాయన.

తల పంకించి చెప్పసాగింది మహాలక్ష్మి. ఉషాకాంత తనకి ఏ పరిస్థితుల్లో తటస్థపడిందో, ఏ విధంగా తను ఆ అమ్మాయికి ఆశ్రయం ఇచ్చిందో చెప్పి, ఉషాకాంత చెప్పిన ఆమె జీవిత కథ కూడా చెప్పింది.

ఆ దంపతులకి పిల్లలు లేరు. అందుకే వాళ్ళకి పిల్లలంటే ఎంతో ఇష్టం. ఆ ఊళ్ళో చదువు మీద ఆసక్తి వుండి చదువుకోలేని పరిస్థితుల్లో వున్న ఎందరో పిల్లలకి ఆర్థిక సహాయం చేసి వాళ్ళు చదువుకోడానికి ఎంతో సహకరించారు. ఇంకా చేస్తున్నారు. దయగల హృదయం వాళ్ళది. ఉషాకాంత కథ వినగానే ఇద్దరి కళ్ళు చెమర్చాయి.

"పాపం ఆడపిల్ల ఎన్ని కష్టాలు పడింది. ఇంట్లోంచి పారిపోయి వచ్చి మంచిపని చేసింది. ఆ పిల్ల చేసిన పుణ్యమో, వాళ్ళమ్మ చేసిన పూజలో మీ కంటపడింది. ఇంక ఆమె భవిష్యత్తుకి వచ్చిన లోటేమీ లేదు. చెప్పండమ్మా నా తరపున నేనేం చేయగలను" అన్నాడాయన.

"పాపం పిచ్చిపిల్ల. అదేం రోగం వాళ్ళకి. బంగారంలాంటి కోడలు వస్తే కళ్ళకద్దుకుని నెత్తిన పెట్టుకోవాల్సిన వాళ్ళు అన్ని కష్టాలు పెట్టడం ఏంటి?" వాపోయింది అన్నపూర్ణమ్మ.

"అదేగా నా భాధ కూడా కాకపోతే ఆ అమ్మాయి భవిష్యత్తులో నిలదొక్కుకోవాలంటే ప్రస్తుతం ఆమె దగ్గర కొద్దిమంది పిల్లలే నేర్చుకుంటున్నారు. మన వూళ్ళో ఎలాగూ సంగీత కళాశాలలాంటిది లేదు. అలాంటిదేదైనా ఏర్పాటు చేస్తే చుట్టు, పక్కల వున్న వాళ్ళలో ఎవరికి ఆసక్తి వున్నా వచ్చే అవకాశం వుంది. మీరేమంటారు?" అడిగింది ఆవిడ ఆశగా ఆయన వైపు చూస్తూ.

"అలాగే చేద్దాం మహలక్ష్మమ్మగారూ మీలాంటి ఉత్తములు సిఫారసు చేసాకా కాదంటానా?" నిజాయితీగా అన్నాడు.

ఆవిడ కళ్ళు మెరిసాయి. ఆయన పట్ల గౌరవంతో నిండిపోయింది మనసు.

"అలాగే మన వూళ్ళో ఈ శ్రీరామనవమి ఉత్సవాలు కొంచెం ఆర్భాటంగా చేద్దామా బాబుగారూ?" అడిగింది.

"అయ్యో దానికేం తప్పకుండా చేద్దాం."

"అయితే ఆ తొమ్మిది రోజులు ఉషాకాంతతో పాటు ఎవరన్నా సినీ నేపథ్యగాయనిలను, ఇంకెవరన్నా ప్రముఖులను పిలిచి పాటల కచేరీ చేయిద్దామా?"

ఆయన సందేహంగా చూసాడు.

అమ్మాయంటే మనకి అందుబాటులో వుంది రోజూ పాడించవచ్చు. కానీ, సినీ నేపథ్యగాయనీమణులు, గాయకులు ఎలా వస్తారు?

కొంచెం ఉత్సాహంగా అందావిడ "వస్తారు. మనం ప్రయత్నిస్తే వాళ్ళని పిలిపించవచ్చు. కాకపోతే వాళ్ళకి కొంత పారితోషికం ఇవ్వాల్సి వుంటుంది. అందుకు కొంత ఖర్చు అవుతుంది. విరాళాలు పోగుచేద్దామా?"

ఆయన నవ్వాడు. ఆ క్షణంలో ఆవిడ అమాయకురాలిలా అనిపించింది ఆయనకి.

పారితోషికం ఇచ్చి సినీప్రముఖులను పిలిపించే శక్తి తమకి లేదు. ఇకపోతే ఆ అవసరం ఏంటి? ఎందుకు ఈవిడ వాళ్ళని పిలవాలనుకుంటోంది అని ఆలోచిస్తూ నెమ్మదిగా అన్నాడు "ఎవరిస్తారమ్మా విరాళాలు?"

ఆవిడ వైపు ఆశ్చర్యంగా చూసాడు. ఈవిడకి ఇంతటి పరిజ్ఞానం, ఆలోచనా శక్తి ఎక్కడినుంచి వచ్చాయి. అతి సామాన్యురాలైన ఈ స్త్రీలో ఇంత ప్రణాళికా బద్ధంగా ఆలోచించగల నేర్పు ఎక్కడిది? తనకేమీ కాని ఒకమ్మాయికి సానుభూతితో ఆశ్రయం ఇవ్వడం వరకూ సమర్థించవచ్చు. ఏ మాత్రం మానవత్వం వున్న వాళ్ళైనా సాయం చేస్తారు. కానీ, ఆమెని ఎంతో ఎత్తుకి తీసికెళ్ళాలన్న ఈ ప్రయత్నం ఎంతవరకు సముచితం, ఎంతవరకు ఆచరణీయం?

**మహాలక్ష్మి ప్రయత్నాలు వృధాకాలేదు.** ఆ ఊళ్ళో డబ్బున్న వాళ్ళందరూ శ్రీరామనవమి వుత్సవాలు ఎప్పటికన్నా ఘనంగా జరుపుకునేందుకు వారి, వారి శక్తికి తగ్గట్టుగా విరాళాలు ఇచ్చారు. నవరాత్రులు జరపాలని నిశ్చయించారు. నవరాత్రుల్లో ఒక్కోరోజు ఒక్కో వూరినుంచి అక్కడి ప్రముఖులను, అంతో, ఇంతో ప్రతిభ వున్న అన్ని రకాల కళాకారులను ఆహ్వానించి వారి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ముగింపు వుత్సవాల రోజున అతిధులుగా మద్రాసు నుంచి ఇద్దరు నేపథ్యగాయనీ, గాయకులను ఆహ్వానించారు. ఆ రోజే ఉషాకాంత సంగీత కచేరీ గంటసేపు ఏర్పాటు చేసారు.

ఊరు, ఊరంతా ఏకమైంది. యువకులు, నడివయస్కులు అయిన మగవాళ్ళంతా వూరంతా రంగు కాగితాలతో తోరణాలు కట్టారు. ఊరు మొదలునుంచి శ్రీరామనవమి వుత్సవాల కార్యక్రమాలన్నీ అచ్చువేయించిన పెద్ద, పెద్ద పోస్టర్లు అంటించారు. పెద్ద పందిరి వేయించి మావిడాకుల తోరణాలు కట్టడమే కాకుండా అవి వాడిపోయిన వెంటనే తీసేసి ఏరోజు కారోజు నవనవలాడే ఆకులు కట్టాలని కుర్రాళ్ళకి పెద్దలు ఆదేశాలిచ్చారు.

నవరాత్రులు వచ్చే అతిధులకి మగవాళ్ళకి కరణం గారింట్లో, ప్రెసిడెంటు గారింట్లో, ఆడవాళ్ళకి మహాలక్ష్మమ్మ ఇంట్లో బస ఏర్పాటు చేసారు.

అనుకున్నట్టే వుత్సాహంగా ప్రారంభం అయాయి నవరాత్రులు, మైకులు వూరంతా మారుమోగిపోయాయి. కుర్రాళ్ళు, పిల్లలు ఎంతో హుషారుగా పనులు చేయసాగారు. ఆటలు, పాటలతో హోరెత్తించారు.

ఆ హడావుడి, ఆ సంబరం చూస్తుంటే ఓ పక్క ఆనందంగానూ, మరో పక్క ఆందోళనగానూ వుంది ఉషాకాంతకి. ఆనందం ఇంతటి సంబరం ఆమెకి తెలియదు. తను పుట్టి, పెరిగిన వూర్లో శ్రీరామనవమి వుత్సవాలు జరిపినా ఇంత పెద్ద ఎత్తున జరిపిన గుర్తులేదు. ఇకపోతే ముఖ్య అతిధులుగా రాబోయే ప్రముఖ సినీ నేపథ్యగాయనీ గాయకుల ముందు తను కచేరీ చేయడం అంటే దడగా వుంది. చేయగలనా? వణికిపోతూ ఎన్ని అపస్వరాలు పాడతానో అమ్మ ఎందుకింత హడావుడి చేస్తోంది? తీరా తను సరిగా పాడకపోతే అంతా రసాభాస అవుతుంది. అమ్మకి అవమానం, తనకి ఆవేదన.

ప్రతిక్షణం ఆ రాముడిని తల్చుకుంటూ తన కచేరీ విజయవంతం అయేలా చూడమని ప్రార్థిస్తోంది.

ఆరోజు రానే వచ్చింది. తెల్లవారితే ముగింపు వుత్సవాల రోజు. తొమ్మిదోరోజు. ఆరోజే అతిధులు వస్తారు.

ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. 'రామ రామ రమేతి రామే మనోరమే, సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే' అని భజన చేసుకుంటూ గడిపింది.

తెల్లవారింది. మహాలక్ష్మమ్మ పాలమీగడలో సెనగపిండి, పసుపు వేసిచ్చి నలుగుపెట్టుకుని తలంటుకోమంటూ గిన్నెడు కుంకుడుకాయలు కొట్టించింది.

ఉషాకాంత స్నానానికి వెళ్ళాక వంట ఏర్పాట్లు చేసుకుంది. అతిధులు వస్తారు కాబట్టి సాయానికి వరలక్ష్మిని పిలిపించింది.

తొమ్మిదయేసరికి అతిధులు దిగారు. వాళ్ళని కొందరు కుర్రాళ్ళు స్టేషన్‌కి వెళ్ళి రిసీవ్ చేసుకుని, కారులో తీసుకొచ్చి నేపధ్యగాయని సీతని మహలక్ష్మమ్మ ఇంటిలో, గాయకుడిని కరణం గారింట్లో దింపారు. సీత అందంగా లేకపోయినా మెడనిండుగా నగలు, ఖరీదైన పట్టుచీరలో మెరిసిపోతోంది. ఆమెని చూడగానే ఉషాకాంత కూడా ఈమెలా వెలగాలి అనుకుంది మహలక్ష్మమ్మ.

సీతకి మేడమీద గది ఏర్పాటు చేసింది.

మధ్యాహ్నం భోజనాల సమయంలో కిందకి వచ్చినా పెద్దగా మాట్లాడలేదు సీత. ఉషాకాంతని పరిచయం చేసింది మహాలక్ష్మి. 'ఓహో' అని తలపంకించిందేకానీ, ఆప్యాయంగా పలకరించలేదు.

భోజనాలయాక ఎర్రబడిన ఉష కళ్ళు చూసి "కళ్ళు చూడు ఎలా వున్నాయో" అంటూ బలవంతంగా గదిలోకి పంపించింది.

సాయంకాలం కార్యక్రమం ఏడింటికి ఐదింటినుంచే ఉషాకాంతను తనే స్వయంగా తయారుచేసింది మహాలక్ష్మమ్మ. తన దగ్గర వున్న పట్టుచీరల్లో ఉషాకాంతకు నప్పే చీర తీసి కట్టింది. మెడలో తన చంద్రహారం, జాజిమొగ్గల నెక్లెసు వేసింది. చెవులకి రవ్వల దిద్దులు పెట్టింది. అందంగా ముగ్ధమనోహరంగా వున్న ఆ అమ్మాయిని కళ్ళారా చూసుకుని మురిసిపోయింది.

కరణంగారు కారు పంపారు. కారులో సీత, మహాలక్ష్మమ్మ, వుత్సవాలు జరిగే వేదిక దగ్గరకు వెళ్ళారు.

అసలు కార్యక్రమం మొదలైందాకా కొందరు ఔత్సాహికులైన యువతీ, యువకులు ఏవో భక్తిపాటలు పాడారు. పిల్లలు నృత్యాలు చేసారు.

అతిధులంతా వేంచేసారు. కరణంగారు, ప్రెసిడెంటుగారు కలిసి వచ్చారు. ఊరు వూరంతా కదిలివచ్చినట్టు అనిపించింది.

కార్యకర్తలు వేదిక మీదకు వచ్చి ఉషాకాంత కచేరీ గురించి, ఉషాకాంత గురించి చెప్పి ఆమెని వేదిక మీదకు ఆహ్వానించారు.

ఉషాకాంత వేదిక మీదకు వచ్చి అతిధులకు, ప్రేక్షకులకు నమస్కరించి తివాచీ మీద కూర్చుంది. అప్పటికే పక్క వాయిద్యాల వాళ్ళు ఆసీనులై వున్నారు. ముందు ప్రముఖులైన అతిధులను చూస్తుంటే కంగారు, భయం కలిగాయి. మహలక్ష్మమ్మ వైపు చూసింది. 'ఆవిడ కళ్ళతోటే' ధైర్యం చెప్పింది.

కళ్ళు మూసుకుని మనసులో సరస్వతీ దేవిని ప్రార్థించుకుని ప్రారంభించింది.

గంటసేపు ఎలా గడిచిపోయిందో తెలియలేదు.

తన్మయత్వంతో, పారవశ్యంతో పాడింది. ఆ పాటలో, రాగంలో, భావంలో మునిగిపోయింది. కళ్ళముందు ముక్కోటి దేవతలు ప్రత్యక్షమై దీవించినట్టు అనిపించింది.

తన కళ్ళ నుంచి నీళ్ళు కారిపోతుంటే బాహ్య ప్రపంచంలోకి వచ్చింది.

చప్పట్లతో పరిసరాలు మారుమోగిపోయాయి.

అతిధులు వేదిక మీదకు వచ్చి ఉషాకాంతను అభినందనల్లో ముంచెత్తారు. పూలదండలతో, శాలువాతో సత్కరించారు. ఆమెకి ఉజ్వలమైన భవిష్యత్తు వుందని సరైన ప్రోత్సాహం, తోటివారి సహకారం లభిస్తే ఆమె ఎంతో ఎత్తుకి ఎదగగలదని అన్నారు. మహాలక్ష్మమ్మని అభినందించారు.

ఉషకాంతకి ఇతర వూళ్ళనుంచి వచ్చిన సర్పంచ్ వేయినూట పదహార్లు కానుకగా ఇచ్చాడు.

స్వామికి మంగళహారతి ఇచ్చారు. హారతి పాటను మురళి, సీత కలిసి అద్భుతంగా పాడారు.

అక్కడే భోజనాలు ముగించి అందరూ ఎవరి బసకు వాళ్ళు వెళ్ళిపోయారు.

సీత, మహాలక్ష్మమ్మ, ఉష కూడా ఇంటికి వెళ్ళారు.

సీత చూడకుండా ఉషకి గుప్పెడు వుప్పుతో దిష్టితీసేసి రెండు బుగ్గలూ పుణికి ముద్దుపెట్టుకుంది ఆవిడ.

ఉష ఒంగి ఆవిడ కాళ్ళకి నమస్కరించింది.

"లేమ్మా ఇంతకన్నా ఉన్నతమైన స్థానానికి నువ్వు ఎదగాలి నేనది చూడాలి అందావిడ మనస్ఫూర్తిగా."

సీత కూడా ఎంతో అభినందించింది. ఉదయం కొంచెం దర్పం ప్రదర్శించిన సీత కార్యక్రమం తరవాత తమాషాగా మారిపోయి ఉషని అభినందించడం మహాలక్ష్మమ్మకి చాలా ఆనందాన్నిచ్చింది.

అదే అవకాశంగా తీసుకుంది మహలక్ష్మమ్మ "మా అమ్మాయికి కూడా సినిమాల్లో పాడడానికి ఏవన్నా అవకాశాలుంటే చెప్పండమ్మా" అంది సీతతో.

"అయ్యో దానికేంటండి అలాగే చెప్తాను. నేనే చెప్పాలనుకుంటున్నాను మీకు. మీ అమ్మాయి కర్ణాటక సంగీతం అద్భుతంగా పాడగలిగినా, లలితసంగీతం కూడా వచ్చి వుండాలి. మీకు అభ్యంతరంలేకపోతే మీ అమ్మాయికి లలిత సంగీతం నేర్పించండి" అంది.

"లలిత సంగీతమా? ఈ వూళ్ళో అలా నేర్పేవాళ్ళు ఎవరూ లేరమ్మా" అందావిడ నిరాశగా.

సీత ఆలోచించింది. ఉషాకాంతని పరిశీలించి చూసింది. పుత్తడిబొమ్మ. తీయని స్వరం, ఈమెకి పదును పెడితే బంగారంలా మెరిసిపోతుంది. చిత్రపరిశ్రమలో ఖచ్చితంగా ఈమెకి అవకాశాలు వస్తాయి.

"మీకు అభ్యంతరం లేకపోతే మద్రాసు పంపిస్తారా? నా దగ్గర వుంటుంది నాకు తెలిసిన చక్కటి గాయని ఒకావిడ వున్నారు. ఆవిడ లలిత సంగీతం అద్భుతంగా పాడతారు. ఆవిడ దగ్గరకి తనకి లలిత సంగీతం నేర్పిస్తాను. ఈలోగా ఏవన్నా అవకాశాలు వున్నా చూస్తాను" అంది.

ఆవిడ పొంగిపోయింది. మెరిసిపోతున్న కళ్ళతో అంది "తప్పకుండా పంపిస్తాను."

"నేను వెళ్ళగానే మీకు వుత్తరం రాస్తాను ఎప్పుడు పంపించాలో" అంది సీత.

ఆ రాత్రి మహలక్ష్మమ్మ తృప్తిగా నిద్రపోతే ఉషకి భయంతో, అనేక సందేహాలతో నిద్రపట్టలేదు.

అన్నట్టుగానే సరిగ్గా వారం రోజుల్లో సీత దగ్గర్నించీ ఉత్తరం వచ్చింది. ఉషని మద్రాసు పంపించాల్సిందిగా రాసింది.

మహలక్ష్మమ్మ ఆనందానికి అవధులు లేవు. తను ఆశించింది, ఇంత త్వరగా జరుగుతుందని ఆవిడ వూహించలేదు. అనూహ్యమైన శుభవార్త వెంటనే కరణంగారింటికి వెళ్ళి ఆ శుభవార్త చెప్పింది.

"నీ ఆశయం నెరవేరిందమ్మా. ఏ తల్లి కన్నబిడ్డో అనుకోకుండా నీ ఇంటిగుమ్మంలోకి వచ్చింది. పెద్ద మనసుతో ఆదరించి ఆ పిల్లకి ఒక బాట వేసావు. ఆ బాటలో నడిచి ఆమె వున్నతమైన శిఖరాలు చేరాలని దీవిస్తున్నాను" అన్నాడాయన.

"నాకు భగవంతుడు మాతృత్వాన్ని ప్రసాదించకపోయినా, ఏనాటి ఋణానుబంధమో ఈ పిల్లని నాకు ఇచ్చి తల్లికాని తల్లిని చేసాడు. చాలు నా జన్మ చరితార్థం అయింది. లేకపోతే నా బతుకుకి అర్థం ఏవుంది చెప్పండి. నిరర్థకంగా నా బతుకు ముగిసిపోయేది" అందావిడ కళ్ళు చెమరుస్తుంటే.

అక్కడినుంచి సెలవు తీసుకుని ఇంటికి వెళ్ళాక పక్కింటి కుర్రాడిని పిలిచి మద్రాసుకి రెండు రైలు టిక్కెట్లు తెమ్మని పంపించింది.

ఏడుస్తున్న ఉషాకాంతని దగ్గరకు తీసుకుని "ఎందుకమ్మా ఏడుపు? ఎంత మంచి అవకాశం ఇంత సునాయాసంగా వస్తుందనుకోలేదు. ఆ శ్రీరాముడు మనల్ని కరుణించాడు. ధైర్యంగా వెళ్ళు.వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటూ జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకో. ఏ భర్త నిన్ను బాధపెట్టాడో, ఏ అత్త నిన్ను అవమానించిందో వాళ్ళ గుండె పగలాలి. అంత ఎత్తుకి ఎదగాలి" అంది.

"నీ దగ్గరే వుంటానమ్మా. ఇక్కడే పిల్లలకి పాఠాలు నేర్పిస్తు నాలుగు డబ్బులు సంపాదించుకుంటాను. ముక్కు, మొహం తెలియని వాళ్ళ దగ్గర ఎలా వుండను? నాకు భయంగా వుందమ్మా" ఏడుస్తూ అంది ఉష.

ఆవిడ నవ్వింది "పిచ్చిదానా నా దగ్గరకు రాకముందు నేను తెలుసా నీకు. భగవంతుడు మనకి సాయం చేయడానికి తను దిగిరాడమ్మా. అనేక రూపాల్లో మనల్ని కాపాడుతూ, మనకి సహాయం చేస్తూ వుంటాడు. ఇప్పటిదాకా నా రూపంలో చేస్తే ఇప్పుడు సీతమ్మ రూపంలో చేస్తాడు. ఆ తరువాత మరో రూపంలో ఇదంతా దైవానుగ్రహం. భయపడకూడదు. ధైర్యే సాహసే లక్ష్మి. ఎంతకాలం పిల్లలకి పాఠాలు చెప్పుకుంటావు? నేనెంతకాలం బతికి వుంటాను అందుకే నువ్వు నువ్వుగా ఎదగాలి."

"అంతమాటనకమ్మా" అంటూ బావురుమంది ఉష.

ఆవిడకి కూడా కన్నీళ్ళు పొంగి వచ్చాయి. తన్ని తాను నిగ్రహించుకుంటూ ఉష వీపు మీద ఓదార్పుగా నిమిరింది.

వారం రోజుల్లో ఇద్దరూ మద్రాసు రైలెక్కారు.

దారిపొడుగునా మహలక్ష్మమ్మ ఆడపిల్లలు ఎలా ధైర్యంగా వుండాలి, ఎవరితో ఎలా మాట్లాడాలి? ప్రమాదకరమైన పరిస్థితులు ఎదురైతే ఎలా ఎదుర్కోవాలి? మగవాళ్ళతో ఎలా మాట్లాడాలి? వగైరా చెబుతూనే వుంది.

మద్రాసులో దిగగానే సీత కారు పంపించి వాళ్ళని ఇంటికి తీసుకెళ్ళింది.

విశాలమైన ఆమె బంగళా, నౌకర్లు, చాకర్లు చూసి ఉషకి కళ్ళు తిరిగిపోయాయి. నేనూ ఇంత ఇల్లు కొనుక్కుంటానా? నాకూ ఇంతమంది నౌకర్లుంటారా? ఆమె మనసులో ఆలోచనలు సుళ్ళు తిరిగాయి. కళ్ళ ముందు పెద్ద, పెద్ద మేడలు కదిలాయి. ఆ మేడముందు తన దయకోసం ప్రాధేయపడుతున్న భర్త కనిపించాడు. ఆమె పెదవుల మీద చిరునవ్వు మెరిసింది.

సీత ఎంతో ఆప్యాయంగా మాట్లాడింది. మహలక్ష్మమ్మకి ఉషని కంటికి రెప్పలా చూసుకుంటానని మాట ఇచ్చింది.

రెండు రోజులండి ఉషని సీతకి అప్పచెప్పి మహలక్ష్మమ్మ తిరుగు ప్రయాణమైంది.

ఉష బావురుమంది. ఆ పిల్ల ఏడుపు చూస్తుంటే ఆవిడకి నేను తప్పు చేస్తున్నానా? అపరిచితురాలైన ఈ సీత దగ్గర వదిలి వెళ్ళడం సముచితం కాదా అన్న పశ్చాత్తాపం కలగసాగింది. కానీ, అంతలోనే ఉష భవిష్యత్తు ఉజ్జ్వలంగా ప్రకాశించాలంటే ఇలా చేయక తప్పదు అని తనకు తానే ధైర్యం చెప్పుకుని ఉషని ఓదార్చి మరోసారి ధైర్యం చెప్పి రైలెక్కింది.

ఆవిడ వెళ్ళిపోయాక వెక్కి, వెక్కి ఏడుస్తున్న ఉషని అనునయిస్తూ అంది సీత "చిన్నపిల్లలా అలా ఏడవకూడదు. అమ్మని త్వరగా ఇక్కడికి పిలిపించుకుందువుగాని ముందు నువ్వు పరిశ్రమలో నిలుదొక్కుకోవాలి. తరువాత అన్ని పరిస్థితులు నీకు అనుకూలంగా వుంటాయి. ఎంతో సుఖంగా వుటావు. అమ్మని కూడా సుఖపెడతావు. "

ఆ రాత్రి ఏడుస్తూనే నిద్రపోయింది ఉష.

రెండు రోజులు గడిచాక సీత ఉషని తీసుకుని లలిత సంగీతం నేర్పే కృష్ణవేణి దగ్గరకు తీసుకుని వెళ్ళింది.

ఉష చేత రెండు కీర్తనలు పాడించింది సీత.

అది విన్న కృష్ణవేణి ఉష స్వరం ఎంతో మెచ్చుకుని లలితగీతాలు నేర్పడానికి అంగీకరించింది.

ఆ రోజు నుంచే పాఠాలు ప్రారంభం అయాయి. ఉషని అక్కడ వదిలేసి సీత సినిమా పాట రికార్డింగ్ వుందని వెళ్ళిపోతూ, తనే తిరిగి వచ్చి తీసుకుని వెళ్తానని అందాకా అక్కడే వుండమని చెప్పి వెళ్ళింది.

కృష్ణవేణి వయసు నలభై పైన వుంటుంది. చామనఛాయలో, కొంచెం పొట్టిగా కుదిమట్టంగా వుంది మనిషి. విశాలమైన బంగళా. గేటుదాటి లోపలికి రాగానే చక్కటి పూలతోట. అందంగా వుంది. ఆవిడ భర్త లాయర్. ఆమెకి ఇద్దరు మగపిల్లలు. వాళ్ళు డిగ్రీ చదువుతున్నారు. ఇల్లంతా ఏదో ఒక మంచి పరిమళంతో నిండి వుండడం గమనించింది ఉష.

ఆరోజు ఆవిడ అడవి బాపిరాజుగారి 'ఉప్పొంగెలే గోదావరి, ఊగిందిలే చేలో వరి, భూదారిలో నీలాంబరి, మా సీమకే చీనాంబరి' గీతంతో ఆనాటి పాఠం మొదలుపెట్టింది. లలిత గీతం సంగీతంలా గమగాలతో పాడడం గమనించి ఆ పాట ఎలా శ్రావ్యంగా పాడచ్చో తను పాడి వినిపించింది కృష్ణవేణి.

సుశ్రావ్యమైన ఆవిడ స్వరం విని ముగ్ధురాలైపోయింది ఉష.

ఎంత అద్భుతమైన స్వరం ఈవిడది అనుకుంది.

ఏనాటికైనా నేను ఈవిడలా పాడగలనా అనుకుంది.

పాడాలి. బాగా సాధన చేస్తే పాడగలవు. చెవుల్లో మహలక్ష్మమ్మగారి స్వర్మ వినిపించింది.

అదో మంత్రంలా వినిపించింది ఉషకి.

పాట తరువాత ఆవిడ ఇల్లంతా తిప్పి చూపించింది. ఆవిడ చిన్నప్పటి ఫోటోలు, పెళ్ళినాటి ఫోటోలు గోడలనిండా ఫ్రేములు కట్టించి వున్నాయి. ఆవిడ అనేక వేదికల మీద పాటకచేరీ చేసి పొందిన సత్కారాలకు సంబంధించిన ఫోటోలు కూడా వున్నాయి.

ఆవిడ రేడియోలో కూడా పాడుతుందని తెలిసి "నేనూ పాడచ్చా" అని అడిగింది అప్రయత్నంగానే.

ఆవిడ నవ్వి "తప్పకుండా. కానీ, ఇప్పుడే కాదు" అంది.

సిగ్గుపడింది ఉషాకాంత.

అన్నప్రాసననాడే ఆవకాయ తినాలనుకోడంలా వుంది అనిపించింది ఆమెకి. తోటలో పూసిన కనకాంబరాలు, జాజులు, సంపెంగలు కలిపి మాలకట్టి ఉషకి ఇచ్చింది ఆవిడ.

"బంగారు తల్లిలా వున్నావు. నా కొడుకులకి ఇంకా పెళ్ళి వయసు రాలేదు. లేకపోతే నా కోడల్ని చేసుకునేదాన్ని" అంది నవ్వుతూ.

ఉష మొహం వాడిపోయింది.

ఆవిడ గమనించకుండా తలవంచుకుంది.

అక్కడే కొసరి, కొసరి తినిపిస్తూ కడుపునిండా భోజనం పెట్టింది.

ఆవిడ ఆప్యాయతకి చలించిపోయింది ఉష.

అమ్మ అన్నట్టు భగవంతుడు ఇలా అనేక రూపాల్లో నాకు సాయం చేస్తున్నాడు అనుకుంది.

సాయంత్రం ఐదు అవుతుండగా వచ్చింది సీత.

కాసేపు కబుర్లు చెప్పుకున్నాక కృష్ణవేణి ఇచ్చిన టీ తాగి, బిస్కట్లు తిని ఉషని తీసుకుని ఇంటికి బయల్దేరింది.

"ఎలా వుంది మొదటిరోజు?" అడిగింది సీత కారులో.

"చాలా మంచావిడ" మెరిసే కళ్ళతో చెప్పింది ఉష.

"వారానికి రెండు క్లాసులుంటాయి. నాకు వీలుకాకపోతే డ్రైవర్ తీసుకుని వెళ్తాడు నిన్ను " అంది సీత.

కృతజ్ఞతగా చూసింది ఉష.

సీత నవ్వింది.

**సీతకి** దాదాపు ప్రతిరోజూ ఏదో ఒక రికార్డింగ్ వుంటుంది. ఒకరోజు తెలుగు పాటలైతే మరో రోజు తమిళపాటలు. ప్రారంభంలో కొన్ని రోజులు తను రికార్డింగ్‌కి వెళ్ళేటప్పుడు ఉషని కృష్ణవేణి దగ్గర వదిలేసి వెళ్ళేది. కానీ, తను మరీ త్వరగా వెళ్ళాల్సి వస్తే మాత్రం పనిమనిషి మీనాక్షిని తోడిచ్చి పంపించడం మొదలుపెట్టింది. క్రమంగా కొన్ని రోజులు అలవాటు అయాక ఉష దారి బాగా గుర్తుపెట్టుకుని తనే బస్సెక్కి వెళ్ళడం మొదలుపెట్టింది. ఇప్పుడు ఉష ఒక్కతే వెళ్తోంది. సాయంత్రాలు మాత్రం తన రికార్డింగ్ త్వరగా అయిపోతే సీత వెళ్ళి కృష్ణవేణి దగ్గర కాసేపు కూర్చుని, ఉష నేర్చుకున్న పాటలు విని వెంట పెట్టుకుని తీసుకొస్తుంటుంది.

సీత ఇంట్లో వున్నంతసేపు ఉషతో కబుర్లు చెబుతూ సరదాగా వుంటుంది. ఆమె దగ్గర తను భయపడినట్లు కాకుండా సుఖంగా వుండడంతో ఉషకి బాగా చనువు స్వతంత్రం వచ్చేసాయి.

ఇప్పుడు కృష్ణవేణి దగ్గర కూడా ఉషకి బాగా చనువు ఏర్పడింది. ఆమె ఎంతో శ్రద్ధగా, మరెంతో ఆప్యాయంగా ఉషకి లలితగీతాలు నేర్పిస్తోంది. ఆ అమ్మాయి స్వరంలోని మాధుర్యం ఆమెని కట్టిపడేసింది. అందులోనూ ఆవిడ ఎంత శ్రద్ధగా నేర్పిస్తోందో అంతే శ్రద్ధగా ఆ అమ్మాయి కూడా నేర్చుకోవడంతో ఆవిడలో ఉత్సాహం ఇనుమడించింది.

ఆవిడకి సీత ఉషాకాంతని తీసుకొచ్చి తన దగ్గర దింపడం కొంచెం ఆశ్చర్యంగానూ, చిత్రంగానూ అనిపించింది. కారణం సీత చాలా అసూయాపరురాలు. తనకన్నా ఎవరూ వున్నతంగా ఎదగడం చూడలేదు. ఇంతకు ముందు కమల అనే గాయనిని నానా రకాలుగా హింసించి ఆమెకి అవకాశాలు రాకుండా చేయడంతో ఆమె వచ్చిన చోటుకే వెనక్కి వెళ్ళిపోయింది. అలాంటి సీత ఉషాకాంతని ఏ ధైర్యంతో తీసుకు వచ్చిందో ఆవిడకి అర్థం కాలేదు ఖచ్చితంగా ఇందులో ఏదో మర్మం వుందేమో అనిపించసాగింది. అందుకే ఆవిడ ఓ కంట సీతని కనిపెట్టి వుండడానికి నిశ్చయించుకుంది.

కృష్ణవేణి భర్త లాయర్ అవడంతో రెండు చేతులా సంపాదిస్తున్నాడు. అంతేకాక, ఆవిడకి పుట్టింటి తరపునా, అత్తింటి తరపునా కూడా బోలెడాస్తి వుంది. అందుకే ఆవిడ డబ్బుకోసం తన కళను వ్యాపారంగా మార్చుకోవాలని ఆశించలేదు. ఎప్పుడైనా ప్రత్యేకమైన వేదికల మీదా, రేడియోలో తప్ప మరెక్కడా ఆవిడ పాటలు పాడడానికి అంగీకరించదు. అంతేకాక, ఆవిడకి ఆడపిల్లలు లేరు ఇద్దరూ మగపిల్లలే అవడం చేత కూడా ఉషాకాంతని చూస్తుంటే వాత్సల్యం ఏర్పడింది.

ఆ అభిమానంతోటే ఆమెని ఇంట్లో పిల్లలా చూడసాగింది. ఉష కూడా ఆవిడలో మహలక్ష్మమ్మగారిని చూస్తూ ఆవిడకి దూరంగా వున్నానన్న బాధ మర్చిపోసాగింది.

మరో ఆరు నెలలు గడిచాయి. మహలక్ష్మి నుంచి వారానికో వుత్తరం వస్తోంది. ఉషని జాగ్రత్తగా వుండమని, అందరితో సఖ్యతతో మసలుకోవాలని, పెద్దవాళ్ళ పట్ల గౌరవంతో వుండాలని, అవన్నీ చదివిన ఉషాకాంతకి నవ్వొస్తుండేది. అమ్మకి తనింకా చిన్నపిల్లేనా అనుకుంటూండేది. తను పెద్దదవుతోందని, ప్రపంచాన్ని చూస్తోందని, ఎవరితో ఎలా మాట్లాడాలి? ఎవరితో ఎలా ప్రవర్తించాలి అనే విషయాలు తనకి బాగా తెలుస్తున్నాయని, తన గురించి చింతించవద్దని, ఆవిడ ఆరోగ్యం బాగా చూసుకోమని జవాబు రాస్తోంది. ఓరోజు కృష్ణవేణి ఇంట్లో వున్నప్పుడు మహలక్ష్మి ప్రస్తావన వచ్చి ఆవిడ దగ్గరకు తను చేరుకున్న దగ్గర్నించీ అన్ని విషయాలు చెప్పి కన్నీరు పెట్టుకుంది ఉష.

"అమ్మతో మాట్లాడి, అమ్మని చూసి చాలా రోజులైంది. ఒక్కసారి అమ్మ దగ్గరకు వెళతాను ఎలా వెళ్ళాలి?" అని అడిగింది.

ఉష కథ విన్న కృష్ణవేణి మనసు కరిగిపోయింది. "ఈసారి వుత్తరంలో ఆవిడకి ఫోన్‌లో మాట్లాడే సౌకర్యం వుంటే ఆ ఫోన్ నెంబర్ తెలుసుకోమని" చెప్పింది.

ఉష ఆ మాటకి పొంగిపోయింది. మర్నాడే మహలక్ష్మికి కరణంగారి ఫోన్ నెంబర్ ఇస్తే ఫోన్ చేస్తానని, తనకి ఆవిడ గొంతు వినాలని వుందని రాసింది.

మరో వారానికి మహలక్ష్మి కరణంగారి ఫోన్ నెంబర్ రాసింది.

ఆ నెంబర్ తీసుకుని ఆతృతగా కృష్ణవేణికి ఇచ్చి "అమ్మతో మాట్లాడొచ్చా?" అంది ఆశగా.

ఆవిడ నవ్వి ఆ నెంబర్ తీసుకుని ట్రంకాల్ బుక్ చేసింది. సరిగ్గా పది నిమిషాల్లో ఫోన్ కలవడంతో ఆపరేటర్ కనెక్షన్ ఇచ్చింది. రిసీవర్ కూడా పట్టుకోడం చేతకాని ఉష ఖంగారులో ఎలా మాట్లాడాలో తెలియక తత్తరపడుతుంతే కృష్ణవేణి ఆమె చేతులు పట్టుకుని రిసీవర్ ఎలా పట్టుకోవాలో నేర్పించింది.

ఫోన్ రింగవగానే కరణంగారి గొంతు వినిపించింది. "అమ్మాయ్ ఉషా ఎలా వున్నావు తల్లీ?" ఆప్యాయత నిండిన ఆయన స్వరం వినగానే ఉషకి కన్నీళ్ళాగలేదు.

"నేను బాగున్నాను బాబుగారూ. మీరెలా వున్నారు?" అంది రుద్ధమైన స్వరంతో.

"అందరు బాగున్నారు తల్లీ. సంగీతం పాఠాలు బాగా నేర్చుకుంటున్నావా? సినిమాల్లో పాడే అవకాశం వచ్చిందా?"

"లేదు బాబుగారూ ఇంకా రాలేదు నేనింకా నేర్చుకుంటున్నాను."

"బాగా నేర్చుకో పెద్దదానివై మా అందరి ఆశలు నెరవేర్చాలి. ఇదిగో అమ్మగారికిస్తున్నాను మాట్లాడు" అంటు ఆయన మహలక్ష్మి చేతికి ఫోన్ ఇచ్చాడు.

"ఉషా! తల్లీ ఎలా వున్నావు?" మహలక్ష్మి స్వరం వినిపించగానే ఉష బావురుమంది.

ఆవిడ ఖంగారు పడుతూ అంది "అయ్యో ఎందుకమ్మా ఏడుపు? ఏమైంది? నీకక్కడ బాగోలేదా? నిన్ను బలవంతంగా పంపించానా? ఏడవకు నీకు వుండాలనిపించకపోతే వచ్చెయ్"

"లే...లేదమ్మా అదేం లేదు కానీ, కానీ నిన్ను చూడాలని వుందమ్మా" వెక్కుతూ అంది ఉష.

ఆవిడ గుండె మెలితిప్పినట్టు అయింది. రుద్ధమైన స్వరంతో అంది "తప్పకుండా చూద్దువుగాని. నీ సంగీతం నేర్చుకోడం ఒక దారికి వచ్చాక నేను మనిషిని పంపిస్తాను తప్పకుండా వద్దువుగాని సరేనా? సీతగారు ఎలా వున్నారు? నీకు సంగీతం నేర్పే అమ్మగారు ఎలా వున్నారు?"

ఆవిడ ప్రశ్నలకి కళ్ళు తుడుచుకుని గొంతు సవరించుకుని చెప్పింది ఉష "సీతగారు బాగున్నారమ్మా. కృష్ణవేణిగారు చాలా మంచావిడ. ఆవిడలో నువ్వేకనిపిస్తుంటావు నాకు"

"పోనీలే నాకంతకన్నా ఏం కావాలి తల్లీ. జాగ్రత్తగా వుండు మంచి పేరు తెచ్చుకో. బాగా నేర్చుకుని వృద్ధిలోకి రా సరేనా?"

ఓ కన్నతల్లిలా ఆవిడ చేస్తున్న హితబోధ వింటూ మంత్రముగ్ధురాలిలా వుండిపోయిన ఉష అంది "తప్పకుండా మంచి పేరు తెచ్చుకుంటానమ్మా. నన్ను ఆదరించి ఇంత దూరం తీసుకుని వచ్చిన నీకు చెడ్డపేరు రానివ్వను."

వాళ్ళ మాటలు వింటున్న కృష్ణవేణి హృదయం ద్రవించిపోయింది. ఫోన్ పెట్టేసాక అంది ఉషతో "నీకు ఎప్పుడు కావాలంటే అప్పుడు నాకు చెబితే ట్రంక్‌కాల్ బుక్ చేస్తాను మాట్లాడొచ్చు సరేనా?"

ఉష ఆవిడ వైపు కృతజ్ఞతతో చూసింది.

మరికొంతకాలం గడిచింది. ఇప్పుడు ఉష ఇదివరకు కన్నా ఎంతో అద్భుతంగా పాడుతోంది. ఆమె లలితగీతాలు పాడుతుంటే వెన్నెల్లో ఎగిరిపడే సముద్రకెరటాల్లా ఎంతో వుల్లాసంగా, హాయిగా, ఆహ్లాదంగా అనిపిస్తుంది. తనకి అనుకోకుండా లభించిన శిష్యురాలు తనని మించిపోవడం కృష్ణవేణికి గర్వంగా అనిపించింది.

ఉషని రేడియోలో ఆడిషన్‌కి తీసికెళ్ళింది. సెలక్ట్ అవడమేకాక వెంటనే ఆమెకి అరగంట కార్యక్రమం తాలూకు కాంట్రాక్ట్ వచ్చింది.

ఉషాకాంత మురిసిపోయింది. సీత కూడా ఎంతో సంతోషించింది. ఒకరోజు వెంటపెట్టుకుని తీసుకెళ్ళి బ్యాంకు ఎకౌంట్ ఓపెన్ చేయించింది ఉషతో.

జీవితం ఎప్పుడూ ప్రశాంతంగా వుంటే మోనాటనస్‌గా అనిపిస్తుందేమో దేవుడికి.

ఉష జీవితంలో ఒక విషాదకరమైన రోజు వచ్చింది. తెల్లవారు ఝామున నాలుగున్నర అయిదు మధ్యలో సీతకి కృష్ణవేణి నుంచి ఫోన్ వచ్చింది. ఆ టైంలో తనకి ఫోన్ రావడం ఏంటా అని మంచి నిద్రలో వున్న సీత అయిష్టంగానే రిసీవర్ ఎత్తింది.

"సీతా! ఉషా వాళ్ళమ్మ మహలక్ష్మిగారు పోయారట నాకిప్పుడే ఫోన్ వచ్చింది" ఆదుర్దాగా చెప్పింది కృష్ణవేణి.

సీత నివ్వెరపోయింది. మహలక్ష్మమ్మ పోయారా? నిద్రమత్తు ఎగిరిపోయింది.

"ఎప్పుడు? ఎలా?" అడిగింది.

"తెలియదు కరణంగారు ఫోన్ చేసి వెంటనే ఉషని పంపించమన్నారు."

సీత చేతిలో రిసీవర్ జారిపోయింది.

ఆరోజు కళ్ళనిండా కోటి ఆశలతో "మా ఉషని మీ అంతటిదాన్ని చేయాలమ్మా. నా బిడ్డని మీ చేతుల్లో పెడుతున్నాను" అంటూ ఉష చేయి తన చేతుల్లో పెట్టిన మహలక్ష్మమ్మ రూపం కనిపించింది.

ఆవేదనతో మనసంతా నిండిపోయింది. నెమ్మదిగా మంచం దిగి, ఉష పడుకున్న గదిలోకి వెళ్ళింది. తలుపులు ఓరగా వేసుకుని పడుకుంది. తలుపు తెరుచుకుని మంచం దగ్గరగా వెళ్ళింది సీత.

ఆదమరచి ప్రశాంతంగా నిద్రపోతున్న ఉషని చూసింది.

ఉన్న ఒక్క ఆత్మీయురాలు, కన్నతల్లి లాంటి మహలక్ష్మమ్మని పోగొట్టుకున్న ఈమె ఇప్పుడు అనాధ. పూర్తిగా అనాధ.

తనిప్పుడు నిద్రలేపి ఆవిడ పోయిందన్న వార్త చెబితే ఈమె పరిస్థితి ఏంటి?

వణుకుతున్న చేతుల్తో ఉష భుజం మీద తట్టింది.

ఆమె కదల్లేదు. ఏదో తీయని కల కంటున్నట్టుగా బెడ్‌లైట్ వెలుగులో ఆమె పెదవుల మీద తేలుతున్న పల్చని నవ్వు తెరలు. బాధగా అనిపించింది సీతకి.

కొంచెం గట్టిగా తడుతూ "ఉషా" అని పిలిచింది.

ఉలిక్కిపడి లేచింది ఉష.

ఎదురుగా లేత వెలుతురులో కనిపిస్తున్న సీతని చూడగానే గభాల్న దుప్పటి విసిరేసి లేచి కూర్చుని అడిగింది "ఏంటండి?"

అదురుతున్న గుండె చిక్కబట్టుకుని అంది సీత "లేమ్మా మీ వూరికి వెడదాం."

"మా వూరికా? ఎందుకు?" ఆశ్చర్యంగా చూసింది ఉష.

"లేచి హాల్లోకి రా చెప్తాను" అంటూ సీత వడి, వడిగా గదిలోంచి బైటకి వచ్చేసింది.

ఆవిడ వెనకాలే అయోమయంగా వచ్చిన ఉష లైటు వెలుతురులో సీత కళ్ళల్లో చిప్పిలుతున్న కన్నీరు, ఆవిడ స్వరంలోంచి వచ్చిన మాట విని పిడుగు మీద పడినట్టు కెవ్వుమంది.

"మీ...మీరు చెప్పేది ని.....నిజమేనా?"

"అవును ఇప్పుడే కృష్ణవేణిగారికి ఫోన్ వచ్చిందిట. త్వరగా స్నానం చేసిరా.. కారులో వెడదాం నేను డ్రైవర్‌కి కబురు చేస్తాను" అంటూ సీత పనిమనిషి, క్వార్టర్స్ వైపు వెళ్ళింది.

మరో అరగంటలో గుండె పగిలి ఏడుస్తున్న ఉషని తీసుకుని కారులో కూర్చుంది సీత.

కారు బయల్దేరింది.

మహలక్ష్మమ్మ పార్థివదేహం మీద పడి గుండె పగిలేలా ఏడుస్తున్న ఉషని చూస్తున్న అందరి హృదయాలూ ద్రవించిపోయాయి. ఎలా ఓదార్చాలో కూడా ఎవరికీ అర్థం కాలేదు. చాలాసేపు అందరూ విగ్రహాల్లా చలనం లేకుండా కూర్చుండిపోయారు. చివరికి సీత తేరుకుని ఉషని దగ్గరకు తీసుకుని ఓదార్చింది.

"ధైర్యంగా వుండాలి నువ్విలా ఏడుస్తుంటే ఆవిడ ఆత్మశాంతిస్తుందనుకుంటున్నావా? లేమ్మా  లేచి కర్తవ్యం ఆలోచించు. చూడు పెద్దవాళ్ళంతా వున్నారు. వాళ్ళ పనులు వాళ్ళు చేయడానికి సహకరించు" అంటూ సాంత్వన వచనాలు చెబుతూ ఉషని కొద్దిగా మామూలు స్థితికి తీసుకువచ్చింది.

మహలక్ష్మమ్మగారి భర్త ఇటీవలే పోయాడని, ఆ దిగులుతో ఆవిడ మంచం పట్టిందని, ఆ విషయం ఉషకి తెలియకుండా జాగ్రత్త పడుతూ మాట్లాడేదని, అనుకోకుండా గుండెపోటుతో చనిపోయిందని చెప్పారు కరణంగారు.

పొద్దు పోవడంతో మర్నాడు ఉదయం పదిగంటలకి ఆవిడ అంతిమ యాత్ర మొదలైంది.

ఉషని అక్కడే వదిలి సీత వెళ్ళిపోయింది.

మహలక్ష్మమ్మ కర్మకాండలు దగ్గరుండి జరిపించారు కరణంగారు. ఊళ్ళో ఆవిడని ఎంతో అభిమానించి, గౌరవించే కుర్రవాళ్ళు ఆవిడ మానసపుత్రుల్లా అన్ని సంస్కారాలు పద్ధతిగా చేసారు. పదమూడు రోజులు అయిపోయాయి. ఆవిడ ఇల్లు, ఆ ఇంట్లో ఆవిడ దగ్గర పనిచేసిన పనిపిల్ల, ఆవిడ ఆదరణకు పాత్రురాలై ఆవిడ కన్నకూతురిలా ప్రేమలందుకున్న ఉషాకాంత మిగిలారు. ఆవిడ ఎటువంటి వీలునామా రాయలేదు. ఆవిడ వారసులెవరో ఏమిటో వివరాలు తెలియలేదు. అప్పుడప్పుడు వచ్చి పలకరించిపోయే భర్త మాత్రమే అందరికీ తెలుసు. ఆయన ఏర్పాటు చేసుకున్న రెండో భార్య, ఆమె పిల్లల గురించిన వివరాలు ఎవరికీ తెలియదు. ఆ ఇంటికోసం ఎవరన్నా వస్తారేమో అప్పుడే ఆలోచించవచ్చు అని ఇంటికి తాళం వేసి తాళాలు తన దగ్గర పెట్టుకున్నారు కరణంగారు. ఆ ఊరి మనిషే కాబట్టి తన ఇంటికి వెళ్ళిపోయింది పనిమనిషి.

ఆ ఇంట్లో మిగిలిన తన తాలుకు వస్తువులు కొన్ని, మహలక్ష్మమ్మ ఉష పేరు రాసి దాచిన కొన్ని నగలు, పట్టుచీరలు, ఫోటోలు, కొంత వెండి సామాను పెట్టిన పెట్టె ఆమెకి ఇచ్చారు కరణంగారు.

తన పాదాలకు నమస్కరిస్తున్న ఉషాకాంతని లేవనెత్తి అక్కున చేర్చుకుంటూ "నీకు ఎప్పుడు రావాలనిపించినా మేమున్నాం తల్లి నీకెవరూ లేరని అనుకోకు. మా ఇంటికి వస్తూ వుండమ్మా. మీ అమ్మ కోరిక తీర్చి నువ్వు గొప్ప గాయనివి కావాలి అంటూ దీవించారు" కరణం దంపతులు.

ఉషాకాంత పగిలిన గుండెతో, ఆగని కన్నీటితో కరణంగారి దగ్గర సెలవు తీసుకుని మద్రాసు బండెక్కింది.

శూన్యమైన మనసుతో విషాదం మూర్తీభవించి తిరిగి వచ్చిన ఉషని దగ్గరకు తీసుకుని ఓదార్చింది సీత. "బాధపడకు ఉషా! మీ అమ్మ మీద నీ ప్రేమ ఋజువు చేయాలంటే నువ్వు గాయనిగా ఎదగాలి. కాబట్టీ ఆవిడకి ఎక్కడికీ పోలేదు. నీ గుండెల్లో పీఠం వేసుకుని నీ దగ్గరకే వచ్చారు. ఆ విషయం దృష్టిలో పెట్టుకో" అంది.

ఉషాకాంత మాట్లాడలేదు. మధ్యాహ్నానికి కృష్ణవేణి వచ్చింది.

ఉషని దగ్గరకు తీసుకుని "బాధపడకు ఉషా! నేనున్నాను, సీతగారున్నారు. నువ్వు ఒంటరిదానివని అనుకోకమ్మా. జరిగింది మర్చిపోయి నీ దృష్టి అంతా నీ ఎదుగుదల మీద పెట్టు. రేపట్నించీ మాములుగా క్లాసులకి రా" అంది.

రోజులు గడిచిపోతున్నా ఉష మాములు మనిషి కాలేకపోతోంది.

ముందే తక్కువ మాట్లాడే ఉష ఇప్పుడు పూర్తిగా మాట్లాడటం మానేసింది. ఒంటరిగా కూర్చుని కన్నీళ్ళు పెట్టడం అనేకసార్లు గమనించింది సీత. ఎంత చెప్పినా ఉష మాత్రం మాములు స్థితికి రాలేకపోతోంది. ఆవిడకి ఏం చేయాలో అర్థం కాలేదు.

అనుకోకుండా ఒక సినిమాలో కోరస్ పాడడానికి స్వరాలు కావాల్సి వచ్చింది. అదే అదనుగా ఉషని వ్యాపకంలో పడేయడానికి అవకాశంగా భావించి ఉషని తీసుకుని స్టూడియోకి వెళ్ళింది.

ఒక సినిమాలో హీరోయిన్ సీమంతం సీన్‌లో పేరంటాళ్ళు అందరూ కలిసి పాడే సీమంతం పాటలో ఒక చరణం పాడించింది సీత.

ముందు కొద్దిగా అపశృతులు దొర్లినా రెండుసార్లు టేక్ తీసుకున్నాక మూడోసారి అద్భుతంగా పాడడంతో సంగీత దర్శకుడు చాలా ఆనందించాడు. కొత్త వాయిస్, లేతగా, మధురంగా వుంది. ఈ అమ్మాయిచేత ముందు, ముందు పాడిద్దాం అని చెప్పాడు సీతకి.

సీత చాలా ఆనందించింది.

సాయంత్రం ఇంటికి వెళ్ళాక ఉషని ముద్దుపెట్టుకుంటూ "నిన్ను సిఫారసు చేసినందుకు నా పరువు నిలబెట్టావు ఉషా. చాలా బాగా పాడావు. త్వరలో నీకు మరిన్ని అవకాశాలు వస్తాయి" అంటూ అభినందించింది.

అనుకోకుండా తనకి లభించిన అవకాశం, స్టూడియో వాతావరణం, కొత్త వ్యక్తులతో పరిచయాలు నెమ్మదిగా ఉషాకాంత దుఃఖాన్ని మర్చిపోసాగింది.

తిరిగి తన సంగీతంతో పాటుగా లలితగీతాలు కూడా సాధన చేయడం ప్రారంభించింది.

మరో రెండు నెలలు గడిచాయి.

కృష్ణవేణిద్వారా మరో రెండు రేడియో కార్యక్రమాలు వచ్చాయి. ఒక వేదిక మీద ఆవిడతో పాటుగా రెండు పాటలు పాడింది.

చెక్కులు తీసుకొచ్చి తన అకౌంట్‌లో వేసుకుంటోంది.

ఆమె బ్యాంకులో నాలుగువేల చిల్లర జమ అయింది.

ఉషకి ఆ డబ్బు ఏం చేయాలో అర్థం కాలేదు.

సీత ఇంట్లో వుంటోంది, అక్కడే తింటోంది. ఎక్కడికన్నా వెళ్ళాలంటే సీతతోకానీ, కృష్ణవేణితోకానీ కారులో వెళ్తోంది. ఇంక తనకేం ఖర్చులున్నాయి అనిపించింది ఉషకి.

కాకపోతే తన దగ్గర మంచి చీరలు లేవన్న విషయం కృష్ణవేణి చెబితే తెలిసింది.

అవునుకదా అనుకుంది. "నీ దగ్గర డబ్బులున్నాయిగా ఉషా. నీకు తీరిక వున్నప్పుడు ఆ డబ్బులు తీసుకురా బజారుకెళ్ళి నాలుగు చీరలు కొనుక్కుందువుగాని, పదిమందిలోకి వెళ్ళేటప్పుడు ఇలాంటి బట్టలు వేసుకోకూడదు కొంచెం మంచివి వుండాలి అని చెప్పింది కృష్ణవేణి.

ఆవిడ చెప్పింది సబబుగానే తోచింది ఉషకి. మర్నాడు సీతతో అంది "బ్యాంకు నుంచి కొన్ని డబ్బులు తీసుకోవాలక్కా. ఎలా తీసుకోవాలో చెప్తావా?"

సీత ఆశ్చర్యంగా చూసింది "ఎందుకిప్పుడు" అడిగింది.

ఉష కృష్ణవేణి చెప్పిన విషయం చెప్పింది.

"ఓ..అలాగా తప్పకుండా తీసుకో కృష్ణవేణిగారు చెప్పింది నిజమే అంటూ తన దగ్గర దాచిన చెక్కుబుక్కు తెచ్చి ఇచ్చి సంతకం తీసుకుని "ఎంతకావాలి" అనదిగింది సీత.

"నాకు తెలియదు చీరలు ఎంత అవుతాయో" అంది ఉష.

"సరేలే నే ను తెప్పిస్తాలే డబ్బులు"~అంటూ చెక్కు తీసుకుని వెళ్ళిపోయింది సీత.

ఆ సాయంత్రం వేయి రూపాయలు తెచ్చి చేతిలో పెట్టింది.

మర్నాడు కృష్ణవేణితో కలిసి వెళ్ళి నాలుగు సిల్కు చీరలు కొనుక్కుంది ఉష.

మరో వారం రోజులకి సీత ద్వారా ఉషకి కబురొచ్చింది స్టూడియోకి రావాలని కొత్త సినిమాలో పదమూడేళ్ళ పిల్ల పాత్రకి పాట పాడాలని.

ఉత్సాహంగా వెళ్ళింది ఉష.

రెండు గంటలు రిహార్సల్స్ తరువాత చెవుల్లో హెడ్‌ఫోన్స్ పెట్టుకుని పాట పాడుతోంటే తనని తాను మర్చిపోయింది.

మొదటి షాట్‌లోనే ఓకె అవడంతో మ్యూజిక్ డైరెక్టర్ ముత్తుస్వామి ఆమెని అభినందనలతో ముంచెత్తాడు. ఇప్పటినుంచి తన సినిమాల్లో "ఉషా"నే గాయనిగా వుంటుందని చెప్పి వేయిరూపాయలు చేతిలో పెట్టాడు.

**అప్పటివరకూ** చెప్పి హఠాత్తుగా చెప్పడం ఆపేసింది ఉషాకాంత.

తనని తాను మర్చిపోయి ఓ అద్భుతమైన దృశ్యం చూస్తున్నట్టుగా కూర్చున్న మౌనికకు హఠాత్తుగా దృశ్యం కనుమరుగైపోయినట్టు అనిపించింది.

ఏదో లోకంలోంచి బైటపడినట్టుగా ఆవిడ వైపు చూసింది.

ఉషాకాంత అలిసిపోయినట్టుగా మంచం మీద వెనక్కివాలిపోయి పడుకుని కళ్ళుమూసుకుంది.

మౌనిక కొన్ని క్షణాలు ఆవిడ ఏదన్నా చెబుతుందేమో అన్నట్టు ఎదురుచూసి ఆవిడ ఏమీ మాట్లాడకపోవడంతో అక్కడినుంచి లేచి గది బైటకి వచ్చేసింది.

తన గదిలోకి వెళ్ళిపోయి చెల్లెలికి ఫోన్ చేసింది. వెంటనే రిసీవ్ చేసుకుంది సుప్రియ.

"అక్కా!ఎలా వున్నావు?" ఆత్రంగా అడిగింది.

"నేను బాగున్నాను. అమ్మా, నువ్వు ఎలా వున్నారు?" అడిగింది మౌనిక.

"బాగున్నాంలే కానీ, అమ్మ అడుగుతోంది నిన్ను. ఓసారి రమ్మని చెప్పు అంటోంది. న్యూ ఇయర్ సెలబ్రేషన్‌కి ఓసారి నువ్వు ఇక్కడికి రాగలిగేలా ప్లాన్ చేసుకో."

"ఊహూ న్యూ ఇయర్ సెలబ్రేషన్‌కి మీరే హైదరాబాద్ వస్తారు."

"మేమా? ఇంపాసిబుల్"

"ఇంపాసిబుల్ పాసిబుల్ చేస్తుంది మౌనిక"

"ఏంటక్కా నీ ధైర్యం?"

"న్యూ ఇయర్‌కి పెద్దమ్మ కాన్సర్ట్ వుంటుంది శిల్పకళావేదికలో. ఆ రోజు మనమంతా కలుస్తాం. ఆ తరవాత అందరం కలిసి వుంటాం."

"నిజమా? నువ్వెళ్ళి నెలకూడా కాలేదుగా."

"అవసరం లేదు. ఆర్నెల్లు టార్గెట్ అదే ఫైనల్ కాదు. ఈలోగానే పెద్ద ఇంట్లోనే కాదు. ఆవిడ మనసులో కూడా నాకో స్థానం లభించింది. ఇప్పుడు నేనేం చెప్పినా ఆవిడ కాదనదు ఆ నమ్మకం నాకుంది."

"అక్కా విభ్రాంతిగా పిలిచింది సుప్రియ నిజమేనా నువ్వు చెప్తున్నది నమ్మమంటావా?"

"నూటికి నూరుపాళ్ళు" మౌనిక స్వరంలో కాన్ఫిడెన్స్.

"అయితే అమ్మకి చెప్పేయనా?"

"చంపుతాను. విసుక్కుంది. సస్పెన్స్ రివీల్ చేస్తావా? ఒద్దు వాళ్ళిద్దర్నీ ఒక మంచి సందర్భంలో కలిపి వాళ్ళ రియూనియన్ ఒక మెమరబుల్ ఇన్సిడెంట్‌గా చేస్తా. అందాకా చెప్పావంటే చంపుతా."

సుప్రియ అక్క స్వరంలో వినిపించిన గమ్మత్తైన భావానికి నవ్వింది. "సరేలే చెప్పను" అంది.

"పెద్దమ్మ చాలా కష్టాలు పడిందే ఆవిడ కథ వింటోంటే ఏడుపు వస్తోంది."

"అవునా? పాపం."

"సరేలే వుంటాను. మళ్ళీ రెండు రోజుల్లో కాల్ చేస్తాను బై."

"బై అక్కా."

మౌనిక ఫోన్ డిస్కనెక్ట్ చేసి బట్టలు మార్చుకుని మంచం మీద వాలింది.

మర్నాడు సాయంత్రం ఉషాకాంత గదిలో మౌనిక ఆవిడ కొనసాగించబోయే ఆత్మకథ వినడానికి ఆసక్తిగా, వుద్వేగంగా ఎదురుచూస్తూ కూర్చుంది.

ఉషాకాంత పడకగది చాలా విశాలంగా వుంటుంది.

ఒక సింగిల్‌కాట్, దానికి దోమతెర. ఓ పక్కగా రెండు సోఫాలు, చిన్న టీపాయ్. ఓ మూల ఫ్లవర్‌పాట్. గదిలో సౌండ్ సిస్టమ్ వుంది. ఒక పాతకాలం నాటి గ్రామఫోన్ గోడకి ఆన్చి వుంది.

పరిసరాలు పరికించడం మానేసి "చెప్పండి మేడమ్" అంది మౌనిక ఉషాకాంత వైపు చూసి.

ఆవిడ నవ్వింది. "నా కథ నీకు చాలా ఆసక్తిగా వున్నట్టుందే"

"ఆసక్తిగా కాదు. స్ఫూర్తినిచ్చేదిగా వుంది."

"అలాగా" అన్నట్టు నవ్వింది.

కొన్ని క్షణాలు మౌనిక వైపు చూసి అంది "ఇప్పటివరకూ మనుషుల్లో మంచితనం చూసావు. అదొక కోణం. ఇప్పుడు నేను చెప్పబోయే విషయాలు విన్నాక మనుషుల్లో ఇలాంటి వాళ్ళు వుంటారా అని ఆశ్చర్యపోతావు."

"అంటే?" భృకుటి ముడిచింది మౌనిక.

ఆవిడ గట్టిగా శ్వాస తీసుకుని చెప్పసాగింది.

"కృష్ణవేణిగారి శిష్యరికంలో నేనొక మంచి గాయనిగా తీర్చిదిద్దబడ్డాను. నాకు తెలియని ఎన్నో మెలుకువలు నేర్చుకున్నాను. ఆవిడకి ఏమిచ్చినా ఋణం తీర్చుకోలేను. కానీ, ఆవిడ ఋణం తీర్చుకోకుండానే ఆవిడ నా దగ్గర శాశ్వతంగా సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

ఓ పక్క మహాలక్ష్మమ్మగారి మరణంలోని విషాదాన్ని నేను మర్చిపోకముందే కృష్ణవేణిగారి మరణం నన్ను కృంగదీసింది. నన్ను ఓదార్చేవాళ్ళు కూడా లేరిప్పుడు. ఆ బాధ తట్టుకోడానికి నా నియమాలను తోసిపుచ్చి ఏ పాట పాడడానికైనా సిద్ధపడ్డాను. నాకు ఏదన్నా శాంతి లభిస్తుందంటే అది కేవలం రికార్డింగ్‌లో మాత్రమే. నెమ్మదిగా పుస్తకాలు చదవడం కూడా అలవాటు చేసుకున్నాను.

రికార్డింగ్ లేనప్పుడు సాహిత్యం చదువుకునేదాన్ని. నెమ్మదిగా ఇంగ్లీషు కూడా నేర్చుకున్నాను.

ఇంక సీతగారు. ఆవిడ నన్ను మద్రాసు తీసికెళ్ళడం, కృష్ణవేణిగారికి పరిచయం చేయడం, సినీ ఫీల్డుకి పరిచయం చేయడం ఇవన్నీ ఒక ఎత్తు. ఇవన్నీ చేయడంలో ఆవిడకి ఏ స్వార్థమూ లేకపోవచ్చు. ఎలాంటి అనుమానాలు, అసూయలు లేకుండి వుండచ్చు. కానీ," ఆవిడ ఆగిపోయింది.

మౌనిక వుగ్గబట్టుకుని వినసాగింది. ఏం జరిగి వుంటుంది? ఇప్పటిలా ఆ రోజుల్లో కూడా అసూయాద్వేషాలు, ఎదుటివాళ్ళు పైకొస్తుంటే రానివ్వకుండా అడ్డుపడడం, తన వున్నతికి ఎవరూ అడ్డురాకుండా అందర్నీ తొక్కుకుంటూ వెళ్ళిపోడం ఇవన్నీ వుండేవా?

ఆవిడ తిరిగి చెప్పడం ప్రారంభించింది.

"ఎప్పుడైతే నాకు పరంపరగా అవకాశాలు రావడం మొదలైందో సీతగారికి తగ్గిపోడం ప్రారంభం అయింది. పరిశ్రమలో అప్పటికే కొన్ని విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. సినిమా కథల్లో మార్పు వచ్చినట్టే సాహిత్యంలో మార్పులు రాసాగాయి. కొత్త, కొత్త కళాకారులు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. ఆ సందర్భంలో చిన్న పిల్లలకి పాడడానికి సీతగారి గొంతు సరిపోలేదు. అప్పటికే ఆవిడకి యాభై దాటాయి.

కొత్తనీరు రావడం, పాతనీరు కొట్టుకుపోవడం ప్రకృతి సహజం. ఈ ధర్మాన్ని, ఈ సూత్రాన్ని జీర్ణించుకునే హృదయవైశాల్యం ఆవిడలో వున్న లోటు. అందుకే అకారణంగా నా మీద ద్వేషం పెంచుకోడం మొదలైంది.

ఆవిడలో నా పట్ల వున్న సానుభూతి, అభిమానం స్థానంలో స్వార్థం, అసూయ మొదలయాయి. అయితే అవి నాకు తెలిసేలా ఎప్పుడూ ప్రవర్తించలేదు. ఎంతో ప్రేమగా, ఆత్మీయంగా వుంటూ, నాకు సాయం చేస్తూనే నా మీద పెత్తనం, అధికారాలు తీసుకుంది.

నా అమాయకత్వం ఆధారంగా చేసుకుని పరిశ్రమ గురించి కొందరు ప్రముఖుల గురించి నాకు చెడుగా చెప్పడం ప్రారంభించి, 'అన్ని అవకాశాలు ఒప్పుకోవద్దు చులకనైపోతావు నీ బలహీనత ఎవరు కనిపెట్టినా నిన్ను వాడుకోడానికి చూస్తారు' అంటూ లేని పోని పుకార్లు లేవదీసింది. నిజమేనేమో అనుకున్నాను. ఆవిడ చెప్పినట్టే చేయసాగాను. కాకపోతే నన్ను సొంత సోదరిలా చూసే మునిస్వామిగారు నాలో కలిగిన భయాన్ని తుడిచేసారు.

అంతేకాక, పరిశ్రమలో ఆవిడకి అనుకూలంగా వుండే కొందరి ద్వారా నాకు అవకాశాలు రాకుండా అడ్డుకోవాలని చూసింది.

అయితే దైవం నా పట్ల వుండడంతో ఆవిడ ప్రయత్నాలు ఫలించలేదు. నా గురించి తెలిసినవాళ్ళంతా నన్ను ప్రోత్సహిస్తునే వచ్చారు.

మెల్లగా ఆవిడకి పూర్తిగా అవకాశాలు పోయాయి. ఆవిడ ఆదాయంం లేదు.

అప్పటికే నా ఆదాయం పెరిగింది. నా బ్యాంకు ఎకౌంట్ ఆవిడే చూసుకునేది. ఆవిడ అకౌంటెంట్ నా ఆదాయం లెక్కలు చూడడం, అతనే ఇన్‌కంట్యాక్స్ చూడడంలాంటివి చేసేవాడు. ఆవిడ ఎలా మారిన నేను మాత్రం ఆవిడనే నమ్మాను. రికార్డింగ్‌కి వెళ్ళిరావడం చెక్కు తీసుకొచ్చి ఆవిడకి ఇవ్వడం, నాకేదన్నా డబ్బు కావాలంటే చెక్కు సంతకం చేసిస్తే ఆవిడే తెప్పించేవారు. నాకోసం ఒక కొత్తకారు కొన్నారు. నాకు పట్టుచీరలు కొన్నారు. నగలు మహాలక్ష్మమ్మగారిచ్చినవి వున్నాయి అవే వేసుకునేదాన్ని. ఇద్దరూ కలిసి ఏం చేసారో నాకు తెలియదు నా దగ్గర వుండాల్సిన డబ్బుకన్నా చాలా తక్కువ కనిపించింది బ్యాంక్‌లో. అది కూడా నేను అనుకోకుండా నా పాస్ బుక్ చూడడం తటస్థించింది."

ఉషాకాంత క్షణం ఆగి తిరిగి ప్రారంభించింది. "నేనుండేది సీతగారింట్లోనే కాబట్టి తిండి ఖర్చు ఏముండేదికాదు. అయితే ప్రారంభంలో ఎలా వున్నా నేను సంపాదించడం మొదలుపెట్టాక నా తిండి ఖర్చుకి కొంత డబ్బు నేనావిడకి ఇవ్వాలన్న ప్రాథమిక సూత్రం నాకు తెలియలేదు. అలాగని ఇవ్వకూడదన్న నియమమూ లేదు. ఆవిడా అడగలేదు. నేను సంతకం చేసిచ్చే బ్లాంక్ చెక్ మీద ఎంత అమౌంట్ రాయాలో ఆవిడే రాసేవారు. అదెంత? ఏం చేసారు వగైరా విషయాలు నేనెప్పుడూ పట్టించుకోలేదు.

కాలం గడుస్తోంది. నేనూ అన్ని విధాలుగా ఎదిగాను.

వయసుతోపాటు మానసిక వికాసం కలగడం సహజం. నాలో కొత్త ఆలోచనలు రాసాగాయి. అనుకోకుండా ఒసారి అనిపించింది నేనెంతకాలం ఈ ఇంట్లో వుంటాను అని. బాగానే సంపాదించాను. నేను చిన్న ఇల్లు కొనుక్కోవచ్చుకదా అనుకున్నాను. ఆ విషయం అదే రోజు సీతగారితో చెప్పాను. ఆవిడ మొహం మాడిపోయింది. 'ఇల్లు కొనుక్కునేంత డబ్బు నీ దగ్గర ఎక్కడుంది? ' అంది.

నేను నిర్ఘాంతపోయాను. 'అదేంటి' అన్నాను.

"అదేంటి అంటే నేనేం చెప్పను? నువ్వే చూసుకో నీ అకౌంట్‌లో ఎంతుందో తెలుస్తుంది? " అంటూ పాస్‌బుక్ నా ఒడిలో విసిరేసి వెళ్ళిపోయింది.

తీసి చూసాను. చాలా తక్కువ బ్యాలన్స్. డిపాజిట్లు, విత్‌డ్రాలు అన్నీ చూసాను. లక్షల డిపాజిట్లు, విత్‌డ్రా చేసినప్పుడల్లా పాతిక వేలు, యాభైవేలు ఏం చేసానింత డబ్బు? నాకేం ఖర్చులున్నాయి? నాకర్థం కాలేదు. అకౌంటెంట్‌గారిని పిలిచి అడిగాను.

"ఆయన నాకేం తెలుసమ్మా మీరు ఎంతకి చెక్ ఇస్తే అంత డ్రా చేసుకొచ్చాను" అన్నాడు.

మతిపోయింది నాకు. సీతగారిని అడగడానికి ధైర్యం సరిపోలేదు.

అయినా కొంచెం ధైర్యం కూడదీసుకుని అడిగాను.

"ఆవిడ శివంగిలా అరిచింది. నీకు సాయం చేసి నా మెడకి వురి బిగించుకున్నాను. నా ఆదాయం పోయింది. ఇంటిఖర్చులు ఎవరు భరిస్తారు? ఇన్నేళ్ళ నుంచి నిన్ను మేపడం లేదా నేను. అన్నీ వూరికే వస్తాయా? నీ డబ్బుతో నేనేం ఆస్తులు కొనుక్కోలేదు. నీ ఖర్చులకే వాడాను. ఇకనుంచీ నాకేం సంబంధం లేదు. నీ దారి నువ్వు చూసుకో" అంటూనే అక్కడినుంచి వెళ్ళిపోయింది.

నిర్ఘాంతపోయాను. నేనేం తప్పుచేసానో నాకర్థం కాలేదు. ఇన్నేళ్ళ అనుబంధం ఒక్క మాటతో తెగిపోయింది.

ఉన్న డబ్బుతో ఒక అద్దె ఇల్లు తీసుకుని వెళ్ళిపోయాను. ఇప్పుడు నా మీద కొత్త బాధ్యత. నేనిల్లు కొనుక్కోవాలి. అందుకు బాగా సంపాదించాలి. సినిమాలో పాడడమేకాక, కచేరీలు కూడా ఇవ్వడం మొదలుపెట్టాను. ఇలా కొంతకాలానికి నిలదొక్కుకుని మద్రాస్‌లో ఇల్లు కొనుక్కున్నాను.

కీర్తి, డబ్బు పుష్కలంగా లభించాయి. నేను కోరకుండానే నాకెన్నో పురస్కారాలు ఎన్నో సన్మానాలు.

అయితే కాలం ఒక్కలా వుండదు. క్రమంగా పరిశ్రమలో మార్పులొచ్చాయి. ప్రజల అభిరుచులకు అనుగుణమైన సంగీతం మొదలైంది. కొత్త, కొత్త గాయనీ, గాయకులు వచ్చారు. పోటీ మొదలైంది. నాది దూసుకుపోయే స్వభావం కాదు. ఎదుటివాళ్ళని తోసేసి ముందుకు సాగిపోవాలన్న ఆరాటము లేదు. అంత శక్తికూడా లేదు. క్రమంగా నేను వెనకబడుతూ వచ్చాను. కొంతకాలానికి అవకాశాలు బాగా తగ్గిపోయాయి. నాకన్నా మధురంగా పాడే గాయనీమణులు ఎందరో ఇండస్ట్రీలోకి వచ్చారు. తప్పదు. ఈ మార్పుని నేను హుందాగా స్వీకరించాలి.

పరిశ్రమ హైదరాబాదుకి తరలిరావడం మొదలైంది. నేను కూడా మద్రాసులో ఇల్లమ్మి, తెలిసిన వాళ్ళద్వారా హైదరాబాదులో ఈ ఇల్లు కొనుక్కున్నాను. సంపాదించిన ఆస్తిని కాపాడుకుంటూ మితమైన కోరికలతో, నిరాడంబరమైన జీవితం గడుపుతూ కాలం గడుపుతున్నాను.''

మౌనిక హఠాత్తుగా వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టింది.

ఉషాకాంత ఆశ్చర్యంగా చూసింది. ''ఎందుకమ్మా? నువ్వెందుకు ఏడుస్తున్నావు?'' అడిగింది మౌనికను దగ్గరకు తీసుకుని.

వెక్కుతూ అంది మౌనిక ''ఎన్ని కష్టాలు పడ్డారు పెద్దమ్మా!''

ఆవిడ నవ్వింది ''జీవితం అంటే కష్టసుఖాల కలయిక కదమ్మా.''

''కానీ, మీ జీవితంలో కష్టాలకాలం ఎక్కువే కదూ''

''అది నా రాత.''

''లేదు. అలా అనకండి స్వార్థపరులు, దుర్మార్గులు రాసిన రాత.''

''ఎవరు రాసినా రాతేగా'' విరక్తిగా అంది ఉషాకాంత.

''పోనీలే ఇప్పుడు నాకే కష్టాలు లేవు. నేను జీవన సంధ్యలో వున్నాను. ఈ జీవితం ఇలా గడిచిపోతే చాలు.''

అవును మీకే కష్టాలు వుండవు ధృఢంగా అనుకుంది మౌనిక.

కొత్త సంవత్సరం రావడానికి పదిరోజులే వుంది. మౌనిక ఉషాకాంతకి తెలియకుండా సాంస్కృతిక సంస్థల వారితో మాట్లాడి ఆవిడ అంగీకరించిన కాన్సర్ట్‌కి ఏర్పాట్లు ఆర్భాటంగా చేస్తోంది.

ఈ లోపల సుప్రియతో తరచు మాట్లాడుతూ డిసెంబర్ 31 నాటికి వాళ్ళిద్దరూ హైదరాబాదు రావడానికి టిక్కెట్స్ రిజర్వ్ చేయించింది. వాళ్ళని నిస్సంకోచంగా ఉషాకాంత ఇంటికి తీసుకురావచ్చు. కానీ, తల్లినీ, పెద్దమ్మనీ కలిపే శుభసందర్భం ఎంతో ఉత్కంఠగా వుండాలి. అందుకే హోటల్ రూమ్ బుక్ చేసింది.

''ఎందుకిప్పుడు హైదరాబాదు మనకి అక్కడ ఎవరున్నారు? ఎందుకు డబ్బులు తగలేస్తున్నావు అంటూ అమ్మ గొడవ చేస్తోందక్కా'' అంది సుప్రియ బయలుదేరేముందు.

''శిల్పకళావేదికలో జరుగుతున్న కొత్త సంవత్సర సంబరాల్లో నేను యాంకరింగ్ చేస్తున్నాను అని చెప్పు. మీ టికెట్స్‌కీ, హోటల్ అకామడేషన్‌కి కూడా ఆర్గనైజర్స్ డబ్బులిచ్చారు అని చెప్పు అంది మౌనిక. ''

"నువ్వు చేస్తున్నావా?" వుత్సాహంగా అడిగింది సుప్రియ.

"యస్. నాతోపాటు మరో అమ్మాయి కూడా వుంది. ఇద్దరం కలిసి చేస్తున్నాం"

"ఎంతిస్తున్నారక్కా?"

"ఇప్పుడెందుకు నువ్వు వచ్చాక చెప్తాలే. డోంట్ వర్రీ డబ్బులు గురించి నేను చూసుకుంటాను సరేనా?"

"సరే అక్కా" అంటూ సుప్రియ ఫోన్ పెట్టేసింది.

డిసెంబర్ 31

ఉదయానికల్లా తల్లితో కలిసి హైదరాబాదు వచ్చిన సుప్రియ, ద్వారకా హోటల్‌లో దిగింది.

రాత్రి అవడానికి ఇంకా పన్నెండు గంటలుంది.

ఒక అపూర్వమైన కట్టడం శిల్పకళావేదిక చూడబోతోంది. అక్కడ తన అక్క యాంకరింగ్ చేస్తుంటే సుప్రసిద్ధ నేపథ్యగాయని తన పెద్దమ్మ పాటలు పాడబోతోంది.

తలుచుకుంటుంటే ఒళ్ళంతా పులికించిపోతోంది.

అక్కని టివిలో చాలాసార్లు చూసింది. స్టేజ్ షోలో ఎప్పుడూ చూడలేదు. ఇవాళ చూస్తోంది.

"ఇదెక్కడే?" అడిగింది సంధ్యాదేవి పెద్దకూతురు మౌనికని వుద్దేశించి.

"అక్క బిజీగా వుంటుంది కదమ్మా. మనమే అక్కడికి వెళ్తాంగా. అక్కడే కలవచ్చు" అంది సుప్రియ.

"ఏంటో మనం ఎలా వెళ్తాం? ఈ మహానగరానికి ముందూ, మునుపూ వచ్చాం కనకనా. మనకేం తెలుస్తుంది?" విసుక్కుంది ఆవిడ.

"అక్క కారు పంపిస్తుందమ్మా."

"కారా? విస్తుబోతూ అడిగింది దానికి కారెక్కడిది?"

"అక్కకి ఆర్గనైజర్స్ అరేంజ్ చేస్తారు కదమ్మా. తను దిగిపోయాక మన దగ్గరికి పంపిస్తుంది. అందులో వెళ్ళచ్చు నువ్వెందుకు వర్రీ అవుతావు అన్నీ అక్క చూసుకుంటుందిగా" నచ్చచెప్పింది సుప్రియ.

"ఏమో ఈ యాంకరింగులు, టివి షోలు, స్టేజ్ షోలు ఇవన్నీ మనకెందుకు? ఆ డిగ్రీ ఏదో పూర్తి చేసి వుద్యోగం చూసుకుంటే పోయేదిగా. చెప్పిన మాట వినదు" అంది సంధ్య.

నెలంతా వుద్యోగం చేస్తే సంపాదించే డబ్బు ఒక్క స్టేజ్ షో ద్వారా సంపాదించచ్చు. వూరికే నసపెట్టకు అక్కని బాగుపడనీ" కొంచెం చిరాగ్గానే అంది సుప్రియ.

"మీకలాగే వుంటుంది. ఇద్దరు ఎదిగిన ఆడపిల్లల్ని పెట్టుకుని నిశ్చింతగా బతకమంటే బతకగలనా? నా వల్లకాదు" నిట్టూర్చింది సంధ్యాదేవి.

తల్లి ధోరణి అలవాటు అవడంతో సుప్రియ మౌనంగా తను సాయంకాలం వేసుకోవాల్సిన డ్రెస్ ఫ్యాన్సీ జ్యూయలరీ రెడీ చేసుకోసాగింది.

**సరిగ్గా ఆరుగంటలకి** ఉషాకాంతకి తనకి వేరే పనుంది బైటకి వెళ్తున్నానని, నేరుగా వెన్యూకి వస్తానని చెప్పింది మౌనిక.

ఆవిడని పికప్ చేసుకోడానికి ఆర్గనైజర్స్ వస్తారని చెప్పి ఆవిడ దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయింది.

అప్పటికే ఆమెని పికప్ చేసుకోడానికి సంస్థవాళ్ళు పంపించిన కారు వీధి చివర ఎదురు చూస్తోంది. అలా చూడమని మౌనికే చెప్పింది. తను ఉషాకాంత దగ్గర వుంటున్నట్టు ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడింది. అందుకే తనకేదో పనుందని మారేడ్‌పల్లి వస్తున్నానని, అట్నించి మహేంద్రహిల్స్ దగ్గరకు కారు పంపిస్తే వస్తానని చెప్పింది.

కారులో కూర్చుని సుప్రియకి ఫోన్ చేసింది.

"రెడీగా వున్నారా" అడిగింది సుప్రియన్.

"రెడీ అక్కా" చెప్పింది సుప్రియ.

"సరే నేను దిగగానే కారు పంపిస్తా మీరు వచ్చేయండి" అని చెప్పి ఫోన్ పెట్టేసింది.

ఎంతో ఉద్వేగంగా, మరెంతో సంతోషంగా వుంది మౌనికకు. తను అనుకున్న పని ఇంత త్వరగా సాధించడం ఎగ్జయిటింగ్‌గా వుంది. తల్లి, పెద్దమ్మ కలుసుకునే మధురక్షణాలు ఊహిస్తుంటేనే ఆనందంతో మనసు తుళ్ళిపడుతోంది. అమ్మ ఎలా రిసీవ్ చేసుకుంటుందో పెద్దమ్మని. పెద్దమ్మ ఎలా రియాక్ట్ అవుతుందో అమ్మని చూసి.

కారు వెన్యూ చేరింది. తను దిగిపోతూ డ్రైవర్‌కి చెప్పింది కారు లకిడీకాపూల్ తీసుకెళ్ళమని.

ఆమె లోపలికి వెళ్ళేసరికి మరో యాంకర్ వినూత్న వచ్చేసింది. మిగతావాళ్ళు కూడా వచ్చారు. నేరుగా మేకప్ చేసుకోడానికి వెళ్ళిపోయింది మౌనిక.

సమయం రాత్రి పదిగంటలు.

కాలచక్రంలో మరొక సంవత్సరం ఆరంభం అవడానికి మరో రెండు గంటల సమయం వుంది.

కొత్త సంవత్సరానికి కొన్ని వేల చేతులు ఆహ్వానం పలకడానికి సమాయత్తం అవుతున్నాయి. కొన్ని వేల గొంతుకలు ఆనందంతో కేరింతలు కొడుతున్నాయి.

అది హైదరాబాదు నగరంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, విశాలమైన, అద్భుతమైన వేదిక అదే శిల్పకళావేదిక ఆ పేరులోనే భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు వెల్లివిరుస్తున్నాయి.

రంగు, రంగుల పూలతో, దేదీప్యమానంగా వెలిగే లైట్లతో అలంకరించబడిన ఎత్తైన వేదిక మీద రక, రకాల వాయిద్యాలు అమర్చబడి, నిపుణులైన వాయిద్యకారుల కరస్పర్శ కోసం ఎదురుచూస్తున్నట్టుగా వున్నాయి.

ఆధునిక సాంకేతిక సౌండ్ సిస్టమ్ మరో పక్క ప్రేక్షకుల గుండెల్లో నగారా మోగించడానికి సిద్ధంగా వుంది.

వేదిక మీదకి మెరుపు తీగలాంటి యువతి చేతిలో మైకుతో ప్రవేశించింది. ఆమె పేరు వినూత్న.

లెహంగా, ఓణీ వేసుకుంది. లెహంగా లేత పసుపురంగు షిఫాన్ క్లాత్ మొత్తం వర్క్ చేసి వుంది. అది లోపల పైన నెట్ క్లాత్ లెహంగాకి మెజంతా రంగు బోర్డరు, దానిమీద కూడా పూర్తిగా కుందన్ వర్క్ చేసి వుంది. టాసెల్స్ వేళ్ళాడుతున్నాయి. చెవులకి పెద్ద, పెద్ద బుట్టలు చేతులనిండా రాళ్ళగాజులు. లైట్ల వెలుగులో ధగ, ధగా మెరిసిపోతోంది.

ఆమె స్వరం హుషారుగా పలికింది. "హాయ్ ఫ్రెండ్స్ అయామ్ వినూత్న వెల్ కమింగ్ ఆల్ మై ఆడియన్స్ టు ద షో" అంటూ ప్రేక్షకులకి స్వాగతం పలికింది.

తీగల మీద పాకిన పాశ్చాత్య సంగీతం వెంటనే సుమధుర కర్ణాటక సంగీతంగా మారినట్టు ఇంగ్లీషులో ప్రారంభించిన స్వాగతం పలుకులు తెలుగులోకి మారాయి.

"ఇంకా గంటా యాభై నిమిషాల్లో మనమంతా ఎంతో వుద్వేగంతో, మరెంతో ఉత్కంఠంతో ఎదురుచూస్తున్న కొత్త సంవత్సరం ప్రారంభం కాబోతోంది.

సరిగ్గా ఏడాది క్రితం ఇదే సమయంలో మనమంతా ఇలాగే పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ సంబరాలు చేసుకున్నాం.

గమ్మత్తుగా వుంది కదా! కనురెప్ప పాటులో మూడువందల అరవైరోజులు గడిచిపోయాయి.

మళ్ళీ మనం అందరం ఈ వేదిక మీద కలుసుకున్నాం.

ఇంతకు ముందు కూడా ఈ వేదిక మీద ఎన్నో అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుకున్నాం, దీపావళి, దసరా, ఉగాది సంబరాలెన్నో జరుపుకున్నాం

ఎన్నో గడిచిపోయిన సంవత్సరాలకు వీడ్కోలు పలికి నూతన సంవత్సరానికి స్వాగతం పలికాం. అయితే, ఈరోజు మనం జరుపుకోబోతున్న నూతన సంవత్సర వేడుకలకు ఒక ప్రత్యేకత వుంది.

ఆమె ఆగింది. వ్యాఖ్యాత్రిగా ఎంతో అనుభవం వున్నదానిలా ఎంతో ఈజ్‌తో మాట్లాడుతోంది. వేదిక మీద నిలబడిన ఆమెలో అంతులేని ఆత్మవిశ్వాసం కనిపిస్తోంది. చిరునవ్వుతో ప్రేక్షకుల వైపు మౌనంగా చూసింది.

మంత్రముగ్ధులై చూస్తున్నారు ప్రేక్షకులు.

ముందు వైపు రెండో వరసలో కూర్చున్న సుప్రియను, పక్కనే కూర్చున్న సంధ్య అడిగింది "అక్క వస్తుందన్నావుగా ఈ అమ్మాయి వచ్చిందేమిటి?"

"వస్తుంది రాత్రి పన్నెండింటిదాకా కార్యక్రమాలు వున్నాయిగా అందుకే ఇద్దరు యాంకర్స్‌ని పెట్టారు" అంది సుప్రియ.

"ఓహో" అని తిరిగి కార్యక్రమం చూడసాగింది సంధ్య.

ఉత్సుకతతో చూస్తున్న ప్రేక్షకులను ఉత్సాహపరుస్తూ తన వ్యాఖ్యానం కొనసాగించింది వినూత్న.

ఈ రోజు కార్యక్రమానికి ఒక ప్రత్యేకత వుంది. మీరెవరూ ఊహించని ప్రత్యేకత.

"ఈ రోజు మన ఈ వేదికను పునీతం చేయడానికి వచ్చిన గాయనీమణిని మీరెన్నడూ, మీరేకాదు నేను కూడా చూడలేదు. ఆమె గానం విన్నాం, ఆమె గానాన్ని ఆస్వాదించాం, ఆస్వాదిస్తున్నాం. కానీ ఆమెని చూసే అదృష్టం ఈ రోజు మనకి కలగబోతోంది."

"హాయ్ ఫ్రెండ్స్" స్కిన్ కలర్ మెరుపు చీరలో నక్షత్రమండలం దిగివచ్చినట్టుగా వచ్చింది మౌనిక.

"అయామ్ మౌనిక."

ఒక్కసారిగా చప్పట్లు మారుమోగాయి.

సుప్రియ కళ్ళు మెరిసాయి. సంధ్యాదేవి అవాక్కైపోయింది నా కూతురు మౌనికేనా? ఇంత అందంగా వుంటుందా నా కూతురు అనుకుంది ఆవిడ.

వేదిక మీద నుంచే తన తీక్షణమైన చూపుల్తో తల్లిని, చెల్లిని వెదుకుతూ చెల్లి కళ్ళతో కళ్ళు కలవగానే పలకరింపుగా నవ్వి తన వ్యాఖ్యానం కొనసాగించింది మౌనిక.

ఇప్పుడే మన వినూత్న చెప్పింది మనం ఇవాళ ఓ మహత్తర గాయనిని చూడబోతున్నాం. ఇది నిజంగా అద్భుతం. ఆవిడ ఇవాళ ఈ వేదిక మీద తన గళాన్ని వినిపించడానికి అంగీకరించడం మన అదృష్టం.

"వినూత్నా చెప్పేద్దామా ఆవిడెవరో"

"యస్.. ఇంకా ఆలస్యం దేనికి?" వినూత్న ఉత్సాహపరిచింది.

మౌనిక నవ్వుతూ చెప్పసాగింది "కేవలం భారతదేశమే కాక సమస్త మానవజాతి గర్వించదగిన కళాకారిణి, తన భక్తుల్ని అలరించి, ఆశీరదించడానికి సాక్షాత్తూ ఆ సరస్వతీదేవే భూమ్మీద అవతరించినట్టు మన దేశంలో మన మధ్య అవతరించిన సుమధుర గాయని, అరవై వసంతాలుగా తన సంగీత ప్రవాహంలో ఎందరో రసజ్ఞులను ముంచెత్తి జాతీయపతాకం మీద తానూ ఒక చిహ్నమై నిలిచిన ఒక సంగీత సామ్రాజ్ఞి గానలహరిలో మనమంతా కూడా మునిగిపోబోతున్నాం."

ప్రేక్షకుల కరతాళధ్వనులు ఆకాశాన్నంటి మేఘగర్జలను ప్రతిబింబించాయి.

మౌనిక, వినూత్న ఆ కరతాళధ్వనులు ఆగిందాకా నిశ్శబ్దంగా వుండిపోయి ఆగిపోయాక ఒక్కసారిగా బిగ్గరగా ప్రకటించారు.

"ఆమె మరెవరోకాదు సుప్రసిద్ధ సినీనేపథ్య గాయని, కర్ణాటక సంగీత సామ్రాజ్ఞి ఉషాకాంతగారు."

ఒక్కసారిగా ఆనందంతో కూడిన ఈలలు, మేఘాలు గర్జిస్తున్నట్టుగా చప్పట్లు.

ఇప్పుడు వినూత్న చెప్పసాగింది.

"ఉషాకాంతగారు తన పదవ యేట స్వరతీగలను సవరించుకుని సరిగమలు ఆలపించిన ఓ పిల్ల కోయిల. పదమూడో ఏడు ప్రవేశించగానే ఓ వేదికపైన భవిష్యత్‌లో తాను భారతదేశ సరిహద్దు ద్వారానికి మంగళతోరణమై భాసిల్లుతానని సంతకం చేసారు. నాటి నుండీ నేటివరకూ రాగ, తాన, పల్లవులనబడే త్రివేణీ సంగమాన్ని దేశ, దేశాల్లో ప్రవహింపచేస్తూ భరతమాతని తన తీయని స్వరంతో అభిషేకిస్తూ, కన్నతల్లి ఋణం తీర్చుకుంటున్న రాగమయి, అనురాగమయి."

మౌనిక ప్రారంభించింది.

"ఈరోజు మనకి నూతన సంవత్సర వేడుక, కానీ మరో వేడుక. ఉషాకాంతగారి జన్మదినం. అరవై రెండేళ్ళు పూర్తి చేసుకుని అరవై మూడో వసంతంలోకి అడుగుపెడుతున్న ఉషాకాంతగారి జన్మదినం ఈరోజు కావడం యాధృచ్ఛికం కానీ, అదే మనకి అపూర్వవరం.

ఇటీవలే ఇంక గాయనిగా తాను తన ప్రస్థానం కొనసాగించలేకపోతున్నానని, ఇంక పాడనని ప్రకటన ఇచ్చారు అది మనందరికీ తెలుసు.

అందుకే ఆమెనింక వేదికలమీద చూడమేమో అని నూతన సంవత్సర వేడుకల్లో వారి గానామృతాన్ని మనకి అందించమని కోరడం, వారు దయతో అంగీకరించడం జరిగింది. మీలో కొందరు ఎంతోకాలంగా ఆ గాన సరస్వతిని ఒక్కసారి కళ్ళారా చూడాలని, తపించి వుంటారు. ఎన్నోసార్లు చూసిన వాళ్ళు మళ్ళీ చూడాలని తహ తహలాడుతూ వుంటారు. మనందరి కోరికా తీర్చడానికి అంగీకరించి మొట్టమొదటిసారిగా ఈ ప్రతిష్ఠాత్మక వేదిక మీద తన గానామృతాన్ని కురిపించడానికి వచ్చారు. మీ అందరి కరతాళధ్వనులు మిన్ను ముట్టేలా ఆ మధుర గాయనిని వేదికమీదకు ఆహ్వానిద్దాం."

కరతాళధ్వనులు ఆకాశాన్నంటి మేఘాలతో సాగి దేశ, దేశాల్లో ప్రకంపనలు సృష్టిస్తుండగా ధవళ వస్త్రధారిణియైన ఉషాకాంత నెమ్మదిగా, హుందాగా వేదికమీదకి వచ్చింది.

ఆభరణాలన్నీ హంసకి అలంకరించి నిరాడంబరంగా నడిచి వస్తున్న సరస్వతీదేవిలా అనిపించింది. ఆమె వెనకాలే వేదిక మీద ఏర్పాటు చేయబడిన వివిధ వాయిద్యాలకు సంబంధించిన వాద్యకారులు కూడా వేదిక మీదకు వచ్చారు.

ఒక్కసారిగా అభిమానులు లయబద్ధంగా చప్పట్లు కొడుతూ లేచి నిలబడ్డారు. అదే ఓ అద్భుతమైన కళకి ప్రజలు పట్టే నీరాజనం. ఆ శబ్దాలు శృతిబద్ధంగా వినిపిస్తున్న సముద్రపు హోరులా వున్నాయి ఆమె చెవులకి. కొన్ని వందల శంఖాలు వేదాలు వూదుతున్నట్టుగా అనిపిస్తున్నాయి.

ఆ అభిమానానికి, ఆ ఆదరానికి, ఆ నీరాజనానికి ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

ఆమె హృదయం గర్వంతో ఎగసిపడింది. తన వాళ్ళందరినీ వదులుకుని ఈ సంగీతమే బంధుమిత్రులుగా భావించి తన జీవితాన్ని ఈ కళకే అంకితం చేసినందుకు ఇంతకన్నా ప్రతిఫలం ఏం కావాలి?

ఎప్పటికప్పుడే కొత్త అనుభూతులను పంచే ఈ అభిమానులకన్నా ఆత్మీయులెవరున్నారు? ఎన్నో వందల శాస్త్రీయ సంగీత కచేరీలిచ్చింది. మరెన్నో వందల గానప్రదర్శనలు ఇచ్చింది. ఎప్పటికప్పుడే కొత్త అభిమానులు, కొత్త అనుభూతులు.

జీవితం అంటే ఇదేనా? ప్రతి పరిచయం ఓ కొత్త అనుభవానికి వేదికైతే, ప్రతి అనుభవం కొత్త అనుభూతికి ప్రతీక.

పల్చని నీటి తెరల మధ్యనించి అభిమానులవైపు చూసిన ఆమె అప్రయత్నంగా చేతులు జోడించి వినమ్రంగా నమస్కరించింది. మరోసారి మిన్నుముట్టిన కరతాళధ్వనులు వినూత్న అభ్యర్ధనతో ఆగిపోయాయి.

అయితే ఆమెని చూసిన సంధ్యాదేవి మాత్రం భూకంపం వచ్చినట్టుగా అదిరిపడింది.

"సుప్రియా మనం వెళ్ళిపోదాం పద" గాభరాగా తన చేయి పట్టుకుని లేస్తున్న తల్లివైపు చిత్రంగా చూసింది సుప్రియ.

"ఎందుకమ్మా?"

"ఒద్దు మనం ఇక్కడ వుండొద్దు."

"అదేంటమ్మా ఇంత మంచి ప్రోగ్రామ్ ఎందుకొద్దు? నేను చూస్తాను. రాను కూర్చోమ్మా గొడవ చేయకు."

"ఒద్దన్నానా?" తీవ్రంగా అరిచింది సంధ్య.

"అమ్మా అందరూ మనల్నే చూస్తున్నారు" ఖంగారుగా అంది సుప్రియ.

వేదిక మీదనుంచి తల్లి రియాక్షన్ గమనించిన మౌనిక మైకులో మృదుగంభీరంగా చెప్పింది. "దయచేసి ప్రేక్షకులంతా ఎవరి సీట్లలో వారు కూర్చుని నిశ్శబ్దం పాటించాలని మనవి. ఒక గొప్పవ్యక్తి మాటలేకాక, పాటలు మనం వినబోతున్నాం. ఆవిడని గౌరవించడం మన బాధ్యత."

"కూర్చోమ్మా" తల్లి చేయి పట్టిలాగి కూర్చోబెట్టింది సుప్రియ.

సంధ్యాదేవి అదిరేగుండె చిక్కబట్టుకుని నిస్సహాయంగా కూర్చుండిపోయింది.

ఉషాకాంత.. తన అక్క.. ఎప్పటి అక్క యాభై ఏళ్ళ క్రితమే అత్తగారి ఇంట్లోంచి వెళ్ళిపోయింది. అప్పుడే ఆమె చచ్చిపోయిందని ఇంటిల్లపాదితో స్నానాలు చేయించాడు తండ్రి. జీవితంలో ఎప్పుడూ ఆమె పేరు కూడా తలవద్దని అందరి చేతా ప్రమాణం చేయించుకున్నాడు.

ఆమె సంగతి తెలిసినా ఎవరూ కూడా ఇంతకాలంగా ఎప్పుడూ ఆమెని కలవడానికి సాహసించలేదు.

అలాంటిది ఇప్పుడు ఈమెని తన కూతురు పరిచయం చేయడం. ఏంటి ఈ పరిస్థితి? మౌనికకు ఉషాకాంత ఎవరో తెలుసా?

సణుక్కుంటున్న తల్లిని చూస్తూ "ఏంటమ్మా.. ఏదో అంటున్నావు?" అంది సుప్రియ.

ఆ "ఆ అబ్బే ఏం లేదు" తడబడింది సంధ్య. తల్లిని ఓరకంట గమనిస్తూ కార్యక్రమంలో మునిగిపోయింది.

వినూత్న స్వరం వినిపించింది. ఇప్పుడు అందరూ ఎదురుచూస్తున్న మధురఘట్టం మొదలు కాబోతోంది అందరూ నిశ్శబ్దంగా వుండాలి. ఉషాకాంతగారు తన గానమాధుర్యంతో మనల్ని పరవశుల్ని చేస్తారు.

మౌనిక మాట్లాడింది. "ప్రేక్షకులంతా నిశ్శబ్దంగా వుండి, ఉషాకాంతగారి గానమాధుర్యాన్ని ఆస్వాదించాలని ప్రార్థన" ఆమె కోరికను మన్నించి అందరూ వారి, వారి స్థానాలను ఆక్రమించారు. కుర్చీలు ఖాళీ లేక కొందరు నిలబడ్డారు.

ఓ పెద్ద గాలికెరటం విశ్వవీణను మీటినట్టు ఆమె స్వరం మోగింది.

"ప్రేక్షకులకు నమస్కారం." ఆమె ఆగింది. సంధ్యాదేవి ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూస్తోంది అక్కగారి వైభవాన్ని.

"పదేళ్ళ క్రితమే నా అభిమానులకి దూరమై అజ్ఞాతంగా వుంటున్నాను. నాకు ప్రారంభంలో అన్నం పెట్టిన ఆకాశవాణికి తప్ప మరెక్కడా నేను కచేరీలు ఇవ్వలేదు ఇటీవలి కాలంలో.

అందుకు ప్రత్యేకమైన కారణం ఏమీలేదు. అన్నిచోట్లా వచ్చినట్టే సినీప్రపంచంలో కూడా మార్పులొచ్చాయి. నాకన్నా బాగా పాడేవాళ్ళు, యువత వస్తున్నారు. పైగా నాకు వయసు మీరుతోంది కాబట్టి అవకాశాలు తగ్గిపోయినప్పుడు నా అంతట నేనుగా గౌరవంగా పక్కకి తప్పుకుని కొత్తవాళ్ళకి అవకాశం ఇవ్వాలని అనుకున్నాను.

అందుకే అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాను. అజ్ఞాతంలోకి వెళ్ళడం అంటే ముక్కుమూసుకుని అడవుల్లో తపస్సు చేసుకోడం కాదుకదా. కేవలం నా ఉనికి ప్రపంచానికి తెలియకుండా ఒక మూల ప్రశాంతంగా కాలం గడుపుతున్నాను.

చాలాకాలం నేనెక్కడ వున్నానో తెలుసుకోడానికి కూడా ఎవరూ ప్రయత్నించలేదు.

అయితే కొద్ది నెలల క్రితం ఒక టి.వి ఛానెల్ వాళ్ళు నన్ను వెతుక్కుంటూ వచ్చి, తమ కార్యక్రమానికి అతిథిగా ఆహ్వానించి తిరిగి నన్ను ప్రజా జీవనంలోకి తీసుకువచ్చారు.

నిజానికి నేటి ఈ కార్యక్రమానికి రావడం నాకే మాత్రం ఇష్టంలేదు. కానీ, ఈ సంస్థవాళ్ళు నన్ను బలవంతం చేసి ఒప్పించారు. ఇవాళ నేనీ వేదిక మీదకు రావడానికి కారకులైన ఈ సంస్థ వాళ్ళకి నా కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను. ముఖ్యంగా ఈ అమ్మాయి మౌనిక నేనివాళ మీ అందరి ముందుకు రావడానికి ముఖ్యకారకురాలు. ఈ చిరంజీవికి నా ఆశీస్సులు.

ఎంతో సంశయంతో, భయంతో అయిష్టంగా వచ్చిన నేను ఇక్కడ మీ అందర్నీ చూసి ముగ్ధురాలినైపోయాను. ఆనందంతో నా గొంతు మూగపోయింది.

నా గొంతు చాలాసార్లు మూగపోయింది. అందులో ఎక్కువసార్లు దుఃఖంతో, కొన్నిసార్లు ఆనందంతో. ఐతే ఆనందాన్ని ఆస్వాదించి, ఆలపించిన నా స్వరం దుఃఖానికి మాత్రం ఎందుకు చలించాలన్న పట్టుదలతో స్వరతీగలను సవరించుకున్నాను. తెగిన తీగలను కొత్త తీగలతో నింపుకున్నాను నా పాట ప్రయాణం కొనసాగించాను. అదే స్ఫూర్తితో, అదే ప్రేరణతో ఇప్పుడూ పాడతాను.

నాకు తెలుసు కాలం మారింది. ప్రేక్షకుల, శ్రోతల అభిరుచి మారింది, సాహిత్యం మారింది, సంగీతం మారింది. అందరి చేతా స్టెప్పులు వేయించేంత హుషారైన పాటల్ని జనం కోరుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా నా పాటల మీద అభిమానంతో నన్ను వెతుక్కుంటూ వచ్చి, ఇవాళ నన్ను ఇక్కడికి తీసుకువచ్చిన మీ అందరికీ నా ధన్యవాదాలు తెలుపుకుంటూ నా పాట ప్రారంభిస్తున్నాను."

ఆమె ఆగింది. ప్రేక్షకులు ఉత్కంఠగా చూస్తున్నారు. కొన్ని క్షణాలు కళ్ళు మూసుకుని, మనసులోనే ఆ శారదాదేవిని ప్రార్థించుకున్న ఆమె ఆలాపన ప్రారంభించింది.

మెల్లగా పిల్లతెమ్మెరలా ప్రారంభమైన ఆ ఆలాపన, క్రమంగా స్వరరాగ, పల్లవుల పవనమై చుట్టూ వున్న చెట్లను తాకి, కొమ్మ కొమ్మనూ పలకరించి, పూవు, పూవునూ స్పృశించి సంగీతాభిమానుల గుండెలను మీటుతూ, పరిసరాలను చుట్టేస్తూ ఓ ప్రభంజనమైంది. ఆ గానానికి, ఆ స్వరానికి, ఆ మాధుర్యానికీ మంత్రముగ్ధులైన ప్రేక్షకులు చప్పట్లు కొట్టడం మర్చిపోయారు.

అరగంట, గంట, గంటన్నర గడిచిపోయింది. స్థంభించిన కాలానికి ఒక్కసారిగా చలనం వచ్చినట్టు అయింది. అప్పటికే పన్నెండు గంటల మీదకి సెట్ చేయబడిన గడియారం కొత్తసంవత్సరం వచ్చేసిందోచ్ అని గొంతు చించుకుని అరిచింది.

ఆమె గానం ఆగింది.

ప్రేక్షకుల్లో హఠాత్తుగా కదలిక.

బైట టపాకాయల మోత, లోపల హాపీ న్యూ ఇయర్ అంటూ పాడుతూ తాలం వేస్తున్న జనాల ఆనందహేల.

అప్పటివరకూ మెలోడి పాటలతో జనాన్ని మంత్రముగ్ధులను చేసిన ఉషాకాంత ఆ కేరింతలకు తన పులకింతలను జతచేస్తూ అభిమానుల ఆనందంలో పాలుపంచుకోడానికి వయసుని దూరంగా నెట్టి హుషారుగా పాడసాగింది. హ్యాపీ న్యూ ఇయర్, హ్యాపీ న్యూ ఇయర్.. పది నిమిషాలు అక్కడ సప్త సముద్రాల హోరు, లక్ష నగరాల జోరు.

**వినూత్న మైకులో** గట్టిగా అరిచింది. "అటెన్షన్ మై డియర్ ఫ్రెండ్స్.. మన ఆనందాన్ని మరింతగా ఇనుమడింప చేసే మరో మహత్తర కార్యక్రమం. ఈ రోజు ఈ గానకోకిల జన్మదినం సందర్భంగా సెలబ్రేట్ చేసుకుందాం. మేడమ్ చేతులమీదుగా కేక్ కట్‌చేస్తారు. కార్యక్రమ నిర్వాహకులను, ఇంత ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ఆర్థిక, హార్థిక సాయం అందించిన సహృదయులైన స్పాన్సరర్స్‌ని వేదిక మీదకు రావాల్సిందిగా కోరుతున్నాను."

సుమారు పదిహేను మంది కార్యకర్తలు, ఇరవైమంది స్పాన్సరర్లు వేదిక మీదకు వచ్చారు. ఆమె హృదయం ఆనందంతో కడలి తరంగం అయింది. అణువణువూ అభిమానుల హర్షధ్వానాలకి పులకించిపోసాగింది.

ఇంతమంది గుండెల్లో ఇంత అపురూపమైన స్థానం ఉందా నాకు. నేనంటే ఇంత అభిమానమా? నేనంటే ఇంత గౌరవమా?

ఎన్నో ప్రదర్శనలు ఇచ్చింది ఎంతో మంది అభిమానుల ప్రశంసలు పొందిది కానీ, ఇవాళెందుకు కొత్తగా, అద్భుతంగా అనిపిస్తోంది. ఎందుకిలా తనలోని ప్రతి నరం ఓ వీణ తీగగా మారి ఆలపిస్తోంది. ఆమెకి కొత్తగా, వింతగా, అద్భుతంగా అనిపిస్తోంది.

ఎన్నో పుట్టినరోజులు అటు సినీపరిశ్రమలో, ఇటు తోటి కళాకారుల మధ్యా జరిగాయి కానీ, ఈ పుట్టినరోజు వేడుక ఇంత వినూత్నంగా, ఇంత అపురూపంగా జరగడం మొదటిసారి. ఫాస్ట్ బీట్‌తో, చిత్ర, విచిత్రమైన విన్యాసాలతో హోరెత్తించే సంగీతాన్నే ఈ కాలంలో అందరూ కోరుకునేది అనుకుంది. ఆర్గనైజర్స్ బతిమాలితే ఇదే ఆఖరిప్రదర్శన అని ఒప్పుకుంది. కానీ, ఇప్పుడు వీళ్ళందరి చైతన్యం చూస్తుంటే ఇంకా నూరేళ్ళు పాడుతూనే బతకాలని అనిపిస్తోంది.

ఆ క్షణంలో అక్కడున్న ప్రతి ఒక్కరూ తన కుటుంబ సభ్యులుగా, తన ఆత్మీయులుగా అనిపించింది. ఈ అనుభూతి గుండెపొరల్లో ఇన్నేళ్ళుగా దాచుకున్న ఆవేదనని పటాపంచలు చేస్తోంది. లేని ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ఆ యువతతో సమానంగా ఆనంద తాండవం చేయాలనిపిస్తోంది. కళ్ళల్లో ఆనంద భాష్పాలు నిండాయి.

కళ్ళ చివరకి జారుతున్న నీటి ముత్యాలు చిటికెన వేలితో విదిలించి, తడబడే అడుగులతో, వణుకుతున్న చేతులతో అక్కడ చేరిన వేలమంది ప్రేక్షకుల ప్రేమానుబంధాల వర్షపు జల్లుల్లో తడిసిపోతూ, వేదిక మీద చేరిన అందరూ రక్షణ వలయంలా చుట్టి నిలబడగా, వినూత్న అందించిన చాకు అందుకుని కేకు కట్ చేసింది. అభిమానుల శుభాకాంక్షలతో, హర్షధ్వానాలతో దద్దరిల్లింది.

ఒక్కొక్కరే స్పాన్సర్లు ఆమె పట్ల తమకున్న అభిమానం, ఆరాధన వ్యక్తపరుస్తూ ఆమె నిండు నూరేళ్ళు ఇలాగే తన గానమాధుర్యంతో ప్రజలను అలరించాలన్న తమ కోరికను వెలిబుచ్చుతూ మాట్లాడారు.

చివరగా ఉషాకాంతగారు మాట్లాడాలని, అటు శాస్త్రీయ సంగీత కళాకారిణిగా, ఇటు మూడు భాషల సినీ నేపథ్యగాయనిగా తన అనుభవాలు అందరితో పంచుకోవాలన్న కోరిక వెలిబుచ్చారు అభిమానులు.

ఎప్పుడూ పాటలే తప్ప ఆమె మాటలు వినని వాళ్ళంతా ''అవును మాట్లాడాలి, మాట్లాడాలి'' అని అరిచారు.

అవును మాట్లాడాలి. తన అనుభవాలు, తన ఆనందాలు, తన దుఃఖం, తన విచారం, కష్టాలు, కన్నీళ్ళు పంచుకోడానికి ఎవరున్నారని ఆక్రోశించింది ఇంతకాలం. ఇప్పుడు తెలుస్తోంది ఎవరున్నారో.

ఆరు దశాబ్దాలుగా గుండెల్లో ఘనీభవించిన వేదన ఇప్పుడు కరిగి నీరై, సెలయేరై ప్రవహించడానికి సిద్ధంగా ఉంది. ఇంతకాలం యాంత్రికంగా ప్రదర్శనలు ఇచ్చి కార్యనిర్వాకులిచ్చిన చెక్కు అందుకుని మౌనంగా వెళ్ళిపోవడం తప్ప ఏనాడూ ప్రేక్షకులతో మాట్లాడలేదు. వాళ్ళు తన పట్ల చూపుతున్న అభిమానానికి, ఆదరానికి కృతజ్ఞత తెలుపుకోలేదు. ఇప్పుడా సమయం ఆసన్నమైంది. ఇప్పుడైనా తను పెదవి విప్పకపోతే ఈ పెదవులు శాశ్వతంగా మూసుకుపోవడానికి ఎంతో సమయంలేదు.

ఉషాకాంత మైకు అందుకుంది. ఒక్కసారిగా పిన్‌డ్రాప్ సైలెన్స్ ఆవరించింది.

ఆమె స్వరం మోగింది ఓ గిటారు మీటినట్టు, ఓ సితార్ మోగినట్టు, ఓ వీణ పాడినట్టు, ఓ జుగల్ బందీలా..

''నా అభిమాన ప్రేక్షకులారా, నా అన్నదమ్ములారా, నా అక్కా చెల్లెళ్ళలారా, నా బిడ్డలారా, నా తల్లితండ్రులారా, నా శ్రేయోభిలాషులారా, నా సర్వస్వం అయిన అభిమానులారా! ఇటీవలే నేనింక పాడనని విశ్రాంతి తీసుకుంటానని పత్రికల ద్వారా తెలియచేసాను. కానీ, ఇప్పుడు మీ అందరి అభిమానం చూస్తుంటే నేనెంత తప్పుడు ప్రకటన ఇచ్చానో అర్థం అవుతోంది. నేను ఉషను, ఉష అంటే సూర్యోదయం. సూర్యుడికి ఉదయించడమే తెలుసు. అస్తమించడం తెలియదు. తూర్పునుంచి పడమరకు ప్రయాణం చేసి పడమట ఉదయిస్తాడు. నేనూ అంతే.

ఒక చీకటి రాత్రి నాలుగు గోడలు తప్ప, సూర్యోదయానికి, సూర్యాస్తమయానికి తేడా తెలియని అమాయకత్వంతో, అయిన వాళ్ళచేత అవమానింపబడి బైటకి వచ్చిన నాకు భవిష్యత్తు అగమ్యంగా, అంధకారంలా అనిపించింది. అయితే నా దగ్గర అమ్మ ఇచ్చిన ఓ వరం ఉంది అదే నన్ను బతికిస్తుంది అనే నమ్మకంతో అడుగులో అడుగువేసుకుంటూ జీవితపు అంచులగుండా ముందుకు నడిచాను. ఆ రోజు నేను వేసిన తొలి అడుగు లక్ష అడుగుల స్థైర్యాన్ని, ధైర్యాన్ని కలిగించి ఇవాళ మీ అందరికి నన్ను ఆప్తురాలిని చేసింది.

నా ఆవేదన, నా ఆక్రోశమే రాగంగా ఎంతోమందిని ముగ్ధుల్ని చేసి నన్నీనాడు ఇలా మీ సమక్షంలో నిలబెట్టింది. మీకోసం, నా పాట విని నన్ను టికెట్టు అడగని రైల్వే టికెట్ కలెక్టర్ కోసం, నా పాట విని దిక్కులేని నన్ను అక్కున చేర్చుకుని ఆదరించి, నీపాటే నీ కాళ్ళు, నీ కళ్ళు అంటూ నా చేత సంగీత ప్రపంచంలోకి అడుగులు వేయించిన దేవత మహలక్ష్మమ్మగారి కోసం, చిట్టి, చిట్టి చేతులతో నెల తిరిగే సరికి నా చేతుల్లో సరిగమప అంటూ భక్తిగా వేతనాలిచ్చి ఆదుకున్న చిన్నారులకోసం, అమ్మ తరవాత అమ్మలా ఆదరించి, నాకోదారి, తెన్నూ చూపించిన కృష్ణవేణిగారికోసం, సీతగారికోసం, నన్నో నేపథ్యగాయనిగా తీర్చిదిద్దిన పూజ్యులు, కీర్తిశేషులు మునిస్వామిగారికోసం, ఈ పాటల ప్రయాణంలో నాకు తోడుగా ప్రయాణిస్తూ, నన్ను ఉత్సాహపరిచి, ప్రోత్సాహమిచ్చిన మీ అందరికోసం పాడుతూనే ఉంటాను.

నా శ్వాస, నా ధ్యాస తాళం, లయ, శృతి అన్నీ మీరే అయి మీ ఈ చప్పట్లతో నడిపించుకు వచ్చిన మీ అందరికీ మనసా, వాచా, కర్మణా నన్ను నేను అంకితం చేసుకుంటూ ఈ కొత్తసంవత్సర శుభారంభవేళ మీ గుండెల్లో కొత్త ఆశలకి, కొత్త జీవన విధానానికి ఊపిరి పోస్తాను. మీరందరూ ఉజ్జ్వలమైన భవిష్యత్తు వైపు సాగిపోడానికి నేను స్ఫూర్తినవుతాను.

నా సంగీతాన్ని, నా సినీగీతాలని సమానంగా అభిమానిచి నన్నాదరించి ఈ ప్రపంచంలో నాకో ఉనికినిచ్చిన మీలాంటి ఎందరో, మరెందరో అభిమానులు. మీరు, మీరంతా నా వాళ్ళు, నా ఆత్మీయులు, నా సర్వస్వం. వృద్ధాప్యం నన్ను తరుముకొస్తున్నా మీ అందరికోసం దానితో పోరాడుతూ గెలవడానికి ప్రయత్నిస్తాను. గెలుస్తాను తప్పకుండా గెలుస్తాను. నా గుండె తడారకుండా, నా గొంతు మూగపోకుండా జీవితాంతం మీకోసం పాడుతూ ఉంటాను. నా పాట మీది, నా స్వరం మీది, నా ఆనందం, నా సుఖం, సంతోషం అంతా మీది. మీరు పెట్టిన భిక్ష ఈ జీవితం అందుకే, అందుకే మీకే అంకితం. నా ప్రకటన ఉపసంహరించుకుంటున్నాను. నా ఊపిరి నిలిచిపోయిందాకా పాడుతూనే ఉంటాను.''

హటాత్తుగా ఆమె గొంతు మూగబోయింది. కన్నీటితో చెక్కిళ్ళు తడిసిపోయాయి.

శిలా ప్రతిమల్లా మ్రాన్పడిపోయి కూర్చున్న అందరిలో ముందుగా తేరుకుంది వినూత్న. మైకు అందుకుంది. దుఃఖంతో రుద్ధమైన స్వరం సవరించుకుంది. ''ఈ వేదన ఒక్క ఉషాకాంతగారిదే కాదు, ఆనాటికీ, ఈనాటికీ తనకన్నా ఏ విషయంలో కూడా తన భార్య ఉన్నత స్థాయిలో ఉండడం సహించలేక, ఆమెలోని గొప్పదనాన్ని ఒప్పుకునే విశాల హృదయం లేక, ఆమెలోని ప్రతిభను తన ఆధిపత్యంతో అణచివేసే మగవాళ్ళు ఎందరో ఉన్నారీ సమాజంలో. పెరటి చెట్టు ఔషధానికి పనికిరాదు అని పెద్దలన్నట్టు తన కుటుంబంలోని ఒక అమ్మాయిలోని ప్రతిభని గుర్తించకుండా, ఆమెని అణచిపెట్టాలనుకునే అత్తగార్లు, మావగార్లు, ఆడపడుచులు, ఇంకా ఎందరో బంధువులు ఉన్నారు.

సమస్తజాతి తలవంచి వారిలోని కళాపటిమకు కైమోడ్పులర్పించినా కుటుంబంలో గుర్తింపు, ప్రోత్సాహం లేకపోవడం మనకి తెలుసు. ఇది నిజంగా విషాదం. కాకపోతే ఒక కుటుంబం లేకపోయినా, అభిమానులు, ఆరాధకులు అనే పెద్ద కుటుంబం వారిదే కాబట్టి ప్రతి కళాకారిణికీ ఈ జగమే ఓ కుటుంబం. అందుకే ఈ మహాతల్లికి మన ఆదరాభిమానాలు అనే చప్పట్లతో మనస్ఫూర్తిగా సమర్పిద్దాం నీరాజనం.''

రెండు చేతులూ ఒక దగ్గర చేర్చి అందరూ లేచి నిలబడ్డారు. కరతాళ ధ్వనులు ఆ మహాగాయని నరనరానా ప్రతిధ్వనించాయి.

వెక్కి, వెక్కి ఏడుస్తున్న సుప్రియకి మరింత పెద్దగా వెక్కిళ్ళు వినిపించి తలతిప్పి చూసింది. రెండు చేతుల్లో మొహం దాచుకుని కుమిలి కుమిలి ఏడుస్తోంది సంధ్య. తన కన్నీళ్ళు తుడుచుకుని గభాల్న ఆవిడ భుజం మీద చేయివేసి ''అమ్మా ఏంటిది? ఊరుకో'' అంది సుప్రియ గాభరాగా.

ఆవిడ గభాల్న లేచి సుప్రియను పట్టించుకోకుండా అందరి మధ్యలోంచి తలవంచుకుని బైటికి వేగంగా నడవసాగింది. సుప్రియ తను కూడా లేచి ఆమెని అనుసరించింది.

వేదిక మీద జనం ఉషాకాంత ఆటోగ్రాఫ్ కోసం గుంపులుగా చేరుతున్నారు. వాళ్ళందరి మధ్యలోంచి తల్లికోసం, చెల్లికోసం వెదుకుతున్న మౌనికకు ఇద్దరూ బైటకి వెళ్ళడం కనిపించి జనాన్ని తప్పించుకుంటూ వినూత్న పక్కకి వచ్చి చెప్పింది.

''వినూ నేనిప్పుడే వస్తాను. మేడమ్‌ని చూసుకో'' అంటూ వడి, వడిగా బైటకి నడిచింది.

ఉషాకాంతని జనం మధ్య నుంచి అతి కష్టం మీద బైటకు తీసుకువచ్చారు వినూత్న, కార్యకర్తలు కలిసి.

ఆమెకోసం ప్రత్యేకంగా కేటాయించిన చోట ఆమెని కూర్చోబెట్టి ఫ్యాన్ ఆన్ చేసి, కూల్ డ్రింక్ ఇచ్చింది వినూత్న.

''ఒద్దమ్మా కూల్ డ్రింక్ తాగను. కాసిని మంచినీళ్ళు ఇవ్వు చాలు'' అందావిడ.

వినూత్న మంచినీళ్ళ బాటిల్ అందించింది.

ఆవిడ నీళ్ళు తాగి బాటిల్ వినూత్నకిచ్చి ''మౌనికేది?'' అంది.

''వస్తుంది మేడమ్. వాళ్ళ మదర్ వచ్చినట్లున్నారు'' కలవడానికి వెళ్ళింది.

''మదరా?'' ఆవిడ ప్రశ్నార్థకంగా చూసింది.

అప్పుడే మౌనిక లోపలికి వచ్చింది. ఆమె వెనకే సుప్రియ, మరో స్త్రీ.. ఆవిడని చూడగానే ఉషాకాంత ఉలిక్కిపడింది.

ఆవిడ బాగా ఏడ్చినట్టు మొహం ఎర్రగా అయి, కళ్ళు వాచి ఉన్నాయి.

మౌనిక ఆవిడ చేయి పట్టుకుని ఉషాకాంత దగ్గరగా వచ్చింది. ''మా అమ్మ అంది సంధ్యని పరిచయం చేస్తూ.''

సంధ్య తల వంచుకుని నిలబడింది. ఆమె కళ్ళనుంచి రాలుతున్న కన్నీటి బొట్లు గుండెలమీదకి జారుతున్నాయి.

ఉషాకాంత నిశ్చేష్టురాలై చూసింది. ''ఈమె మీ అమ్మా?''

''అవునాంటీ అమ్మ పేరు సంధ్యాదేవి''

''సంధ్యాదేవా?'' ఆ మాటతో కన్నీళ్ళతో చూసింది సంధ్య.

ఉషాకాంత ఆమెని పరిశీలించి చూస్తూ అంది ''మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుంది.''

ఆ మాటతో సంధ్య ''అక్కా'' అంటూ ఆవిడని వాటేసుకుని బావురుమంది.

ఉషాకాంత కాళ్ళకింద భూమి కదిలినట్టు అయింది.

''అక్కా..''

ఈ పిలుపు విని ఎంతకాలమైంది? అక్కా... అసలు మళ్ళీ వింటుందని అనుకోని పిలుపు.

''నన్ను క్షమించక్కా'' ఏడుస్తోంది సంధ్య. వెక్కి, వెక్కి గుండె పగిలేలా.

మౌనిక ఆవిడ భుజం పట్టుకుని లేవనెత్తి ''అమ్మా పద మనం ఇంటికి వెళ్దాం అని ఆంటీ కారు రెడీగా ఉంది వెళ్దామా'' అంది.

ఉషాకాంత గాజుకళ్ళతో మౌనిక వైపు పిచ్చిదానిలా చూసింది.

మౌనిక తల్లిని సుప్రియకి అప్పచెప్పి తను ఉషాకాంత చేయి పట్టుకుని లేవదీసింది.

ఆవిడ బొమ్మలా మౌనికతో నడిచింది.

ఏం జరుగుతుందో అర్థంకాక తెల్లబోయి చూస్తున్న వినూత్నకి, కార్యకర్తలకీ ''ఈవిడ మా పెద్దమ్మ. మిగతా విషయాలు తరువాత చెప్తాను'' సెలవంటూ నమస్కరించి ఉషాకాంతని పట్టుకుని ముందుకు నడిచింది. కారు సిద్ధంగా ఉంది. అంద్రూ ఒకే కారులో ఎక్కారు.

కారు కదిలింది. ఎవరూ ఏమీ మాట్లాడకుండా అచేతనంగా అలా కూర్చుండిపోయారు.

కారు ఇల్లు చేరేదాక ఎవరి నోటినుంచి శబ్ధంలేదు. అందరూ మౌనంగా రోదిస్తున్నారు.

కారు దిగి అక్కా చెల్లెళ్ళిద్దరూ, తల్లిని పెద్దమ్మనీ చెరో చేత్తో పట్టుకుని లోపలికి తీసుకువచ్చారు.

ఇంట్లో అడుగుపెట్టగానే సంధ్యలో అప్పటిదాకా బిగపట్టుకున్న దుఃఖం పెల్లుబికింది.

''నిన్నెంత కష్టపెట్టామక్కా మేమంతా కలిసి. నీకు చాలా అన్యాయం చేసాం కదక్కా!'' అంటూ కుప్పకూలిపోయింది సంధ్య.

అయోమయంగా ఏడుస్తున్న సంధ్యవైపు చూసింది ఉషాకాంత.

అప్పటిదాకా ఏం జరుగుతోందో తెలియక మొద్దుబారినట్టు అయిన మెదడు అప్పుడే పనిచేయడం ప్రారంభించింది. తన ఎదురుగా శోకమూర్తిగా ఉన్నది తన తోడబుట్టిన చెల్లెలు సంధ్య అని అర్ధమయేసరికి ఆవిడకి ఏం చేయాలో, ఎలా రియాక్ట్ అవాలో పాలుపోలేదు. అయోమయంగా చూస్తూ నిలబడిపోయింది.

ఆవిడ వాలకం చూస్తుంటే భయం వేసింది మౌనికకు. ఆవిడ భుజాలు పట్టి కుదుపుతూ "పెద్దమ్మా" అని పిలిచింది.

ఆవిడ శూన్యంగా చూసింది.

"ఇలా చూడు ఇది నా చెల్లెలు సుప్రియ. అమ్మ మా అమ్మ సంధ్యాదేవి మీ చెల్లెలు. చూడండి పెద్దమ్మా మేము మీ బంధువులం. మీకు ఎవరూ లేరు అని ఇంకెప్పుడూ బాధపడకుండా మేము మీకున్నాం."

సుప్రియ ఆవిడ దగ్గరగా వచ్చి ఒంగి పాదాలు తాకింది. ఆమె కళ్ళ నుంచి కారిన రెండు కన్నీటి బిందువులు ఆమె పాదాలపై పడడంతో ఆ స్పర్శకి చలనం వచ్చినట్టు అయి "నా తల్లీ మౌనికా అంటూ గభాల్న మౌనికను కౌగిట్లోకి తీసుకుంది ఉషాకాంత. దేవతలా నా ఇంటికి వచ్చి మా అక్కా చెల్లెళ్ళను కలిపావా? నా జీవిత చరిత్ర రాస్తానని చెప్పి నా కథతా తెలుసుకుని నా చెల్లెల్ని నాకు చేర్చావా? నువ్వు నిజంగా దేవతవే.. దేవతవే. పదే, పదే మౌనిక నుదురు ముద్దుపెట్టుకుంటూ సంధ్య వైపు చూసి మౌనికను గభాల్న వదిలేసి సంధ్య దగ్గరగా నడిచి ఆమెని దగ్గరకు తీసుకుంది."

"అక్కా.." అంటూ ఆవిడ గుండెలమీద వాలిపోయింది సంధ్య.

ఉషాకాంత కళ్ళనుంచి ధారాపాతంగా కన్నీరు కారుతోంది.

ఏంటి ఈ చిత్రం. దేవుడిలాంటి చిత్రాలు ఇంకా ఎన్ని చేస్తాడు? ఎప్పుడు విడిపోయాం. ఇప్పుడు ఇలా కలవడం ఏంటి? "సం సంధ్యా ఇది నిజమేనా? కలకాదుకదా!"

మౌనికా, సుప్రియా ఆవిడనే చూస్తున్నారు.

ఉష కళ్ళు సుప్రియవైపు తిరిగాయి. కుడిచేయి చాచి దగ్గరకు రమ్మన్నట్టు సైగ చేసింది.

సుప్రియ వేగంగా ఆవిడ దగ్గరగా వెళ్ళి ఆమె గుండెల మీద వాలిపోయింది.

సుమారు రెండు గంటల తరువాత అందరూ ఫ్రెషప్ అయి సోఫాల్లో కూర్చున్నాక ఆ అర్ధరాత్రి, నిద్రని మర్చిపోయి ప్రశాంతమైన మనసుల్తో ఉన్న వేళ ఉషాకాంత తన నిర్ణయం చెప్పింది.

"ఇక నుంచీ మీరంతా నా దగ్గరే, ఈ ఇంట్లోనే ఉంటారు. ఎక్కడికీ వెళ్ళద్దు. నేను చనిపోయేదాకా అందరం కలిసి ఉంటాం అంతే."

ఏదో చెప్పబోయిన సంధ్య నోరు మూసేసి మరీ అంది "మౌనిక తప్పకుండా పెద్దమ్మా. అందరం కలిసి ఉందాం. నా కోరిక అదే నిన్ను ఈ వయసులో ఒంటరిగా వదిలి మేము ఎక్కడికీ వెళ్ళం. అవును పెద్దమ్మా అందరం కలిసి ఉందాం అంది సుప్రియ.

ఉష ఇద్దర్నీ దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకుని అంది "నాకిద్దరు కూతుళ్ళున్నారు.. ఇంక ఏం లోటు?"

ముగ్గురినీ అలా చూస్తున్న సంధ్య ఆనంద భాష్పాలు తుడుచుకుంటూ నవ్వింది.

*వెన్నెల జల్లులాంటి ఉషాకాంత పాటల తోటలో విహరిస్తూ, నా ఈ సీరియల్‌ని ఆదరించిన కౌముది పాఠకులకు, నా 'రాగం తీసే కోయిల 'ను ఆదరించి, ప్రోత్సహించిన సంపాదకులు కిరణ్ ప్రభగారికి, కాంతిగారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.*

*అత్తలూరి విజయలక్ష్మి*